
మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 243 | గురువారం | 22 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



జ్వలించే జ్ఞాపకం

అమరవీరుల స్థూపం రూపానికి సిఎం ఆమోదం

ఏడంతస్థుల స్థూప భవనంలో కన్వెన్షన్ హాల్, ఆడియో విజువల్ థియేటర్, ఫొటో గ్యాలరీ, ఉద్యమ మ్యూజియం, రెస్టారెంట్ తదితరాలు ఉండేలా డిజైన్ రూపకల్పన

20 అడుగుల ఎత్తు జ్యోతి

లుంబినీ పార్కు ఆనుకొని ఉన్న మూడెకరాల స్థలంలో పాతిక మీటర్ల ఎత్తున నిర్మాణానికి వచ్చే నెలారంభంలో టెండర్లకు పిలుపు

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ అమరవీరుల స్థూపం డిజైన్‌కు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆమోదం తెలిపారు. వచ్చే నెల మొదటివారంలో టెండర్లను ఆహ్వానించనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ వర్గాల సమాచారం. తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశల్లో అమరులైనవారి జ్ఞాపకార్థం తెలంగాణ ప్రభుత్వం నగరంలో ఉన్నతమైన అమరుల స్థూపాన్ని నిర్మించాలని తలపెట్టింది. ఇందుకు రూ. 80 కోట్లను కూడా మంజూరు తరువాయి 6లో



ప్రియపై కేసులొద్దు

- సుప్రీంకోర్టు ఆదేశాలు
- దాఖలైన వాటిపై స్టే మంజూరు
- తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

న్యూఢిల్లీ : మలయాళ నటి ప్రియా ప్రకాశ్ వారియర్‌కు సుప్రీంకోర్టు నుంచి ఊరట లభించింది. తెలంగాణతో పాటు కొన్ని రాష్ట్రాలలో ఆమెపై దాఖలైన క్రిమినల్ కేసుల తాత్కాలిక నిలిపివేతకు బుధవారం సుప్రీంకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. ఆమె నటించిన ఒరు ఆదార్ లవ్ చిత్రంలో ఒక పాటపై తెలంగాణలో తనపైనా , చిత్ర తరువాయి 6లో

టిఆర్‌టి యథాతథం

- షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు
- తొలి రోజు హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో ఉన్నాయి
- మూడు రోజుల్లో మొత్తం హాల్ టికెట్లు : టిఎస్‌పిఎస్‌సి చైర్మన్

3లో



రాష్ట్రంలో విప్రో యూనిట్

3లో

- రూ.220 కోట్ల పెట్టుబడులు
- మహేశ్వరం వద్ద కాస్మోటిక్స్ తయారీ

ఢిల్లీ సిఎస్‌పై దాడి కేసులో

ఆప్ ఎంఎల్‌ఎ సరెండర్

న్యూఢిల్లీ : ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై దాడి కేసులో ఆప్ ఎంఎల్‌ఎ అమానతుల్లా ఖాన్ బుధవారం పోలీసులకు లొంగిపొయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై దాడి ఘటన మూడు సంవత్సరాల అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం, అధికార వ్యవస్థ మధ్య ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం రాత్రి ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసంలో సమావేశం జరుగుతున్న దశలో అధికార పార్టీ ఎంఎల్‌ఎలు అక్కడే ఉన్న తరువాయి 6లో





పల్లీ ధర పల్టీ

- రూ.4500-5000 నుంచి రూ.3300లకు పడిపోయిన వేరుశెనగ ధర
- వనపర్తి మార్కెట్‌యార్డులో సిండికేట్‌గా ఏర్పడిన వ్యాపారులు
- కొనుగోలుకు ముందుకురాని మద్దతుధర కేంద్రం
- రైతుల ఆగ్రహం, రాస్తారోకో
- గంటలతరబడి నిలిచిపోయిన ట్రాఫిక్

మన తెలంగాణ/ వనపర్తి: వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నాలుగు రోజుల క్రితం క్వింటాల్ వేరుశెనగకు రూ. 4,500 నుండి రూ.5వేల దాకా చెల్లించిన వ్యాపారులు అకస్మాత్తుగా రూ.3,300లకు కొనుగోలు చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటకు కనీస మద్దతు ధర కూడా ఇవ్వడం లేదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కూడా రైతులు తెచ్చిన పంటను కొనుగోలు చేయకపోవడంపై బుధవారం రైతులు ఆందోళన చేశారు. 250 నుండి 300 మంది మార్కెట్ యార్డు సమీపంలోని కొత్తబస్టాండ్ ప్రధాన రహదారిపై రాస్తారోకో, ధర్నాకు దిగారు. దాదాపు మూడు గంటల పాటు ధర్నా కొనసాగడంతో వనపర్తి పట్టణంలో భారీగా ట్రాఫిక్ స్థంబించి పోయింది.



దాదాపు కిలోమీటర్ మేర ఆర్‌టిసి బస్సులు, ప్రైవేట్ వాహనాలు నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి రైతులతో మాట్లాడి ధర్నాను విరమించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. రైతులు తెచ్చిన వేరుశెనగ, ధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తేనే ధర్నా విరమిస్తామని, మద్దతు ధర కల్పిస్తామని జిల్లా కలెక్టర్, మార్కెటింగ్ శాఖాధికారులు హామీ నివ్వాలని భీష్మించుకొని కూర్చోవడంతో ఆందోళన మరింత తీవ్రతరమైంది. ఆందోళనను విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఎ చిన్నారెడ్డి రైతుల ధర్నాకు సంఘీభావం ప్రకటించి వారికి మద్దతుగా ధర్నాలో కూర్చున్నారు. ప్రభుత్వం ఇటీవల తరువాయి 6లో

మృత్యు కారు

వనపర్తి జిల్లాలో అదుపుతప్పిన కారు మరోదాన్ని ఢీకొట్టడంతో 9 మంది మృతి



మన తెలంగాణ/ కొత్తకోట : వనపర్తి జిల్లా కొత్తకోట మండల పరిధిలోని కనిమెట్ట గ్రామ సమీపంలో ఉన్న 44వ జాతీయ రహదారి బుధవారం రక్తసిక్తమైంది. హైదరాబాద్ నుండి మూలమల్లకు వెళ్తున్న కారు టైరు పగలడంతో అది డివైడర్ దాటుకొని మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న 11 మందిలో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలను కోల్పోయారు. మిగిలిన నలుగురిలో ఇద్దరు సమీపంలోని ఆసుపత్రిలో మృతి చెందారు. హైదరాబాద్‌లోని మల్లాపూర్ కాలనీలో నివసిస్తూ పండ్ల వ్యాపారం చేస్తున్న మల్లేష్, ఆంజనేయులు, నాగేష్, బీరయ్య, రాజు, మొగులన్న ఆత్మకూర్ మండలం మూలమల్ల గ్రామంలో జరిగే వివాహ కార్యక్రమం, చిన్నచింతకుంట మండలం నెలికొండి తరువాయి 6లో

పిల్లల్లో డిప్రెషన్

- తల్లిదండ్రులే ఎక్కువ శ్రద్ధ పెట్టాలి
- నేను కూడా గతంలో మానసిక ఒత్తిడికి గురయ్యాను
- ఐటి కాంగ్రెస్‌లో బాలీవుడ్ నటి దీపికా పదుకొనే



మన తెలంగాణ / హైదరాబాద్ : సినిమాల్లో తన విజయాలు, పరాజయాల కంటే కూడా ప్రజల్లో మానసిక ప్రశాంతత నెలకొన్నప్పుడే తనకు విజయం దక్కినట్లు భావిస్తానని బాలీవుడ్ నటి దీపికా పదుకునే వ్యాఖ్యానించారు. ఐటి రంగంలోని ఉద్యోగుల్లో, చిన్నపిల్లల్లో ఇటీవల డిప్రెషన్ ఎక్కువగా చోటు చేసుకుంటోందని, ఈ రుగ్మత రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత పాఠశాల ఉపాధ్యాయుల కంటే తల్లిదండ్రులపైనే ఎక్కువగా ఉందన్నారు. తాను కూడా గతంలో మానసిక ఒత్తిడికి గురయ్యానని పేర్కొన్న ఆమె ఆ అనుభవాలను ప్రస్తావించారు. ప్రపంచ ఐటి సదస్సు ముగింపు కార్యక్రమానికి బుధవారం ఆత్మీయ అతిథిగా హాజరైన దీపిక చర్చాగోష్ఠిలో సభికులతో మాట్లాడుతూ, వృత్తిపరంగా డిప్రెషన్‌తో బాధపడుతున్న సమయంలో తాను కనీసం ఇంటి నుండి బయటికి కూడా రాలేకపోయానని, స్నేహితులకూ సమాధానం చెప్పుకోలేక పోయానన్నారు. డిప్రెషన్ సమస్య యావత్తు ప్రపంచాన్నే వేధిస్తోందన్నారు. 'లివ్ లాఫ్ ఫౌండేషన్' ద్వారా ప్రజల్లో అవగాహన పెంచుతున్నామని, కర్నాటకలోని ఒక జిల్లాలో తమ సంస్థ మానసిక తరువాయి 6లో

కుంచెపోటు



చూశావా స్వామీ.. నీకు గుడి, నాకు గూడు కట్టిస్తామని హామీ ఇచ్చి వాళ్లు కట్టేసుకున్నారు!

కమల్ పార్టీ

మక్కళ్ నీది మయ్యమ్

మధురై బహిరంగసభలో ప్రకటించిన నటుడు కమల్ హాసన్

మధురై: నట నాయకుడు రాజకీయ నాయకుడు అయ్యారు. ప్రముఖ నటుడు కమల్ హాసన్ బుధవారం మక్కళ్ నీది మయ్యమ్ (ప్రజా న్యాయ వేదిక) పేరిట రాజకీయ పార్టీ స్థాపించారు. విభిన్న కథాంశాలతో సినిమాల్లో తరువాయి 6లో





ఇంటింటికీ ఇంటర్నెట్

ఈ ఏడాది చివరికల్లా సాకారం : మంత్రి కెటిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : ఈ ఏడాది చివరి నాటికి టి ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని ఇళ్ళకు, సంస్థలకు ఇంటర్‌నెట్ బ్రాడ్ బ్యాండ్ సేవలను అందుబాటులోకి తెస్తామని ఐటి శాఖ మంత్రి కెటి రామారావు తెలిపారు. బ్రాండ్‌బ్యాండ్ సదుపాయాలు కల్పించిన తర్వాత గ్రామాలు, పట్టణాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల డిజిటైజేషన్ ద్వార విద్యావ్యవస్థ కొత్త పుంతలు తొక్కనుందని చెప్పారు. ఇప్పటికే వైద్య రంగంలో టెలీ మెడిసిన్‌ను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని నాలుగు గ్రామాలను హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు అనుసంధానించామని తెలిపారు. వైద్యరంగంలో టెలీ మెడిసిన్, ఐఒటి ద్వారా వివిధ సేవలలో తరువాయి 6లో

ఇపిఎఫ్ వడ్డీరేటు 8.55 శాతానికి తగ్గింపు

9

పిఎన్‌బి స్కాంలో అవసరమైతే జోక్యం : సుప్రీం

10

30 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

6

నేడు సేవాదళ్ సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్: గాంధీ భవన్‌లోని ఇందిరా భవన్‌లో గురు వారం ఉదయం 11 గంటలకు సేవాదళ్ రాష్ట్ర స్థాయి సదస్సు జరుగు తుందని సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, మాజీ ఎంఎల్‌సి కనుకుల జనార్దన్‌రెడ్డి తెలిపారు. దీనికి కాంగ్రెస్ సీనియర్ నేతలు కుంటియా, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జానారెడ్డి, షబ్బీర్ అలీ, భట్టి విక్రమార్క తదితరులు హాజరవుతారని ఒక ప్రకటనలో చెప్పారు.

కర్నె వ్యాఖ్యలపై ఖండన

మన తెలంగాణ/హైదరాబాద్: కాంగ్రెస్ బస్సు యాత్ర ప్రకటన టిఆర్‌ఎస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని టిపిసిసి పేర్కొంది. గురువారం గాంధీ భవన్‌లో టిపిసిసి అధికార ప్రతినిధి నగేశ్ విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ చేపట్టనున్న బస్సు యాత్రపై టిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ యాత్ర ద్వారా ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

ఆ జాబితా నమ్మొద్దు : ఉత్తమ్



మన తెలంగాణ/హైదరాబాద్: గత కొంత కాలంగా సోషల్ మీడియాలో లోక్‌సభ, శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లతో తిరుగుతున్న జాబితాను ఎవరూ నమ్మవద్దని టిపిసిసి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ జాబితాను ఎఐసిసి ఆమోదించిందని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. ఇంకా అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఎలాంటి కసరత్తు లేదా చర్చ జరగలేదని స్పష్టం చేశారు.

హోం కార్యదర్శి సమావేశం వాయిదా

- 27న హైదరాబాద్‌కు మారిన వేదిక

మన తెలంగాణ/హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదంగా ఉన్న అంశాలపై చర్చించేందుకు హోం శాఖ ఈ నెల 23న ఏర్పాటుచేసిన సమావేశం వాయిదా పడింది. తెలంగాణ ప్రధాన కార్యదర్శి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ సమావేశం వాయిదా పడినట్లు తెలిసింది. ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లో రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు 'వివాదాల పరిష్కార కమిటీ' సభ్యుల సమావేశం ఉన్నందువల్ల దానికి కేంద్ర హోంశాఖ కార్యదర్శి హాజరవుతారని, అప్పుడే అన్ని అంశాలను చర్చించుకోవచ్చని కేంద్రం నుంచి సమాచారం అందినట్లు తెలిసింది. పునర్ వ్యవస్థీకరణ చట్టం అమలులోకి వచ్చి దాదాపు నాలుగేళ్లు కావస్తున్నందున అందులోని 13వ షెడ్యూలులో పేర్కొన్న హామీల అమలు ఏ స్థాయిలో ఉందో సమీక్షించి రెండు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదనుగుణమైన కార్యాచరణ చేపట్టాలన్నది నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న కేంద్ర హోం శాఖ అభిప్రాయం. అందుకోసమే తొలుత ఈ నెల 21వ తేదీన సమావేశాన్ని ఖరారు చేయగా, జాతీయ ఎస్‌సి కమిషన్ తెలంగాణ పర్యటన సందర్భంగా జరిపే సమీక్షలో విధిగా ప్రధాన కార్యదర్శి హాజరుకావాల్సి ఉన్న నేపథ్యంలో తేదీని వాయిదా వేయాల్సిందిగా కేంద్ర హోంశాఖకు విజ్ఞప్తి చేశారు.

దాని ప్రకారం ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది. అయితే ఆరోజు కూడా ముఖ్యమైన కార్యక్రమం ఉందని సిఎస్ ఎస్‌కె జోషి పేర్కొనడంతో మళ్ళీ వాయిదా పడింది. తదుపరి ఎప్పుడు జరిగేదీ తేదీని ప్రకటించలేదు. అయితే రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు తొమ్మిదవ, పదవ షెడ్యూలులోని సంస్థల విభజనతో పాటు మరికొన్ని వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు ఈ నెల 27న సమావేశం ఖరారు చేసినందున దానికి కేంద్ర హోంశాఖ కార్యదర్శి హాజరై 13వ షెడ్యూలులోని అంశాలను కూడా సమీక్షించనున్నట్లు తెలిసింది.

మండల కార్యాలయాల్లో ఐటి విస్తరణ

- రిజిస్ట్రేషన్ అవసరాలకు అనుగుణంగా సర్వీసులను విస్తృత పరుచనున్న నిపుణులు



మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే నెల 11 నుంచి మండల రెవెన్యూ అధికారులే భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ లాంటి వ్యవహారాలను నిర్వహించనున్నందున ఆ అవసరాలకు అనుగుణంగా కంప్యూటర్ నెట్‌వర్క్, బ్యాండ్‌విడ్త్‌లను విస్తృతం చేసే పనిలో రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ నిపుణులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర సెర్వర్‌తో అనుసంధానమైన 'స్వాన్' (స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్) బ్యాండ్‌విడ్త్‌ను 4 ఎంబిపిఎస్‌ను మూడు రెట్ల మేరకు పెంచి 12 ఎంబిపిఎస్‌కు చేరుస్తున్నట్లు అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటివరకూ సబ్‌రిజిస్ట్రార్‌లు మాత్రమే ఈ పనులను నిర్వహించినందువల్ల 144 ఆఫీసుల్లోని కంప్యూటర్లు మాత్రమే సెర్వర్‌తో అనుసంధానంగా ఉండేవని, ఇప్పుడు సుమారు 450 మండల కార్యాలయాలు కూడా అదనంగా వినియోగంలోకి వస్తున్నందున బ్యాండ్‌విడ్త్‌ను పెంచాల్సి వస్తోందని వివరించారు. సెర్వర్‌లో కూడా డాటా నిక్షిప్తం చేసే సామర్థ్యాన్ని పెంచుతున్నామని, ఒకేసారి అన్ని ఎంఆర్‌ఒ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సెర్వర్‌తో అనుసంధానమైనా తట్టుకునే విధంగా పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ లాంటి కార్యకలాపాలకు ఎక్కడా విఘాతం కలగరాదన్న ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రైవేటు మెయిల్స్ వాడితే రిమార్కు:


వివిధ శాఖల కార్యదర్శులు, విభాగాల అధిపతులు మొదలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది విధిగా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన మెయిల్స్‌ను మాత్రమే వాడాలని, ప్రైవేటు మెయిల్స్‌ను వాడితే సర్వీసు రికార్డులో రిమార్కులు రాయక తప్పదని ఒక అధికారి వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని ఇప్పటికే సర్క్యులర్ రూపంలో తెలియజేశామని, చాలామార్పు వచ్చిందని, అయినా చాలామంది ప్రైవేటు మెయిళ్లనే వాడుతున్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో సుమారు 3.15 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, కొన్నిచోట్ల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సైతం కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నందువల్ల వివిధ శాఖలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్దేశించిన మెయిళ్లను మాత్రమే వాడాలని స్పష్టం చేశామని, ఇప్పటివరకు సుమారు 50వేల మంది ఉద్యోగులు మాత్రమే ప్రభుత్వ మెయిళ్లను వాడుతున్నారని ఆయన వివరించారు. ఉద్యోగులకు పదోన్నతుల సమయంలో ఎఆర్‌సి (వార్షిక గోప్యత నివేదిక)లోని అంశాలు కీలకపాత్ర పోషిస్తాయని, ప్రభుత్వ మెయిళ్లకు బదులుగా ప్రైవేటు మెయిళ్లను వినియోగిస్తున్నట్లు ఆ నివేదికలో పేర్కొంటే ఆ మేరకు పదోన్నతిపై ప్రభావం చూపుతుందని, ఇకనుంచి ఈ తరహా విధానం అమలు చేయాల్సి ఉంటుందని ఉద్యోగులకు స్పష్టం చేశామన్నారు.

రాష్ట్రంలో 8 క్యాన్సర్ స్క్రీనింగ్, చికిత్స కేంద్రాలు

- అపెక్స్ కేంద్రంగా ఎంఎన్ హాస్పిటల్
- వైద్య మంత్రి లక్ష్మారెడ్డితో సమావేశమైన టాటా ట్రస్ట్ ప్రతినిధులు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో ఎనిమిది క్యాన్సర్ స్క్రీనింగ్, చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైన సాంకేతిక సహకారాన్ని టాటా ట్రస్ట్ నుంచి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డితో టాటా ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం సచివాలయంలో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. క్యాన్సర్ వైద్య పరీక్షలు, చికిత్సల్లో తగిన సహకారం అందించడానికి టాటా ట్రస్ట్ సభ్యులు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్ అపెక్స్ సెంటర్‌గా ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నారని, ఆదిలాబాద్ రిమ్స్, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజి, మహబూబ్‌నగర్, నిజామాబాద్ మెడికల్ కళాశాలల పరిధిల్లో ఒక్కొక్కటి చొప్పున, ఖమ్మం, కరీంనగర్, నల్గొండ జిల్లాల్లో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. విధివిధానాలు ఖరారైన వెంటనే వీటిని ఏర్పాటు చేస్తారని తెలిపింది. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, నేషనల్ హెల్త్ కమిషన్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, టాటా ట్రస్ట్ ప్రతినిధులు శ్రీనివాస్, అభిషేక్, మృణాళిని తదితరులు పాల్గొన్నారు.

భూ కుంభకోణంపై కేసు

మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, భూ కబ్జాదారుడు చంద్రయ్య యాదవ్ (ఫైల్)

మన తెలంగాణ/హైదరాబాద్/షాపూర్‌నగర్: బాచుపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించిన వైసిపి మాజీ జిల్లా అధ్యక్షుడు, ప్రస్తుత టిఆర్‌ఎస్‌నాయకుడు, మాజీ కార్పొరేటర్ రూ.100 కోట్ల విలువ చేసే భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఈ కేసు వ్యవహారం తేలేలోపే దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అదే మాజీ కార్పొరేటర్‌పై ఫోర్జరీ డాక్యుమెంట్ల కేసు నమోదైంది. ఇన్నాళ్లు చాపకింద నీరులా సాగిన నకిలీ డాక్యుమెంట్ల లీలలు బాచుపల్లి ఘటనతో బయటకు వచ్చాయి. బాచుపల్లిలో మాజీ కార్పొరేటర్‌పై కేసు నమోదు విషయం తెలుసుకున్న బాధితులు తమను కూడా బెదిరించారని ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. సూరారం బాధితులు బుధవారం దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం, బాలనగర్ డిసిపి, సైబరాబాద్ జాయింట్ సిపిని కలిసి ఫిర్యాదు చేయగా నిందితులపై వివిధ సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు దుండిగల్ సిఐ శంకరయ్య తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం గ్రామంలోని సర్వే నెం 180లో 4 కోట్ల విలువ చేసే 20గుంటల స్థలంపై మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, చంద్రయ్య యాదవ్ కన్నేశారు. ఆ స్థలం తమకు చెందిందంటూ 1982కు చెందిన నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూ యజమానులను గతంలో బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన భూయజమానులు బెదిరింపులకు భయపడి ఏమిచేయలేక పెద్దమనుషుల చుట్టూ తమ కాగితాలను చూపిస్తూ తిరుగుతున్నారు. ఇదిలా ఉండగా బాచుపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, చంద్రయ్య యాదవ్ ఇదే తరహాలో రూ.300 కోట్ల భూమి కాగితాలను 1982 నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జాలోకి వెళ్లేందుకు ప్రయత్నించి ఇరుక్కున్నారు. ఈ విషయం తెలుసుకున్న సూరారం బాధితులు ఎరుకల మల్లేశ్ బుధవారం దుండిగల్ స్టేషన్‌లో తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఇంతకాలం మాజీ కార్పొరేటర్ ఆగడాలకు భయపడి ఫిర్యాదు చేయలేదని, తమవద్ద పూర్తి ఒరిజినల్ డాక్యుమెంట్లు ఉన్నాయని, ఆన్‌లైన్‌లో కూడా తమ పేరుమీదే ఉందని ఎలాగైనా న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం బాలనగర్ డిసిపి సాయి శేఖర్, సైబరాబాద్ సిపి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన దుండిగల్ సిఐ శంకరయ్య సురేశ్ రెడ్డి, చంద్రయ్య యాదవ్‌పై కేసు నమోదు చేశారు. దర్యాప్తు తరువాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు.

భూ లూటీపై సమగ్ర పరిశీలన

- సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కొత్వాల్‌గూడ, బాచుపల్లి గ్రామాల్లో దాదాపు 1800 ఎకరాల భూమి దొంగ రికార్డులు సృష్టించి చేసిన భూ లూటీపై సీనియర్ ఐఎఎస్ అధికారి ఆధ్వర్యంలో సమగ్రమైన పరిశీలన జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో భూ మాఫియా హద్దు అదుపు లేకుండా పెరిగిపోతున్నదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాజాగా కుత్బుల్లాపూర్‌లో నియోజకవర్గం పరిధిలో బాచుపల్లి గ్రామంలో టిఆర్‌ఎస్ నాయకులు దొంగ రికార్డులు సృష్టించి రూ. 100 కోట్ల విలువైన భూములను తెగ నమ్ముకుంటున్న విషయం బైటపడిందన్నారు. ఒకవైపు భూ రికార్డుల ప్రక్షాళన ఎక్కడా లేని విధంగా జరుగుతోందని సిఎం కెసిఆర్ ఘనంగా ప్రకటనలు చేస్తున్న సందర్భంలోనే అధికార టిఆర్‌ఎస్ కార్యకర్తలు దొంగ రికార్డులు సృష్టించి భూములను కొల్లగొడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. మరోవైపు మియాపూర్ భూ కుంభకోణంలో ఒక్క గజం భూమి కూడా పోలేదని స్వయంగా సిఎం కెసిఆర్ చెప్పడం కబ్జాదారులకు ఊతమిస్తోందన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ రాజు నరిశెట్టికి చందూర్ జగతి పురస్కారం



మన తెలంగాణ/న్యూఢిల్లీ: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా జర్నలిజంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జర్నలిస్టులకు పొట్టి శ్రీరాములు స్మారక సమితి చందూర్ కుటుంబ సభ్యులు సంయుక్తంగా ప్రతీ ఏటా అందిస్తున్న ఎన్ఆర్ చందూర్ జగతి పురస్కారాన్ని 2018 సంవత్స రానికి గాను సీనియర్ జర్నలిస్ట్ రాజు నరిశెట్టికి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు బుధవారం ఆయన నివాసంలో జరిగిన ఒక కార్యక్రమంలో అందించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ పత్రికా రంగంలో రాజుగా ఎదిగిన రాజు నరహరిశెట్టికి అవార్డు ఇవ్వడం సంతోషమన్నారు. జర్నలిజంలో ప్రమాణాలు పాటిస్తే ప్రభుత్వ నియంత్రణ అవసరమే ఉండదన్నారు. జర్నలిజంలో విలువలు అవసరం అన్న ఉప రాష్ట్ర పతి, రాజకీయ పార్టీలు, వ్యాపార సంస్థలు పత్రికలు పెడుతున్నారని అన్నారు. ఎదుటి వారి స్వేచ్ఛను గౌరవించగలిగి, స్వీయ నియంత్రణ ఉండగలిగితే ప్రభుత్వ నియంత్రణ అవసరంరాదు అని పేర్కొన్నారు. పారదర్శకత, విశ్వసనీయత పెరిగితే జర్నలిజంపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుం దని సూచించారు. జర్నలిజాన్ని కొందరు వ్యాపారం కోసం నడుపుతున్నా రని అన్నారు. ఒక సాధారణ కుటుంబంలో పుట్టి ఇక్కడి వరకు వచ్చాను అంటే ప్రజా జీవితం గురుంచి తెలుసు అని వెంకయ్యనాయుడు అన్నారు. సమాజాన్ని కొందరు కులాలు, మతాలుగా చీలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు కూడా పత్రికలు నడుపుతున్నాయన్న ఆ యన, చాలా కుంభకోణాలను బయటకు తీసుకొచ్చింది రాజకీయపార్టీలు కాదు మీడియా సంస్థలే అని అన్నారు. జర్నలిజంలో విలువలు, సంప్రదా యాలు పాటించాలని సూచించారు. జర్నలిజంలో సత్యానికి దగ్గరగా, సంచలనానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు మాట్లాడు తూ జర్నలిజం చాలా గొప్పదన్నారు. మీడియాకు పత్రికా స్వేచ్ఛ ఎంత అవసరమో, అంతే స్వీయ నియంత్రణ అవసరమని సూచించారు.



రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం

మన తెలంగాణ/హైదరాబాద్: విద్యుత్ డిమాండ్, సరఫరాలో తెలంగాణ సరికొత్త రికార్డు సృష్టించింది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా బుధవారం ఉదయం 7.40 గంటల సమయంలో డిస్కంల డాష్‌బోర్డులో గరిష్ట (9894 మెగావాట్ల) డిమాండ్ నమోదైంది. సుమారు 202 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ప్రజలు వినియోగించారు. గతేడాది ఇదే రోజున 170.4 ఎంయుల విద్యుత్ వినియోగించగా, ఈ ఏడాది 31.5 మిలియన్ యూనిట్ల మేర పెరిగింది. భూగర్భజలాలు పెరగడం, వ్యవసాయానికి 24 గంటల సరఫరా జరగడమే దీనికి కారణమని, విద్యుత్ వినియోగం 200 ఎంయులకు చేరుకుంటుందని ఊహించలేదని అధికారులు వ్యాఖ్యానించారు. మంగళవారం ఉదయం సైతం ఇదే సమయానికి 9890 మెగావాట్ల డిమాండ్ నమోదైనట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి జనవరి 1 నుంచి 24 గంటల విద్యుత్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తుండడంతో ప్రస్తుత సీజన్‌లో 10,500 మెగావాట్లు డిమాండ్ రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. 11,500 మెగావాట్ల డిమాండ్ వచ్చినా సరఫరా చేయడానికి వీలుగా డిస్కంల యంత్రాంగం సిద్ధంగా ఉందని ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు స్పష్టం చేశారు. గ్రిడ్‌లో సమస్యలు వచ్చినా, సాంకేతికంగా ఇబ్బందులు ఏర్పడినా వెంటనే చక్కదిద్దడానికి సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని వివరించారు.

సోయాపై వెనుకడుగు

సాగుతో పాటు తగ్గుతున్న దిగుబడి

- దిగుబడులకు వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రణాళికలు
- వచ్చే వానాకాలం నుంచి అమలు

మన తెలంగాణ/హైదరాబాద్ : తక్కువ ఖర్చుతో, ఎక్కువ పని లేకుండా వచ్చే పంటగా పేరొందిన సోయా సాగుకు రైతులు వెనకడుగు వేస్తుండడంతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం తగ్గుతోంది. గత రెండేళ్లుగా మన రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులు రైతులకు ఏమాత్రం సహరించడం లేదు. వర్షధార పంట అయిన సోయా సాగుకు అవసరమైన సమయంలో వర్షాలు పడకపోగా, పంట చేతికొచ్చే దశలో పడుతుండంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తెగుళ్లు రావడంతో పంట దిగుబడి తగ్గిపోయింది. పాడైన పంటను కొనేందుకు ప్రభుత్వం కూడా ముందుకు రాలేదు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, కొత్త వంగడాలు రాకపోవడం, దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు ఈ పంట సాగుకు వెనకడుగు వేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ అధ్యయనంలో తేలింది. మద్దతు ధరను పెంచి, రైతులను ప్రోత్సహిస్తే సాగు పెంచవచ్చునని భావించిన అధికారులు తగిన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, సంగారెడ్డి, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రైతులు జెఎస్–335 రకం సోయాను సాగు చేస్తున్నారు. నల్లమట్టి, తేమను గ్రహించే నేలలు సోయా సాగుకు అనుకూలంగా ఉన్నందున ఆ నేలల్లోనే పంట వేస్తే లాభాదాయమకని విస్తృతమైన ప్రచారం చేపట్టాలని వ్యవసాయ శాఖ భావిస్తోంది. ఇందులో భాగంగానే రాజేంద్రనగర్‌లోని ఐకార్–జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ సహకారంతో దిగుబడులు పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసింది. వచ్చే వానాకాలం సీజన్ నుంచి అమలు చేయనుంది.

దిగుబడుల తగ్గుదలకు ఇవే కారణాలు

- సోయా విత్తనం వేసిన సమయంలో ఒక వర్షానికి ఇంకో వర్షానికి మధ్య అంతరం
- మొలకెత్తే సమయంలో తీవ్రమైన వర్షాలు పడటం
- ఎక్కువగా కొత్త రకం విత్తన వెరైటీలు అందుబాటులో లేకపోవడం.
- ఒకే నేలలో ఒకే రకమైన పంటను సాగు చేయడం (మోనో క్రాపింగ్)
- అధిక వర్షపాతంతో తెగుళ్ల బెడద రావడం

మూడేళ్లుగా సాగు వివరాలు

సంవత్సరం	విస్తీర్ణం (హెక్టార్లలో)
2015–16	2.54
2016–17	2.98
2017–18	1.65



సాగు పెంచేందుకు ప్రణాళిక

- జోన్‌ల వారీగా అనుకూలమైన ప్రాంతాల్లో విత్తన వెరైటీలను అందుబాటులోకి తీసుకురావాలి.
- తెగుళ్ల బెడద నష్ట పరిహారానికి ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలి.
- దిగుబడి పెరిగే విధంగా విత్తన అంకురోత్పత్తి (జర్మినేషన్) అధికంగా ఉన్నవాటినే ప్రోత్సాహించాలి.
- బిబిఎఫ్ సీడ్ డ్రిల్ చేయడం ద్వారా 20 నుంచి 25 శాతం దిగుబడి పెంచేలా చూడాలి.
- ఎరువుల పోషక నిర్వహణలో సమతుల్యం పాటించేలా చేయాలి.
- డ్రై స్పెల్స్ సమయంలో సాగునీరు అందేలా చూడాలి.
- మోనో క్రాపింగ్‌ను నివారించాలి.
- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు విత్తన బ్యాంకులను ఏర్పాటు చేయాలి.

మిషన్ కాకతీయ మీడియా అవార్డులు

మన తెలంగాణ/హైదరాబాద్: మిషన్ కాకతీయ–2017 మీడియా అవార్డులను బుధవారం ప్రకటించారు. నీటిపారుదల శాఖ నియమించిన జ్యూరీ 2017లో చేపట్టిన మిషన్ కాకతీయ మూడవ దశ పనులపై ప్రసార మాధ్యమాల్లో వచ్చిన కథనాలను, పరిశీలించి అవార్డులకు ఎంపిక చేసింది. ప్రింట్ మీడియా విభాగంలో ప్రథమ బహుమతి నోముల రవీందర్ రెడ్డి (ఆంధ్రజ్యోతి). రెండు, మూడో బహుమతులను అక్కలదేవి శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ), కె.మల్లికార్జునరెడ్డి (సాక్షి) దక్కించుకున్నారు. ఎలక్ట్రానిక్ మీడియా విభాగంలో కె.శ్రీశైలం (ఈటీవి 1)కి మొదటి బహుమతి వచ్చింది. రెండో, మూడో బహుమతులను బి.గురుప్రసాద్ (టివి1), కె.విక్రమ్ రెడ్డి (సాక్షి టివి) దక్కించుకున్నారు. జ్యూరీ ప్రత్యేక బహుమతిని పిల్లలమర్రి శ్రీనివాస్ (తెలంగాణ టుడే), యాట్ల చిన్నారెడ్డి (నమస్తే తెలంగాణ), ఫోటో జర్నలిస్టుల విభాగంలో గొట్టె వెంకన్న (నమస్తే తెలంగాణ), రజనీకాంత్ గౌడ్ (నమస్తే తెలంగాణ), వీడియో జర్నలిస్టుల విభాగంలో డి.సూర్యనారాయణ (ఈటీవి), అంజి (టీవి 1), జ్యూరీ ప్రత్యేక బహుమతులు శ్రీరాములు గౌడ్ (దూరదర్శన్ యాదగిరి), కాకతీయ విశ్వవిద్యాలయం, సోషియాలజీ విభాగం జాతీయ సెమినార్‌లో సమర్పించిన పత్రాల వ్యాసాల సంకలనానికి లభించాయి. మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ జ్యూరీ ఛైర్మన్‌గా వ్యవహరించగా, తెలంగాణ టుడే డిప్యూటీ ఎడిటర్ బాలకోటేశ్వరరావు, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి సభ్యులుగా వ్యవహరించారు. మిషన్ కాకతీయ మీడియా అవార్డులు పొందిన వారికి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.75,000, మూడో బహుమతికి రూ.50,000 నగదు బహుమతిగా ఇవ్వనున్నారు.

ఆర్‌టిసి ఇడిగా బాధ్యతల స్వీకరణ



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (టిఎస్‌ఆర్‌టిసి) నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ), సంస్థ కార్యదర్శిగా ఎం.వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు వెంకటేశ్వరరావు హైదరాబాద్ రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. డిపో మేనేజర్, డివిజినల్ మేనేజర్ (డివిఎం), డిప్యూటీ చీఫ్ మెకానికల్ (డిసిఎంఇ)గా సమర్థవంతంగా పనిచేశారు. సంస్థ ఆదాయాన్ని పెంచడమే తన మొదటి కర్తవ్యమని ఈ సందర్భంగా ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్, ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ ప్రిన్సిపల్ జి.ఆర్.కిరణ్, సిటిఎం రవీందర్‌తో పాటు పలువురు అధికారులు ఇడిగా బాధ్యతలు చేపట్టిన ఎం.వి.రావును ఆయన ఛాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు. ఇంతకుముందు టిఎస్ ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ), సంస్థ కార్యదర్శిగా ఉన్న డి.వేణు జనవరి 31వ తేదీన పదవీ విరమణ పొందడంతో యాజమాన్యం ఆ బాధ్యతల్లో ఎం.వెంకటేశ్వరరావును నియమించింది.

హజ్ కమిటీకి పాస్‌పోర్టులు

మన తెలంగాణ/హైదరాబాద్: హజ్ సీజన్ –2018లో తెలంగాణ నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు ఎంపికైన 3586 మంది యాత్రికుల ఇంటర్నేషనల్ పాస్‌పోర్టులను కేంద్ర హజ్ కమిటీకి పంపించినట్లు రాష్ట్ర హజ్ కమిటీ తెలిపింది. వీసా ప్రాసెసింగ్ కోసం వీటిని పంపించినట్లు రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ మొహమ్మద్ మసిఉల్లా ఖాన్ తెలిపారు. కేంద్ర హజ్ కమిటీకి పంపించిన పాస్‌పోర్టుల్లో 70 ఏళ్లకు పై బడిన 508 మంది భక్తులు నేరుగా ఎంపిక కాగా, మిగితా వారిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. హజ్‌యాత్రకు ఎంపిక కాబడిన 67మంది భక్తులు తమ సీట్లను రద్దు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది హజ్ యాత్ర కోసం మొత్తం 17,130 మంది రాష్ట్ర హజ్ కమిటీకి దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఎంపికైన వారి నుంచి మొదటి వాయిదా హజ్ ఖర్చులు రూ. 81 వేలు రాష్ట్ర హజ్ కమిటీ వసూలు చేసింది.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలకు శిక్షణ

మన తెలంగాణ/హైదరాబాద్: బిసి, గిరిజన సంక్షేమ శాఖ ల ఆధ్వర్యంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయనున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ అభ్యర్థులకు మైనార్టీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ లభించనుంది. అర్హులైన ముస్లిం, బుద్దిస్ట్, జైన్స్, సిక్కులు, క్రైస్తవ మైనారిటీ అభ్యర్థులు ఫిబ్రవరి 23 నుంచి దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సూచించారు. మార్చి 6 దరఖాస్తుకు చివరి తేదీ అని చెప్పారు. తరగతులు మార్చి 9 నుంచి హైదరాబాద్‌లోని తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్‌లో జరుగుతాయని తెలిపారు. గ్రాడ్యుయేషన్, డిప్లొమా ఎడ్యుకేషన్, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదోతరగతి, డిగ్రీ ప్రొవిజనల్, కన్సాలిడేటెడ్ డిగ్రీ మెమో, ఎడ్యుకేషన్ డిప్లొమా, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సత పరుచాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 04023236113 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

రైతు సేవా కేంద్రాల విస్తరణ

మన తెలంగాణ/హైదరాబాద్: వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు రైతు సేవా కేంద్రాలను (కస్టమ్ హైరింగ్ సెంటర్) విస్తరించనున్నట్లు వ్యవసాయ శాఖ కమిషనర్ డా.ఎం. జగన్‌మోహన్ తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుతో వ్యవసాయానికి కూలీల కొరత ఇబ్బందిగా మారిందని ఆయన బుధవారం మీడియాకు చెప్పారు. ఇటీవల సిఎం కె.చంద్రశేఖర్‌రావు ఉన్నతాధికారుల సమీక్షలో సబ్సిడీపై భారీగా వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పినట్లు తెలిపారు. అందులో భాగంగానే సిహెచ్‌సి (కస్టమ్ హైరింగ్ సెంటర్)లను రైతు సేవా కేంద్రాలుగా విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ట్రాక్టర్లు అధికంగా ఇచ్చామని, వరినాట్లు వేసే యంత్రాలను ఎక్కువ సంఖ్యలో పంపిణీ చేసే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. సిఎం ఆదేశాలకనుగుణంగా ముందుకు వెళ్తామని కమిషనర్ తెలిపారు.

లారీలు, ట్రాక్టర్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మరు : కర్నె

మన తెలంగాణ/హైదరాబాద్: కాంగ్రెస్‌ది బస్సు యాత్ర కాదు బోగస్ యాత్ర అని టిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ అన్నారు. ఆ పార్టీ బస్సు యాత్ర చేసినా, లారీ యాత్ర చేసినా, ట్రాక్టర్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మబోరని, వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. టిఆర్‌ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు పార్టీలో తమ పదవులు కాపాడుకునేందుకే బస్సు యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు ఏ యాత్ర చేసినా ప్రభుత్వం గొప్పతనం గురించి చెప్పాల్సి వస్తుందన్నారు.

విప్రో రూ.220 కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో సబ్బులు, సౌందర్య సాధనాల తయారీ యూనిట్



- మహేశ్వరం వద్ద 40 ఎకరాల స్థలం కేటాయిస్తాం
- ఐటి శాఖ మంత్రి కెటిఆర్
- విమెన్ ఇంక్యుబేటర్ 'విహబ్'లో భాగస్వామ్యం కావాలని

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణలో రూ. 220 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు విప్రో సంస్థ ముందుకు వచ్చింది. మూడో రోజు ప్రపంచ ఐటి కాంగ్రెస్ సదస్సులో భాగంగా ఈ మేరకు విప్రో సంస్థ చీఫ్ స్ట్రాటజీ అధికారి రిషీద్ ప్రేమ్ జీ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కెటి. రామారావుతో సమావేశమయ్యారు. తెలంగాణలో తాము సబ్బులు, సౌందర్య సాధనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలను భావిస్తున్నామని, ఇందుకోసం రూ. 220 కోట్లు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మహేశ్వరం మండలంలో విప్రోకు 40 ఎకరాల స్థలం కేటాయిస్తామని, ఈ కంపెనీ రాకతో 300మందికి ప్రత్యక్షంగా, మరో 200 మందికి పరోక్షంగానూ ఉపాధి లభిస్తుందన్నారు. తెలంగాణలో విప్రో ఇప్పటికే ఇతర రంగాల్లో పెద్దఎత్తున కార్యకలాపాలను నిర్వహిస్తోందని ఈ సందర్భంగా కెటిఆర్ గుర్తుచేశారు. రాష్ట్రంలో రూ. 220 కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చిన విప్రోకు కెటిఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రిషీద్ ప్రేమ్ జీతో కెటిఆర్ సెల్ఫీ దిగారు. టెక్నాలజీ , ఇన్నోవేషన్ రంగాల్లోనూ తెలంగాణ దేశంలోనే ముందు వరుసలో ఉందని, టి హబ్, టి వర్క్స్ వంటి కార్యక్రమాలపై ఈ సమావేశంలో రిషీద్‌కు వెల్లడించారు. త్వరలో ఏర్పాటు చేస్తున్న విమెన్ ఇంక్యుబేటర్ 'వి హబ్'లో భాగస్వామ్యం కావాలని విప్రోకు కెటిఆర్ విజ్ఞప్తి చేశారు. ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటి రంగాన్ని తీసుకెళ్లేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని, ఇందుకోసం ఇప్పటికే పలు జిల్లాల్లో ఐటి టవర్ల నిర్మాణం, టాస్క్ ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వరంగల్ పట్టణంలో సైయంట్ సంస్థ తమ కార్యకలాపాలను ఇప్పటికే నిర్వహిస్తోందని, తాజాగా టెక్ మహీంద్రా కూడా తన క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిందని విప్రో రషీద్ ప్రేమ్ జీకి కెటిఆర్ వెల్లడించారు.

పంచాయతీలకు ఒఎఫ్‌సి ఇంటర్నెట్

మన తెలంగాణ/హైదరాబాద్: పంచాయతీల స్థాయి వరకు డిజిటల్ పాలనను తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో పంచాయతీరాజ్ శాఖ ఒఎఫ్‌సి (ఆప్టికల్ ఫైబర్ కేబుల్) లైన్ల నిర్మాణాన్ని వేగవంతం చేసింది. గ్రామపంచాయతీల్లో కంప్యూటర్ సహా ఇంటర్నెట్ సౌకర్యాన్ని వినియోగించుకునే పరికరాలను పంపిణీ చేసింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని పంచాయతీలను 'ఇ పంచాయతీ'లుగా మార్చడంలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కొన్నింటిలో డిజిటల్ పాలన అందిస్తోంది. 'టి ఫైబర్' సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో మొబైల్ సిమ్‌ల ఆధారంగా నడిచే డాంగిల్‌లను పంచాయతీ అధికారులు వినియోగిస్తున్నారు. ఇందులోని 'సిగ్నల్' ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం మిషన్ భగీరథ త్రాగునీటి పైపులతో పాటు అమర్చిన ఒఎఫ్‌సి కేబుళ్ళ ద్వారా ఇకపైన డిజిటల్ సౌకర్యాన్ని ఎంపిక చేసిన 'ఇ పంచాయతీ'లకు సమకూర్చడానికి పంచాయతీరాజ్ శాఖ కసరత్తు చేస్తోంది. వచ్చే నెల నుంచి ఇలాంటి పంచాయతీల సంఖ్యను పెంచాలని భావిస్తోంది. ఇప్పటికే 44,323 కిలోమీటర్ల లైన్ల నిర్మాణం పూర్తయిందని, 6,995 గ్రామాల వరకు ఒఎఫ్‌సి సౌకర్యం లభిస్తుందని అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. మిషన్ భగీరథ ప్రారంభోత్సవంతోపాటే ఒఎఫ్‌సి ద్వారా పలు సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 8684గ్రామపంచాయతీల్లో 5765 'ఇ–పంచాయతీ'లుగా ఎంపికయ్యాయి. ఒఎఫ్‌సి పనులు పూర్తయిన వెంటనే యుద్ధప్రాతిపదికన 'ఇ పంచాయతీ'లుగా మార్చి తగిన విద్యార్హత, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారిని 'ఔట్‌సోర్సింగ్' పద్ధతిలో ఆపరేటర్లుగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

షెడ్యూల్ ప్రకారమే టిఆర్‌టి పరీక్షలు

- అభ్యర్థులు పుకార్లను నమ్మొద్దు
- మూడు రోజుల్లో హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో
- టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ ఘంటా చక్రపాణి

మన తెలంగాణ/హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష(టిఆర్‌టి)లు యథావిధిగా షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని, అభ్యర్థులు ఆందోళన చెందవద్దని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. టిఆర్‌టి పరీక్షా కేంద్రాల కేటాయింపులో సిజిజి (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్)లో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా హాల్‌టిక్కెట్ల జారీని నిలిపి వేశామని తెలిపారు. ఈ నెల 24 నుంచి టిఆర్‌టి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తొలిరోజు పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, బుధవారం సాయంత్రం నాటికి 9,500 మంది అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. మిగతా తేదీల పరీక్షల హాల్‌టికెట్లు మూడు రోజుల్లో వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ప్రకటించారు. బుధవారం టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఎ.వాణిప్రసాద్, సభ్యులు సి.విఠల్, చంద్రవతి, మహ్మద్ మతీనుద్దీన్ ఖాద్రి, రామ్మోహన్‌రెడ్డి, చింత సాయిలుతో కలిసి ఛైర్మన్ ఘంటా చక్రపాణి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని కోరారు. మొత్తం 48 సెషన్లుగా టిఆర్‌టి పరీక్షలు జరుగుతాయని, మొట్టమొదటిసారి మూడు పరీక్షలు మినహా అన్ని పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు. సాధ్యమైనంతవరకు ఏ జిల్లా అభ్యర్థులకు కేంద్రాలను ఆ జిల్లాలోనే కేటాయించామని, సొంత జిల్లాలో కేంద్రాలు సరిపోకపోతే ఇతర జిల్లాలో కేటాయించినట్లు అన్నారు. మొదటిరోజు 60 పరీక్షా కేంద్రాలలో ఉదయం 17,975 మంది, మధ్యాహ్నం 17,052 మంది అభ్యర్థులు ఆన్‌లైన్ పరీక్షలు రాస్తారని తెలిపారు. టిఎస్‌పిఎస్‌సిలో ఐటి సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినా కార్యాలయంలో సరిపోయేంత స్థలం లేకపోవడంతో ఏర్పాటు చేయలేకపోతున్నామన్నారు. త్వరలోనే ఐటి సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటివరకు తమకు 30,618 పోస్టులకు అనుమతులు రాగా, ఇండెంట్లు రాని 3 వేల పోస్టులు మినహా అన్ని పోస్టులకూ నోటిఫికేషన్లు జారీ చేశామని పేర్కొన్నారు. ఎస్‌పిఎస్‌సి కార్యదర్శి వాణిప్రసాద్ మాట్లాడుతూ ఒక అభ్యర్థికి ఒకేరోజు రెండు పరీక్షలు ఉంటే ఒకే పరీక్షా కేంద్రం కేటాయించినట్లు చెప్పారు. అభ్యర్థులకు సమస్యలుంటే టిఎస్‌పిఎస్‌సి కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ఫోన్‌గానీ లేదా నేరుగా గానీ సంప్రదించాలని పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. సి.విఠల్ మాట్లాడుతూ, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో పలు పరీక్షలపై అసత్య ప్రచారం చేశారని గుర్తు ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు.



ఆంగ్లంలోనూ పిఇటి ప్రశ్నపత్రం

మన తెలంగాణ/హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్షల్లో పిఇటి (ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్) పోస్టుల పరీక్షకు హాజరయ్యే తెలుగు మాధ్యమాన్ని ఎంచుకున్న అభ్యర్థులకు ఇంగ్లీషులో కూడా ప్రశ్నాపత్రం ఉండేలా చేయాలని టిఎస్‌పిఎస్‌సిని హైకోర్టు ఆదేశించింది. పిఇటి సిలబస్ ఇంగ్లిషులో ఉందని, తెలుగులో పశ్నాపత్రం ఉంటే అభ్యర్థులు నష్టపోతారని పేర్కొంటూ నల్లగొండకు చెందిన వెంకటరమణ దాఖలు చేసిన రిట్‌ను బుధవారం హైకోర్టు విచారించిం ది. ప్రశ్నాపత్రం తెలుగుతో పాటు ఇంగ్లిషు కూడా ఉండేలా చేయాలని టిఎస్‌పి ఎస్‌సిని న్యాయమూర్తి రామచంద్రరావు ఆదేశించారు.

ఎసిబికి చిల్లిగవ్వ దొరకలేదు

- పురుషోత్తమరెడ్డి కేసులో కొనసాగుతున్న సోదాలు

మన తెలంగాణ/హైదరాబాద్: హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తమరెడ్డి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఎసిబి అధికారులకు వి చిత్ర అనుభవాలు ఎదురవుతున్నాయి. అక్రమంగా కోట్లాది రూపాయలు సంపాదించుకున్నట్లు నిర్దిష్టమైన సమాచారం ఉన్నా అవి ఎక్కడున్నాయో, ఎవరి వద్ద ఉన్నాయనే వివరాలు మాత్రం ఇప్పటికీ లభించలే దు. పురుషోత్తమ రెడ్డి బావమరిది శ్రీనివాస్‌రెడ్డి ఇంటిపై 20 రోజుల తరువాత సోదాలు చేయడంతో ఎసిబి అధికారులకు చిల్లిగవ్వ కూడా దొరకలేదు. పురుషోత్తమరెడ్డి ఆస్తుల వివరాలు దొర క్కుండా శ్రీనివాస రెడ్డి కుటుంబసభ్యులు పకడ్బందీగా వ్యవహరించారు. ఎస్ఆర్‌నగర్ కాలనీలోని శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో సుమారు ఆరు గంటల పాటు సోదాలు చేసిన ఎసిబి అధికారులకు గదులల్లోని కప్ బోర్డ్‌లు, బీరువాలు ఖాళీగా కని పించాయి.

దళితుల పథకాలకు 'డెడ్‌లైన్లు' ఏవి?


- ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

మన తెలంగాణ/హైదరాబాద్: పార్లమెం టు బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై ఒత్తిడి తేవాలని, టిఆర్‌ఎస్ ఎంపిలు తమ గళాన్ని వినిపించాలని ఎంఆర్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం సచివాలయంలో మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. సిఎం కెసిఆర్ గతంలో హామీనిచ్చినట్లుగా అఖిల పక్ష బృందాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్లాలన్నారు. తమ 24ఏళ్ల ఉద్యమ చరిత్రలో తొలిసారిగా బంద్‌కు పిలుపునిస్తున్నా మని, టిఆర్‌ఎస్ సహా అన్ని పార్టీలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. దళితులకు 3 ఎకరాల భూమి పథకంపై ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టులు, పథకాలకు డెడ్‌లైన్ పెట్టి మరీ పనిచేస్తున్నారని, ఇదే వేగం, స్ఫూర్తిని దళితులకు 3 ఎకరాల పథకంపై ఎందుకు పెట్టడం లేదని పునరుద్ఘటించారు.

ఎస్‌సిల అభివృద్ధి అంతంత మాత్రమే

- కేటాయింపుల్లో సగం నిధులు కూడా ఖర్చు కాలేదు
- అత్యాచార కేసులు పెరిగాయి
- జాతీయ ఎస్‌సి కమిషన్ తీవ్ర అసంతృప్తి

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణలో ఎస్‌సిల అభివృద్ధిపై జాతీయ ఎస్‌సి కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో సగం కూడా ఖర్చు చేయకపోవడాన్ని కమిషన్ వేలెత్తి చూపింది. జాతీయ ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ రామ్ శంకర్ కథేరియా నేతృత్వంలో కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో బుధవారం సమావేశమై ఎస్‌సి అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రభుత్వ పథకాల అమలుతీరును సమీక్షించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, డిజిపి మహేందర్ రెడ్డి, 38 శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌సి పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని కమిషన్ తప్పుపట్టింది. సమీక్షానంతరం జాతీయ కమిషన్ ఛైర్మన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. గతేడాది ఎస్‌సిల అభివృద్ధికి బడ్జెట్‌లో 7వేల కోట్లు కేటాయిస్తే రూ.4 వేల కోట్లు మాత్రమే ఖర్చయిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.14 వేల బడ్జెట్ కేటాయింపుల్లో సగం కూడా ఖర్చు కాలేదన్నారు. రాష్ట్రంలో ఎస్‌సిలపై హత్యలు, అత్యాచారాలు, నేరాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దళితుల కేసుల పరిష్కారం కూడా అంతంత మాత్రంగానే ఉందని వ్యాఖ్యానించారు. కమిషన్ వైస్ ఛైర్మన్ మురుగన్ మాట్లాడుతూ ఎస్‌సి విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీ రీయింబర్స్‌మెంట్, దళితులపై దాడులు, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన, ముద్రా యోజన, తదితర పథకాలపై రాష్ట్ర అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పథకాల అమలులో లోపాలున్నాయని, వాటిని అధికారుల దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. వైద్యారోగ్యం, పారిశుద్ధ్యం, పంచాయతీ రాజ్ తదితర విభాగాల్లో నిధుల వినియోగంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దళితులపై దాడులు, అత్యాచారాలకు సంబంధించి 2015 నుంచి 2017 వరకు 1860 కేసులు, 1896 పిటీ కేసులు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేసుల పరిష్కారంలో జాతీయ సగటు కంటే తెలంగాణలో తక్కువ రేటు ఉందని తెలిపారు. 2015 లో 17 అత్యాచార, హత్య కేసులు నమోదైతే తొమ్మిది కేసుల్లోనే ఛార్జిషీట్‌లు దాఖలయ్యాయని, 2016లో 32 కేసులకు గాను ఎనిమిది కేసుల్లోనే దాఖలయ్యాయని ఉదహరించారు. గతేడాది 12 కేసుల్లో ఒక్క ఛార్జిషీట్ కూడా దాఖలు కాలేదన్నారు. ఫలితంగా బాధితులకు న్యాయం జరగడం లేదని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో దళితుల అక్షరాస్యత రేటు తగ్గడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కమిషన్ సభ్యుడు రాములు మాట్లాడుతూ ఎస్‌సిలకు నిధులు కేటాయించడంతోనే సరిపెట్టుకోకుండా; వాటిని విడుదల చేసి ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయడంపైనా దృష్టి పెట్టాలని వ్యాఖ్యానించారు. ఎస్‌సిలకు గతంలో అసైన్డ్ చేసిన భూములను ఇప్పుడు డబుల్ బెడ్‌రూం ఇళ్ళ నిర్మాణం కోసం తీసుకోవడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. నేరేళ్ల కేసులో చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



"మన స్వేచ్ఛ పత్రికాస్వాతంత్ర్యంపై ఆధారపడి ఉంటుంది.
– థామస్‌జఫర్‌సన్"

అవినీతి పరులకు రక్షకులెవ్వరు?

సంపాదకీయం

భారతీయ పాలనా వ్యవస్థలో అవినీతి సర్వవ్యాప్తం. దానిలో పాలకవర్గ రాజకీయ నాయకుల పాలెంత, ఉన్నతాధికారులు, ఉద్యోగుల పాలెంత, ప్రభుత్వరంగం పాత్ర ఎంత, ప్రైవేటురంగం పాత్ర ఎంత అని తర్కించవచ్చుగాని అవినీతిని నిరాకరించే పరిస్థితి లేదు. ఎందుకంటే అది పచ్చి నిజం గనుక. ఆర్థిక సరళీకరణ విధానాలు అమలులోకి వచ్చాక అది మరీ పెచ్చుపెరిగిందనేది అంతకుమించిన వాస్తవం. అవినీతిని, నల్లధనాన్ని అంతం చేస్తానన్న భీకర ప్రతిజ్ఞలతోనే నరేంద్రమోడీ బిజెపిని అధికారంలోకి తెచ్చారు. 'న ఖావుంగా, న ఖానే దూంగ' అనేది ఆయన ప్రసిద్ధ ప్రకటన. ఇందులో వాస్తవమెంత అని దేశ ప్రజలు చర్చించుకునే సమయమొచ్చింది. సహారా, బిర్లా డైరీల్లో ఆయన ప్రస్తావన ఉన్నప్పటికీ, ఏ పెద్ద అవినీతి కుంభకోణం ఆయన ప్రభుత్వంలో బయటపడకపోవటం ఇప్పటికీ మోడీకి ప్లస్‌పాయింట్. అయితే క్రికెట్‌రంగంలో అవినీతి రారాజుగా ముద్రపడి దేశం నుంచి పరారైన లలిత్‌మోడీకి రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరరాజె, విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ 'మానవతా దృక్పథంతో' సహాయపడటం వాస్తవం కాదా? బ్యాంకులకు రూ.9వేలకోట్లు టోపీ పెట్టిన కింగ్‌ఫిషర్ అధినేత విజయ్ మాల్యా ప్రభుత్వంలోని వారి సహాయం లేకుండానే లండన్ చెక్కేసారా? ఇప్పుడు నీరవ్‌మోడీ అనే వజ్రాల వ్యాపారి పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.11,400 కోట్లు టోపీపెట్టి కుటుంబంతో విదేశాల్లో మకాం పెట్టటం ఆర్థికవ్యవస్థ నిర్వహణలో ఆయన ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం కాదా? అంతెందుకు ఆయనకు కుడిభుజంగా పనిచేస్తున్న విశ్వాస పాత్రుడు అమిత్ షా తన సంపద 300 రెట్లు పెరిగినట్లు రాజ్యసభకు ఎన్నిక సందర్భంగా అఫిడవిట్‌లో తెలిపారు. ఆయన కుమారుడు జైషా ఆస్తులు మూడేళ్లలో 16వందల రెట్లు పెరిగాయి. దీన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే బుకాయింపులు తప్ప దర్యాప్తులేదు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఫ్రెంచి ప్రభుత్వంతో ప్రధాని మోడీ నేరుగా కుదుర్చుకున్న ఒప్పందం విలువ ఎంతో వెల్లడించటానికి నిరాకరించటం ఆయన ఏదో దాస్తున్నారన్న అనుమానం కలిగించకమానదు.

అవినీతిపరులను బయటపెట్టకపోవటం అవినీతిని సమర్థించటంతో సమానం. విదేశాల్లో లక్షల కోట్లు నల్లధనం దాచిన వారిలో కొన్ని వందల పేర్లను అంతర్జాతీయ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుల బృందం పనామా, ప్యారడైజ్ పత్రాల ద్వారా బహిర్గతం చేసినా వాటిని ఆయన ప్రభుత్వం ప్రజలనుంచి గోప్యంగానే ఉంచింది. బ్యాంకులకు (అంటే ప్రజల సొమ్ముకు)రూ.8 –10లక్షల కోట్లు ఎగనామం పెట్టిన (ఎన్‌పిఎలు) కార్పొరేట్ల పేర్లూ వెల్లడించలేదు. ప్రజల సొమ్ముకు ప్రభుత్వం కాపలాదారు అంటే ఇదేనా? యుపిఎ రెండవ ప్రభుత్వకాలంలో ఉన్నతస్థాయిలో అవినీతిని విచారించే అంబుడ్స్‌మన్ గా లోక్‌పాల్ వ్యవస్థకై పెద్ద ఆందోళన తదుపరి లోక్‌పాల్ బిల్లును పార్లమెంటు ఆమోదించింది. కాని మోడీ ప్రభుత్వం ఇంతవరకు లోక్‌పాల్‌ను నియమించకపోవటం దేనికి సంకేతం? కాంగ్రెస్ పాలన కాలంలో కుంభకోణాలకు ప్రజలు వారిని శిక్షించారు. ఇప్పుడు ప్రజలు చర్చించేది మోడీ పాలనగూర్చి.

అవినీతి ఆరోపణలకు బుక్ అయిన సీనియర్ అధికారుల ప్రాసిక్యూషన్‌కు కేంద్రం, బ్యాంకులు సహా ప్రభుత్వరంగ సంస్థలు అనుమతులివ్వకపోవటం పట్ల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ బాధపడుతోంది. సివిసి నుండి విజ్ఞప్తి వచ్చాక నాలుగు నెలల్లో దానిపై నిర్ణయం తీసుకోవాలన్నది రూలు. కాని కొన్ని విజ్ఞప్తు లు 2014 నుంచి పెండింగ్‌లో ఉన్నాయట! గత డిసెంబర్ 31 నాటికి 39 మంది అధికారులకు సంబంధమున్న 23 కేసులు అనుమతి మంజూరుకు వేచి ఉన్నాయి. అవినీతిపై మోడీ ప్రభుత్వ తీరుకిదొక నిదర్శనం. రాష్ట్రాల్లో ను ఇటువంటి కేసులు అసంఖ్యాకం. ఎసిబి దాడుల్లో బయటపడ్డ నగదు, నగలు, అక్రమాస్తుల పత్రాలు ఎలక్ట్రానిక్ మీడియా వీక్షకులను ఆశ్చర్యపరుస్తుంటాయి. వాటి అంతిమ ఫలితమేమిటో తెలియరాదు. అందువల్ల, అవినీతిపట్ల సామాన్య ప్రజల్లో ఉండే ఏవగింపును ఓట్లు దండుకోవటానికొక సాధనంగా ఉపయోగించుకునే నాయకులే – వారి బ్రాండ్ ఏదైనా–అవినీతికి రక్షకులు. రాజకీయ వ్యవస్థ క్షాళన జరగకుండా పాలనా వ్యవస్థ మెరుగుదలను ఆశించలేము.

నాగాలో స్వార్థ ప్రయోజనాల సయ్యాట

చూపు

వచ్చే ఫిబ్రవరి 27వ తేదీన నాగాలాండ్ శాసనసభకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలు వివిధ రాజకీయ పార్టీల మధ్య పోటీకి పరిమితమైనవి కావు. అవి స్వార్థ ప్రయోజనానికీ, నైతిక సూత్రాలకు మధ్య ఘర్షణ కూడా. నాగాల భవిష్యత్తు వ్యవహారం తేలే దాకా ఎన్నికలను బహిష్కరించాలని 11 రాజకీయ పార్టీలు జనవరి 29న ఒక ఒప్పందానికి వచ్చాయి. కాని ఆ తర్వాత కొద్ది రోజులకే ఎన్నికల బహిష్కరణ ప్రతిపాదన వీగిపోయింది. ఎన్నికలు బహిష్కరించాలన్న ప్రకటనపై భారతీయ జనతా పార్టీ కూడా సంతకం చేసింది. ఆ తర్వాత బహిష్కరణ సూత్రానికి తిలోదకాలిచ్చి బిజెపితో సహా వివిధ పార్టీలు స్వప్రయోజనాలకు పట్టం కట్టాయి. గతంలో 1998లో ఇతర పార్టీలన్నీ ఎన్నికలు బహిష్కరించినప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరూ పోటీ లేకుండా ఎన్నికయ్యారు. ఇప్పుడు అలా ఇతర పార్టీలు విజయం సాధించకుండా ఉండడానికి తామే రూపొందించుకున్న సూత్రాన్ని విడనాడి స్వప్రయోజనానికి ప్రాధాన్యం ఇచ్చాయి.

నాగాలాండ్ లో ఎన్నికల పొత్తులు దేశంలో మిగతా ప్రాంతాల్లో లాగా ఉండవు. అవకాశాన్ని, అవసరాన్ని బట్టి పొత్తులు కుదురుతూ ఉంటాయి. ప్రస్తుతం శాసన సభ్యులుగా ఉన్న మొత్తం 60 మంది నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్.పి.ఎఫ్.) నాయకత్వంలోని డెమొక్రాటిక్ అలయన్స్ ఆఫ్ నాగాలాండ్ (డి.ఎ.ఎన్.)లో భాగస్వాములుగా ఉన్నారు. నిజానికి ప్రతిపక్షమే లేదు. దశాబ్దం పైగా బిజెపి ఎన్.పి.ఎఫ్. తో ఉంది. ఎనిమిది మంది కాంగ్రెస్ శాసన సభ్యులు 2015లో డి.ఎ.ఎన్.లో చేరిపోయారు. ఆ రకంగా కాంగ్రెస్, బిజెపి ఒకే కూటమిలో చేరిపోయాయి. అయినా ఎన్నికలకు ముందు బిజెపి ఎన్.పి.ఫ్.కు ప్రత్యర్థి పక్షమైన నేషనల్ డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్.డి.పి.పి.)తో ఎన్నికల పొత్తు కుదుర్చుకుంది. మాజీ ముఖ్యమంత్రి నీఫియూ నాయకత్వంలో ఎన్.డి.పి.పి. అవతరించింది. అయినా ఎన్నికల తర్వాత బిజెపితో పొత్తుకు అవకాశం లేక పోలేదని ప్రస్తుత ముఖ్యమంత్రి టి.ఆర్.జెలియాంగ్ ప్రకటించారు. అంటే రెండు ప్రాంతీయ పార్టీలు ఒకే జాతీయ పార్టీతో కత్తు కలిపితే రెండు జాతీయ పార్టీలు ఒకే ప్రాంతీయ పార్టీతో కుమ్మక్కయ్యాయి.

ఇది విచిత్ర పరిస్థితి. అంటే ఎన్నికలలో గెలిచిన పక్షం కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో పొత్తు కలిగి ఉంటుందన్న మాట. దశాబ్దాలుగా నాగాలాండ్‌లో ఇదే పరిస్థితి ఉంది. అనేక ఈశాన్య రాష్ట్రాల లాగే నాగా లాండ్ కూడా కేంద్ర నిధుల మీద ఆధారపడిందే. అందువల్ల ఏ పార్టీ గెలిచినా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీని విస్మరించలేదు.

ఇది అక్కడి రాజకీయాలకు చిహ్నం అయినా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీని వ్యతిరేకించే రాజకీయ పక్షాలు కూడా ఆ పార్టీని సమర్థించక తప్పని పరిస్థి ఉంది. నాగాలాండ్ లో నిజమైన ప్రతిపక్షం పౌర సమాజం, చర్చీ మాత్రమే. అక్కడ శక్తిమంతమైన నాగాలాండ్ బాప్టిస్ట్ చర్చి మాత్రం నాగాలు బిజెపి నాయకత్వంలోని హిందూత్వ శక్తులకు దూరంగా ఉండాలని సూచించింది. 'అభివృద్ధి, రాజకీయ ప్రయోజనాల కోసం మనం మత విషయాలలో రాజీ పడకూడదని ఇటీవల చర్చీ పేర్కొంది. ఎన్నికల కోసం మతాన్ని వినియోగించుకోవడంలో ఆరి తేరిన బిజెపి ఏ జంకూ గొంకూ లేకుండా, వైపరీత్యం అనుకోకుండా ఎన్నికల సమయంలో మతాల వారీగా జన సమీకరణ నాగాలాండ్‌లో కొందరి వ్యూహం కావొచ్చు అని వ్యాఖ్యానించింది. బిజెపి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న 20మంది అభ్యర్థులు క్రైస్తవులే, నాగాలే. నాగాలాండ్ బాప్టిస్ట్ చర్చి పిలుపు ప్రభావం వీరి ఎన్నికపై ఉంటుందో లేదో వేచి చూడవలసిందే.



నాగాలాండ్ ఎన్నికలను బహిష్కరించాలని పిలుపు ఇవ్వడానికి ప్రధాన కారణం నాగాలాండ్ రాజకీయ భవిష్యత్తు ఏమిటో దీర్ఘ కాలంగా తేలకపోవడమే. 1963లో నాగాలాండ్‌ను పూర్తిస్థాయి రాష్ట్రంగా ప్రకటించినప్పటికీ అది ప్రత్యేక నాగా జాతి రాజ్యంగా అవతరించాలన్న కోరిక కనుమరుగు కానే లేదు. నాగా తిరుగుబాటు వర్గాలకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య అడపా దడపా కాల్పుల ఒప్పందాలు కుదిరినందువల్ల తాత్కాలికంగా శాంతి నెలకొన్న మాట వాస్తవం. కాని ఘర్షణ ఆగనే లేదు. తిరుబాటుదారు వర్గాల్లో అతి పెద్దదైన నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (ఐజాక్‌ముయివా) 2015లో కేంద్ర ప్రభుత్వంతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు ఏదో పరిష్కారం సాధ్యం అవుతుంది అన్న ఆశ రేకెత్తింది. అయితే ఈ ఒప్పందం స్వరూపం ఏమిటో ఇప్పటికీ స్పష్టంగా తెలియదు. అప్పుడప్పుడు ఏవో ప్రకటనలు మాత్రం వెలువడుతుంటాయి. ప్రశాంతత నెలకొంటుదన్న ఆశతోనే పౌర సమాజ బృందాలు, తిరుగుబాటు వర్గాలు, రాజకీయ పార్టీలు ఎన్నికలు వాయిదా వేయాలని కోరాయి.

ప్రస్తుత ఎన్నికల తర్వాత శాంతి నెలకొంటుందన్న ఆశ మాత్రం లేదు. నిధుల కొరత లేకపోయినా నాగా లాండ్ అభివృద్ధిలో తీవ్ర నిర్లక్ష్యం జరిగింది. రోడ్ల పరిస్థితి మరీ ఘోరంగా ఉంటుంది. విద్యాధికులైన వారికి కూడా ఉద్యోగాలు లేవు. సామాన్య ప్రజలు తిరుగుబాటుదార్లకు 'కప్పం' చెల్లించుకోవాల్సి వస్తోంది. దానివల్లా ఊరట లేదు. కేంద్ర ప్రభుత్వం సమకూర్చే నిధుల వల్ల ఫలితం లేదు. ఈ డబ్బులో ఎక్కువ భాగం రాజకీయ నాయకుల జేబుల్లోకి వెళ్తోంది. అందుకే వారు అధికారం సంపాదించాలని వెంపర్లాడుతుంటారు. రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా అన్ని పక్షాల వైఖరి ఇదే.

రాజకీయాలు నేలబారుగా ఉన్నా పౌర సమాజం మీద ఇంకా ఆశ ఉంది. పౌర సమాజానికి చెందిన వారు శాంతి ప్రయత్నాలు చేశారు. రాజకీయాల్లో అవినీతి గురించి మాట్లాడారు. నిష్కళంక రాజకీయాలు కావాలని నినదించారు. గత సంవత్సరం నాగా మహిళా బృందాలు పరిపాలనలో స్త్రీల భాగస్వామ్య అంశం లేవనెత్తాయి. మునిసిపల్ సంస్థల్లో 33% రిజర్వేషన్లు ఉండాలన్న తమ కోర్కెను మాత్రం నెరవేర్చుకోలేక పోయారు. కాని లింగ సమానత్వంపై చర్చ లేవనెత్తడంలో మాత్రం సఫలమయ్యారు. ఈ ఎన్నికల్లో కేవలం అయిదుగురు మహిళలు మాత్రమే పోటీ చేస్తున్నారు. 1963 నుంచి ఒక్క మహిళ కూడా శాసన సభకు ఎన్నిక కాలేదు. ఒక మహిళ మాత్రం పార్లమెంటుకు ఎన్నికయ్యారు. పౌర సమాజం ఈ అంశాలనే ప్రస్తావిస్తోంది. అప్పుడు ఎన్నికల పేర జరుగుతున్న నాటకాన్ని పౌర సమాజం ఈసడిస్తోంది. నాగా లాండ్ లో పౌర సమాజం మీదే అంతో ఇంతో ఆశ ఉంది.

✻ (ఇ.పి.డబ్ల్యు.సంపాదకీయం)

ఏం చదవమంటారు?



బి.నర్సన్
9440128169

దేశ ప్రస్తుత జనాభా 132 కోట్లు. అందులో 25 ఏళ్ల లోపు వారు 50%, 35ఏళ్ల వయస్కులు 65% ఉన్నారు. విచారకరమైన విషయమేమిటంటే సగానికి పైగా జనాభా ఏం చదువుతున్నారు, చదివినవారు ఏం పని చేస్తున్నారు అనే లెక్కలు ప్రభుత్వాల దగ్గర లేవు. దేశంలో విద్యావంతులెందరో, చదువుకు తగిన ఉద్యోగాలు ఎందరికి దొరికాయి, మిగిలిన వారు ఏ ఉపాధి చేపట్టారు అనే వివరాలు ఏ శాఖ వద్దా లేవు. ఇంటికో ఉద్యోగం, ఏడాదికి కోటి మందికి ఉపాధి కల్పన హామీ ఇచ్చిన నేతలు ఇప్పుడు పకోడీ అమ్మేవాళ్లను, ప్రావిడెంట్ ఫండ్ నమోదు సంఖ్యను చూపి అదిగో కొత్త ఉద్యోగులని లెక్కలు చెబుతున్నారు. చదువుకున్నవారు ప్రభుత్వ సంస్థల్లో సజావుగా ఉద్యోగాలు చేసి రిటైరై నిశ్చింతగా బతికే రోజులు పోయాయి. 1991లో ఆనాటి ప్రధాని పి.వి.నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలతో అవి కనుమరుగైనాయి. దేశం రాజకీయ బానిసత్వం నుండి ఆర్థిక బానిసత్వంలోకి మారి విదేశీ పెట్టుబడులతో ఊపిరి తీసుకోవలసి వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే 1995లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ప్రపంచ బ్యాంకు చుట్టూ రెండేళ్లు తిరిగి అప్పు సంపాదించారు. అప్పుకు ముందు ప్రపంచబ్యాంకు 1% ఉద్యోగుల కోత, కొత్త నియామకాల నిలిపివేత లాంటి జన వ్యతిరేక నిబంధనలు పెట్టింది.

ప్రభుత్వ ఉద్యోగాలనుండి యువత దృష్టి మరల్చేందుకు చంద్రబాబు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ ఉద్యోగాలు గొప్పవంటూ ఆశలు పెంచాడు. స్వయంగా బిల్‌గేట్స్‌ను ఒప్పించి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ బ్రాంచిని తెరిపించాడు. కేంద్ర ప్రభుత్వంపై తనకున్న ప్రాబల్యంతో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉదారంగా అనుమతులు పొందేలా చేశాడు.

ఆనాటికి ఆంధ్రప్రదేశ్‌లో 37 ఇంజినీరింగ్ కాలేజీలుండగా, 2004 నాటికి 220 అయ్యాయి. ఐటి ఉద్యోగాలు సంపాదించాలంటే, ఎంసెట్‌లో మంచి ర్యాంకు రావాలంటే ఇంటర్‌స్థాయిలో తీవ్ర కృషి అవసరమైంది. దాంతో ప్రైవేటు రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ప్రైవేటు జూనియర్ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలు మధ్యతరగతి ఆశల్ని ఆసరా తీసుకొని కోట్లు గడించాయి, గడిస్తున్నాయి కూడా.

2008లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను 2009 ఎన్నికలకు గురిగా ప్రవేశపెట్టింది. 2010 నాటికి 705 కాలేజీలు, 2.52 సీట్లు అదో తారస్థాయి దశ. ఫీజు రీయింబర్స్‌మెంట్ వాటి కడుపు నింపింది. నాణ్యత లేని చదువులతో తెలుగిళ్లలో ఇంటికో ఇంజనీర్ తయారయ్యాడు. 2014లో తెలంగాణ ప్రభుత్వం కాలేజీల తనిఖీలతో నాణ్యత, బోధనా సిబ్బంది అర్హతలు, ప్రయోగశాలల వసతి లెక్కలు తీసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ భారాన్ని సహేతుకంగా చేసే క్రమంలో ఈ చర్యలు చేపట్టింది. కాలేజీల యాజమాన్యం కోపానికి గురి కాకుండా వారికి ఫీజులు సవరించుకునే అవకాశం ఇచ్చింది. ఉచితమే కదాని చేరిన విద్యార్థులకు మధ్యంతరాన ఫీజుల భారం పడుతోంది.

ఇటు ఉద్యోగాల వసతులు చూస్తే పూర్తి నిరాశాజనకంగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు అనుకున్న స్థాయిలో పెరగకపోవడంతో నిరుద్యోగుల సంఖ్య పెరిగి పోయింది. ఊర్లోనే ఉండి వేల ఖర్చుతో డిగ్రీ పూర్తిచేసినా లక్షలు వెచ్చించి ఇంజనీరింగ్ చేసినా బేధమేమీ లేని స్థాయికి పరిస్థితి దిగజారిపోయింది. ఇంజనీరింగ్ మోజు తగ్గిపోయిందనడానికి తగ్గుతున్న కాలేజీలు, కోర్సుల్లో సీట్లే తార్కాణం. తెలంగాణలో 2017–18 అడ్మిషన్ల ప్రకారం 207 కళాశాలల్లో 90,011 సీట్లు ఉన్నాయి. అవి కూడా నిండక ఏడాదికిన్ని కోర్సులు, కాలేజీలు అదృశ్యమౌతున్నాయి.

సాఫ్ట్‌వేర్ కంపెనీలు, నాస్కామ్ మన ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో నైపుణ్యం లేదంటున్నాయి. ఉద్యోగాలకు సరిపడేవారు 18% మించి రావడం లేదు అని వారి వాదన. ఆ 18% నుండి 25% ఉద్యోగులైనా సుఖంగా ఉద్యోగ జీవితం గడుపుతున్నారా అంటే అదీ లేదు. పదేళ్ల క్రితం సుమారు మూడు లక్షల ప్రారంభ ప్యాకేజీ ఉంటే ఇప్పుడు అంతే మొత్తం లేదా అంతకన్నా తక్కువ ఇస్తున్నారు. దానికే మహాభాగ్యమనే స్థితి ఉద్యోగార్థులది. జీతభత్యాలు నచ్చక బెంగుళూరులో కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఊబర్, ఓలా లాంటి క్యాబ్ సర్వీసుల్లో చేరిపోయారు. మధ్యప్రదేశ్‌లో ఇంజనీరింగ్ చదివిన వారు చప్రాసీ ఉద్యోగాలకు అప్లికేషన్లు పెడుతున్నారని స్వయానా ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నట్లు పత్రికల్లో వచ్చింది.

ప్రాంగణ నియామకాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఈ సంవత్సరం ఐఐటి ముంబైలో 24% ఐటి ఉద్యోగాలు కాగా 45% ఫైనాన్స్, ఇప్పుడు కన్సల్టెన్సీల్లో నియామకమయ్యారు. ఐఐటిల్లో కూడా నియామకాలు తగ్గుతున్నాయి. 2016–17లో 66% ప్లేస్‌మెంట్లు జరిగాయి.

ఏదో ప్యాకేజీలో ఉద్యోగం వచ్చిందని సంతృప్తిపడే కాలం కూడా కాదు. ఏరోజు పింక్ స్లిప్ ఇచ్చి బెంచిపై కూర్చోబెడతారో తెలియదు. వివిధ కారణాల వల్ల ఏటా రెండు లక్షలమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పనులు కోల్పోతుండగా సుమారు లక్షన్నర మంది కొత్త ఉద్యోగులు వస్తున్నారు. అనగా ఏడాదికి 50వేలమంది నిరుద్యోగులు పెరిగిపోతున్నారు. వీళ్లంతా ఇరవై ఏళ్ల ఉద్యోగం చేసిన నాలుగు పదుల వయసు దాటినవాళ్లు.

ఈ మధ్య హెచ్‌సిఎల్ కంపెనీ +2 పూర్తి చేసిన వాళ్లను ఎంపిక చేసుకొని తగిన నైపుణ్యాలకు శిక్షణ ఇచ్చి ఒప్పందం చేసుకొని ఉద్యోగాలిస్తోంది. బిటెక్ పూర్తి చేసినవారికి 3లక్షల ప్యాకేజీ ఇస్తే +2 వాళ్లు 1.5లక్షలకే ఉద్యోగాల్లో చేరుతున్నారు.

ఇంజనీరింగ్ చదువు వ్యక్తిగత ఇష్టానికి సంబంధించినది. అదేదీ పట్టించుకోకుండా తల్లిదండ్రులు పేరాశతో పిల్లలను ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. లక్షలు ఖర్చుపెట్టి అటు తల్లిదండ్రులు, ఇటు చదువు పూర్తి చేసిన పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అసలు ఇంజనీరింగులో ఉద్యోగాలే లేనపుడు ఆ చదువు ఎందుకనే ప్రశ్న ఈ మధ్య వస్తోంది. తెలంగాణ ప్రభుత్వం నియామకాల్లో పోలీసు కానిస్టేబుల్స్‌గా, గ్రామాధికారులుగా బిటెక్, ఎంటెక్ వాళ్లు చేరుతున్నారు.

ఆటోమేషన్, రోబోటిక్ యాంత్రికత వల్ల వందమంది చేసే పనికి 70 మంది చాలు. సీనియర్ ఉద్యోగుల్లో 60% మందికి కొత్త నైపుణ్యాల అవసరం ఉంది. ఉద్యోగ కల్పన లేదు, ఉన్న ఉద్యోగం ఎన్నాళ్లు చేస్తారో తెలీదు. వృత్తి నైపుణ్యాల కొరత పేరిట నలభై ఏళ్లు దాటిన వాళ్లను బయటికి నెట్టేస్తే వాళ్ల పరిస్థితికి బాధ్యత వహించే వాళ్లు లేరు. సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగ సంఘాలు లేవు. ఇప్పుడిప్పుడు ఆ ఆలోచన వస్తోంది.

విచిత్రమేమిటంటే ఎలాంటి చదువు, ఖర్చు లేకుండా దేశం లో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, వెల్డర్లు తీరిక లేకుండా పనులు పొందుతూ రోజుకు 500నుండి వేయి రూపాయలు సంపాదిస్తున్నారు. అదే దాదాపు 18 నుండి 20 ఏళ్లు చదివి, బోలెడు డబ్బు వెచ్చించి పొందిన విద్యార్హతలు, సర్టిఫికెట్లు దినసరి పని మంతుల ముందు తలదించుకుంటున్నాయి.

కళాశాల చదువుకు, వృత్తి నైపుణ్యాలకు పొంతనలేనప్పుడు ఈ చదువుల పరమార్థం ఏమిటి? నైపుణ్యం ఉండి ఆర్థిక సంక్షోభంలో ఉద్యోగం ఊడితే ఎవరు బాధ్యులు? ఏది చదివితే ఉద్యోగి, ఆయన కుటుంబం నిశ్చింతగా ఉంటుందో చెప్పేవారు కరువయ్యారు.



విచిత్రమేమిటంటే ఎలాంటి చదువు, ఖర్చు లేకుండా దేశం లో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, వెల్డర్లు తీరిక లేకుండా పనులు పొందుతూ రోజుకు 500నుండి వేయి రూపాయలు సంపాదిస్తున్నారు. అదే దాదాపు 18 నుండి 20 ఏళ్లు చదివి, బోలెడు డబ్బు వెచ్చించి పొందిన విద్యార్హతలు, సర్టిఫికెట్లు దినసరి పని మంతుల ముందు తలదించుకుంటున్నాయి. కళాశాల చదువుకు, వృత్తి నైపుణ్యాలకు పొంతనలేనప్పుడు ఈ చదువుల పరమార్థం ఏమిటి? నైపుణ్యం ఉండి ఆర్థిక సంక్షోభంలో ఉద్యోగం ఊడితే ఎవరు బాధ్యులు? ఏది చదివితే ఉద్యోగి, ఆయన కుటుంబం నిశ్చింతగా ఉంటుందో చెప్పేవారు కరువయ్యారు.

గ్రంథాలయాల చరిత్ర

తెలంగాణలో వందఏళ్ళు దాటిన గ్రంథాలయాల చరిత్రను గ్రంథస్థం చేసి ప్రజలకు అందించాలన్న సంకల్పంతో తెలంగాణ గ్రంథాలయ పరిషత్తు ఒక కార్యక్రమానికి అంకురార్పణ చేసింది. క్రీ.శ. 2017 వరకు వందేళ్ళు పూర్తి అయిన గ్రంథాలయాల జాబితాను కొంతవరకు సేకరించింది. మా దృష్టికి రాని వందేళ్ళ గ్రంథాలయాలు ఇంకా మరెన్నో ఉండవచ్చునని తెలియ వచ్చింది. వీటికి సంబంధించిన సమాచారం (ఫోటోలు, పత్రికల వార్తలు, వ్యాసాలు, సావనీర్లు, పుస్త కాలు, ప్రత్యక్ష సాక్షుల జ్ఞాపకాలు) ఏదైనా ఉంటే తెలంగాణ గ్రంథాలయ పరిషత్తుకు తెలియ చేయవలసిందిగా విజ్ఞప్తి. ప్రస్తుతం ఉనికిలో ఉన్నవీ, లేనివి కలిపి వందేళ్ల గ్రంథాలయాల తొలి జాబితా ఇలా ఉంది.

- ప్రజాహిత గ్రంథాలయం (1870), సికింద్రాబాద్
- ముదిగొండ శంకరారాధ్య గ్రంథాలయం(1872), సికింద్రాబాద్
- యంగ్‌మెన్ ఇంప్రూవ్‌మెంట్ సొసైటీ (1879), హైదరాబాద్
- నిజాం క్లబ్ గ్రంథాలయం (1883), హైదరాబాద్
- వాలంటరీ క్లబ్ గ్రంథాలయం (1884), హైదరాబాద్
- దైరతుల్ మారిఫ్ ఉల్ ఉస్మానియా (1889), హైదరాబాదు
- అల్బర్ట్ రీడింగ్ రూమ్ (1890), సికింద్రాబాద్
- అనఫియా లైబ్రరీ (1891), హైదరాబాద్
- భారత్ గుణవర్ధక సంస్థ గ్రంథాలయం (1895), హైదరాబాద్
- బొల్లారం లైబ్రరీ(1896), బొల్లారం
- శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయం(1901), హైదరాబాద్
- శ్రీ రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషా నిలయం(1904), వరంగల్
- ఆంధ్ర సంవర్ధినీ గ్రంథాలయం (1905), సికింద్రాబాద్
- ఆంధ్ర భాషాభివర్ధక సంఘం (1905), శంషాబాదు
- మన్మోహన్ ఆంధ్ర పుస్తకాలయం (1907), వడ్డెపల్లి
- శబ్దానుశాసన ఆంధ్ర భాషా మందిరం (1908), వరంగల్
- జ్ఞాన విద్యుత్ ప్రవాహిని ఆంధ్ర భాషా నిలయం(1910),ఖమ్మం
- మహబూబియా ఆంధ్ర భాషా నిలయం (1911), ఎర్రుపాలెం
- శ్రీ విరాటాయాంధ్ర భాషా నిలయం (1912), నేలకొండపల్లి
- ఆంధ్ర యువజన సంఘం గ్రంథాలయం(1913), సికింద్రాబాద్
- సంస్కృత కళా సంవర్ధిని గ్రంథాలయం(1913) సికింద్రాబాద్
- శ్రీసిద్ధి మల్లేశ్వర గ్రంథాలయం (1913), రేమిడిచర్ల
- మహబూబియా రీడింగ్ రూమ్(1915), నల్లగొండ
- ఆంధ్ర విజ్ఞాన ప్రకాశిని గ్రంథ నిలయం(1917), సూర్యాపేట్
- శ్రీ బాలభారతి ఆంధ్ర భాషా మందిరం (1917), శంషాబాద్
- ఆంధ్ర సరస్వతీ గ్రంథ నిలయం (1918), నల్గొండ
- రెడ్డి హాస్టల్ గ్రంథాలయం(1918), హైదరాబాద్
- జ్ఞాన విద్యుత్ ప్రవాహిని విద్యార్థి సంఘం గ్రంథాలయం (1918) ఖమ్మం.


– **డా॥ఆయాచితం శ్రీధర్,** అధ్యక్షుడు,
తెలంగాణగ్రంథాలయ పరిషత్, 040–24613238

విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దు

ఎడిటర్‌కు లేఖ

పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌పరీక్షలు సమీపిస్తున్నాయి. సమయం చాలా తక్కువగా ఉంది. విద్యార్థులు ఎంతో శ్రద్ధతో, ఒత్తిడితో పాఠ్యాంశాలను పునర్విమర్శ చేసుకునే సమయం ఒక ప్రణాళిక వేసుకొని, ఆ ప్రణాళిక ప్రకారం ఉదయం 4.30 నుండి రాత్రివరకు చదువుతుంటారు. ఇలాంటి సమయంలో విద్యుత్ కోతలు విధించవద్దు. ప్రతిపల్లె, పట్టణంలో పరీక్షలు ముగిసేదాకా నిరంతర విద్యుత్ సరఫరా జరగాలి. అలాగే తల్లిదండ్రులు, పెద్దలు తమ పిల్లలకు సహకరించాలి. ఇంటివద్ద తమ రోజూవారి టివి కార్యక్రమాలను త్యాగం చేసి, టివిలనోళ్లు మూయించాలి. అవసరమైన పనులు చెప్పవద్దు. విద్యార్థుల స్థాయికి మించి, మరీ ఎక్కువ మార్కులు లేదా గ్రేడులు టార్గెట్ చేసి ఒత్తిడికి గురి చేయవద్దు. ప్రోత్సాహంతో చదివించాలి. వారి ఆరోగ్యాన్ని పాడు చేసే శీతల పానీయాలు, జంక్ ఫుడ్స్ తదితర ఆహార పదార్థాలకు దూరంగా ఉంచాలి.ఆరోగ్యానికి దోహదం చేసేవే తినిపించాలి. విద్యార్థులకు సహకరించాలి.

–**సరికొండ శ్రీనివాసరాజు,** వనస్థలిపురం





బొమ్మలాటతో భలే కథలు



ఇప్పటి తరం చరిత్ర, సంస్కృతి గురించి అంతగా పట్టించుకోదు. క్లాసు పుస్తకాలు చదవడానికే తీరిక ఉండటం లేదు..ఇక హిస్టరీ, ఇతిహాసాలను చదివే ఓపిక ఎక్కడుంటుంది..ఎవరిని కదిలించినా వచ్చే సమాధానం ఇదే. కంప్యూటర్‌లాంటి టెక్నాలజీకి సంబంధించి అడిగితే మాత్రం టకీమని సమాధానం చెప్పేస్తారు.. కథలు చెప్పేందుకు ఇంట్లో పెద్దవాళ్లు లేకపోవడంలాంటి కారణాలు కావచ్చు. తోలుబొమ్మలాట కళ ద్వారా చిన్నారులకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నారు పద్మిని. ఇటీవల బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ బొమ్మలాట ప్రదర్శనలో తన శిష్యబృందంతో కలిసి ప్రదర్శనలిచ్చి ప్రశంసలు అందుకున్నారు.



తమిళనాడుకు చెందిన పద్మిని తండ్రి రైల్వే ఉద్యోగి. ఉద్యోగరీత్యా కర్ణాటకలో స్థిరపడ్డారు. పద్మిని పెళ్లయిన తర్వాత తెలుగింటి ఆడపడుచుగా మారింది. చిన్నప్పుడు తండ్రి చెప్పే కథలను శ్రద్ధగా వినేది. అవే కథలను తన బాబుకు చెప్పేది. పిల్లాడికి బొమ్మలాట ద్వారా చెప్పవచ్చుకదా అన్న తండ్రి సలహా ఆమెను ఆలోచించేలా చేసింది. వస్త్రంతో చిన్న చిన్న బొమ్మలను కుట్టి వాటిని చేతికి తొడుక్కుని కథలు చెప్పడం ప్రారంభించింది. అంతే సాయంత్రం అయితే చాలు వాళ్లింటికి అపార్ట్‌మెంట్‌లోని పిల్లలంతా వచ్చి కథలు వినడం మొదలెట్టారు. అలా స్కూల్లో కూడా ఒక పీరియడ్ కథలు చెప్పాల్సిందిగా ఆమెకు ఆఫర్ వచ్చింది. అప్పటికే రామకృష్ణ మఠంలో ఇంగ్లీషు తరగతులు చెప్తుండేది. అక్కడ కూడా బొమ్మలతో బోధించేది. బొమ్మలాట అనగానే చాలామందికి తోలుబొమ్మలాట గుర్తుకొస్తుంది. భారత్‌లో పుట్టిన ఈ కళ ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల్లో ఇప్పటికీ థియేటర్ ఆర్ట్‌గా అభివృద్ధి వెలుగొందుతోంది. అక్కడ వీధుల్లో పెద్ద పెద్ద చెక్కబొమ్మలతో ప్రదర్శనలిస్తారు. అంత బరువున్న వాటితో వారు చక్కగా ఆడిస్తారు. ఇవన్నీ తెలుసుకున్న నాకు ఆసక్తి పెరిగిందని అంటోంది పద్మిని. ఫలితంగా 2012లో తోలుబొమ్మలాట మీద పరిశోధన మొదలుపెట్టింది. ఈ పరిశోధన జనగాంతో ప్రారంభమైంది. అక్కడ మోతే అనే ఇంటిపేరుతో ఉన్న కుటుంబీకులు బొమ్మలాట ఆడుతున్నట్లు తెలుసుకుంది. వాళ్లలో ఓ కుటుంబం వరంగల్లు దగ్గర బూరుగుపేటలో, మరొకటి అమ్మాపురంలో స్థిరపడ్డాయి. మోతే జగన్నాథం తోలుబొమ్మలాట కళకు ప్రాణం పోశాడు. మొదట్లో చాలా కథలను వీరు ప్రదర్శించేవారు. ఇప్పుడు ఇక్కడి కళాకారులంతా 70 ఏళ్లు పైబడినవారే ఉన్నారు. ఒకప్పుడు ఆ బృందం ప్రదర్శించిన 16 కథల్లో నాలుగు మాత్రమే మిగిలాయి. వాటిలో లవకుశ, చెంచులక్ష్మి , బాలనాగమ్మ, సారంగధర ఉన్నాయి. 300 ఏళ్లనాటి చెక్క బొమ్మలు వారి దగ్గర ఉన్నట్లు ఆమె చెబుతోంది. కొత్త తరాలు ఈ వృత్తిలోకి రావడం మానేశాయి. దీంతో ఈ కళ అంతరించిపోయే దశకు చేరింది. ఇలా వీటిపై పరిశోధన కొనసాగిస్తోంది పద్మిని. కళ అంతరించి పోకూడదని, ఆసక్తి ఉన్నవారికి తోలుబొమ్మలాటను నేర్పించాలనుకుంది. ఇందుకోసం స్ఫూర్తి థియేటర్ ఆర్ట్స్ అనే పేరుతో ఒక సంస్థను ప్రారంభించింది. లా మకాన్, అవర్ సెక్రెడ్ స్పేస్‌లాంటి చోట్ల పిల్లలకు బొమ్మలతో అవగాహన కల్పిస్తున్నారు. పేపర్ మెషే ఆర్ట్‌తో బొమ్మలను తయారుచేసి వాటితో అనేక స్కూళ్లు, తదితర ప్రాంతాల్లో ప్రదర్శిస్తోంది. పద్మినితోపాటు పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం విద్యార్థులు జతకలిశారు. పద్మిని శ్రమకు గుర్తింపుగా టాటా ఫెలోషిప్ ఫోక్‌లోర్, ఖుషీ టీవీ అవార్డు, అమరావతి అవార్డులు వరించాయి.



మల్లీశ్వరి వారణాసి

చిట్కా

✻ జామ కాయను ఎక్కువగా తినేవారి చర్మం ఎలాంటి మచ్చలు, ముడుతలు లేకుండా మెరుస్తూ ఉంటుంది.జామ పండులో ఉంటే కాపర్ థైరాయిడ్ సమస్యలకు మంచి పరిష్కారంగా పనిచేస్తోంది.



గోళ్లు కొరికే హాబీ ప్రమాదమే..

సామాన్యంగా అందరూ ఒత్తిడిలో ఉన్నప్పుడు గోళ్లను ఎక్కువగా కొరుకుతుంటారు. ఆ కాసేపు కొరకడం ఆపేసినా తర్వాత మళ్లీ మామూలే. ఇంకా కొందరు ఆఫీస్‌లో ఉన్నా, టీవీ చూస్తున్నా అసంకల్పితంగా గోళ్లు కొరుకుతుంటారు. ఎదుటి వారు ఏం చెబుతున్నా పట్టించుకోరు.ఇలా చేయడం వల్ల ఒత్తిడి తగ్గడం మాట ఎలా ఉన్నా.. గోళ్లకు, దంతాలకు నష్టం వాటిల్లుతుంది. చేతులు పరిశుభ్రంగా కడుక్కోకపోతే రోగాల బారిన పడే అవకాశాలు పెరుగుతాయి. ఈ అలవాటును కొన్ని సింపుల్ టిప్స్‌తో మానేసుకోవచ్చు అదెలాగో చూద్దాం....

గోళ్లను కొరికే అలవాటు మానుకోవాలంటే ముందుగా చేయాల్సింది వాటిని కత్తిరించుకోవడం. గోళ్లు పొట్టిగా ఉండటం వల్ల కొరకడానికి వీలు కాదు. ఫలితంగా ఈ అలవాటు నుంచి బయటపడొచ్చు. ✻ క్యాల్షియం లోపం కారణంగానూ గోళ్లు కొరకడం అలవాటు కావచ్చు. కాబట్టి ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోండి. పాల ఉత్పత్తులను ఎక్కువగా తీసుకోవాలి. ✻ ఏదైనా పని మీద ధ్యాస పెట్టండి. గోళ్లు కొరకాలని అనిపించినప్పుడు ఆలోచనలను దారి మళ్లించండి. ✻ గోళ్లు కొరికే అలవాటు మానుకోవాలని బలంగా అనుకోండి. ఇదే విషయాన్ని ఫోన్‌లో రిమైండర్‌గా పెట్టుకోండి. ఆఫీసులో మీరు పని చేసే చోట నోట్ రాసి అతికించుకోండి. ఇది కొంత వరకూ ఫలితాన్ని ఇస్తుంది. ✻ అమ్మాయిలైతే తరచుగా మెనిక్యూర్ చేయించుకుంటే సరిపోతుంది. అందంగా ఉన్న గోళ్లను కొరకాలని ఎవరికి అనిపిస్తుంది చెప్పండి. ✻ ఇన్నీ చేసినా గోళ్లు కొరకాలని అనిపిస్తుంటే.. వేప ఆకులను పేస్టులా చేసి దాన్ని గోళ్లకు పూయండి లేదా మిరియాల పేస్టును రాయండి. ✻ ఒత్తిడితో ఉన్నా గోళ్లు కొరుకుతుంటారు. మీ విషయంలోనూ ఇదే కారణం అయితే ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రయత్నించండి. యోగా, ప్రాణాయామం సాధన చేయండి. ✻ చేతికి రిస్ట్‌బ్యాండ్ ధరించండి. గోళ్లు కొరకాలి అనిపించినప్పుడల్లా దాన్ని లాగి వదలండి. ఫలితంగా ఆ ఆలోచనలను విరమించుకుంటారు.

ఒత్తిడి నుంచి విముక్తి పొందాలంటే..

రాత్రి సమయాల్లో ఎక్కువసేపు చదవడం, ఒత్తిడి ఇంకా రకరకాల కారణాలవల్ల కళ్ల కింద నల్లటి వలయాలు వస్తుంటాయి. వీటిని ప్రారంభంలోనే తగ్గించే చర్యలు తీసుకోవాలి. లేదంటే కళ్ల కింద నల్లటి మచ్చలు అలాగే ఉండిపోవడంతోపాటు, ఆరోగ్య సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. నల్లటి వలయాలను తగ్గించడానికి సహజ మార్గాలున్నాయి. వీటిని పాటిస్తే రెండు రోజుల్లోనే డార్క్ సర్కిల్స్ మాయం అవుతాయి. వాటిలో కొన్ని తెలుసుకుందాం....



గ్రీన్ టీ బ్యాగ్‌లను నీటిలో ముంచి కాసేపు రిఫ్రిజరేటర్‌లో ఉంచాలి. తర్వాత వాటిని కళ్లపై ఉంచుకోవాలి. రెగ్యులర్‌గా ఇలా చేయడం వల్ల తప్పకుండా ఫలితం ఉంటుంది. **టామాటాలు:** కళ్ల కింద ఏర్పడే నల్లటి వలయాల సమస్య నుంచి బయటపడటానికి టామాటాలు ఎంతగానో ఉపయోగపడతాయి. టమాటాలు చర్మంపై మచ్చలను తొలగించి, మెరిసేందుకు తోడ్పడతాయి. ఒక టీ స్పూన్ టమాటా జ్యూస్‌కు నిమ్మరసం కలిపి కళ్ల కింద రాసుకోవాలి. పది నిమిషాలు ఆగిన తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. రోజుకు రెండు సార్ల చొప్పున ఇలా చేయడం వల్ల ఫలితం ఉంటుంది. **చల్లటి పాలు:** చల్లటి పాలలో దూదిని ముంచి కాసేపు ఉంచాలి. తర్వాత దాన్ని కళ్లు, నల్లటి వలయాలున్న ప్రాంతాన్ని కవర్ చేసేలా ఉంచాలి. కొద్ది సేపు అలా ఉంచాక నీటితో కడిగేసుకోవాలి. తరచుగా ఇలా చేయడం వల్ల చర్మంపై ఉన్న నల్లటి వలయాలు తగ్గుముఖం పడతాయి. నారింజ జ్యూస్‌తోనూ నల్లటి మచ్చలను తొలగించొచ్చు. ఆరెంజ్ జ్యూస్‌లో కొద్దిగా గ్లిజరిన్ కలిపి నల్లటి వలయాలు ఉన్న చోట పూయాలి. ఇలా చేయడం వల్ల డార్క్ సర్కిల్స్ తగ్గడమే కాదు చక్కటి మెరుపు కూడా సొంతం అవుతుంది. **యోగా/ధ్యానం:** ఒత్తిడి, డిప్రెషన్, జీవన శైలిలో మార్పుల వల్ల కళ్ల కింద నల్లటి వలయాలు వస్తాయి. ఒత్తిడి నుంచి బయపడేందుకు యోగా, మెడిటేషన్ ఉపకరిస్తాయి. రెగ్యులర్‌గా యోగా చేయడం వల్ల జీవ గడియారం బ్యాలెన్స్‌గా ఉంటుంది. నల్లటి మచ్చలు కూడా తగ్గుముఖం పడతాయి. **కీరదోస:** కీరదోసను గుండ్రటి ముక్కలుగా తరిగి కళ్లపై ఉంచుకోవడం వల్ల నల్లటి వలయాలు తగ్గుముఖం పడతాయి. కీరదోస ముక్కలను అర గంటపాటు ఫ్రిజ్‌లో ఉంచి నల్లటి వలయాలు ఉన్నచోట ఉంచాలి. పది నిమిషాలు ఆగాక చల్లటి నీళ్లతో ముఖాన్ని కడిగేసుకోవాలి. **పుదీనా ఆకులు:** పుదీనా ఉత్తేజాన్ని రిఫ్రెష్‌నెస్‌ను ఇస్తుంది. కళ్ల కింద నల్లటి వలయాలను తొలగించడానికి కూడా దీన్ని ఉపయోగిస్తారు. పుదీనా ఆకులను నలిపి నీటిలో కలిపి పేస్టులా చేసుకోవాలి. దీన్ని డార్క్ సర్కిల్స్ ఉన్న చోట రాసి పది నిమిషాలపాటు వదిలేయాలి. వారంపాటు ప్రతి రాత్రి ఇలా చేయడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయి. **రోజ్ వాటర్:** రోజ్ వాటర్ చర్మానికి పునరుత్తేజాన్ని ఇస్తుంది. దూదిని రోజ్ వాటర్‌లో ముంచి డార్క్ సర్కిల్స్‌పై ఉంచాలి. 15 నిమిషాలు ఆగాక చల్లటి నీటితో కడిగేసుకోవాలి. నెల రోజులపాటు ప్రతి రాత్రి ఇలా చేయడం వల్ల మెరుగైన ఫలితాలు ఉంటాయి.



కాక్‌టెయిల్ ఉంగరాల సొగసులు

పాత కాలం సినిమాల్లో ధరించే పెద్ద పెద్ద ఉంగరాలు ప్రస్తుతం ట్రెండ్ మార్కెట్‌లో చాలానే ఉంది. ఇది స్ట్రీట్ స్టైల్ ట్రెండ్ కూడా! అంటే , బంగారమే కాకుండా రకరకాల ఎలిమెంట్స్‌తో ఈ తరహా రింగ్స్‌ను అమ్మాయిలు నాజూకు వేళ్లకు ఠీవిగా పెట్టుకుంటున్నారు. సౌకర్యంగా, ఎప్పుడూ స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకునే ఇలాంటి కాక్‌టెయిల్ రింగ్‌ని ఒక్కటి ధరిస్తే చాలు. అందుకని, ఉంగరాల జాబితాలో ఈ రింగ్ ఉన్నదో లేదో చెక్ చేయండి. ఎందుకంటే మరో పదేళ్లయినా ట్రెండ్‌లో ఉండే రింగ్ డిజైన్ ఇది. వందల ఏళ్లనాటి ఈ డిజైన్ ఇప్పుడూ ఊపుమీద ఉన్నట్టే . మరో పాతికేళ్లకైనా మళ్ళీ రిపీట్ అవుతూనే ఉంటుందన్న అభిప్రాయం నేటి తరంలో ఉంది.

విద్యుత్ ఉద్యోగులకు జిపిఎఫ్ వర్తింపజేయాలి



మన తెలంగాణ/హైదరాబాద్: ఉమ్మడి పాలనలో 1999 నుంచి 2004 మధ్య కాలంలో నియమితులైన విద్యుత్ ఉద్యోగులకు జిపిఎఫ్ వర్తింపచేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు విద్యుత్ ఇంజనీర్ల జెఎసి విజ్ఞప్తి చేసింది. బుధవారం ఉదయం మంత్రి క్యాంపు కార్యాలయంలో జెఎసి నేతలు రత్నాకర్, సదానందం, కిరణ్‌కుమార్ తదితరులు మంత్రిని కలిసారు. 1999 నుంచి 2004 మధ్య కాలంలో 4,700 మంది ఉద్యోగుల మాత్రమే నియమితులయ్యారని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలాగా వీరికి కూడా జిపిఎఫ్ వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. తన పరిధిలో ఉన్నంత మేర న్యాయం చేస్తానని హామీనిచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కె జోషిని కలిసిన జెఎసి నేతలంతా ఈ విషయాన్ని కూలంకషంగా వివరించారు. ఆ తర్వాత ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రాను కలిసి విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ఉద్యోగుల విభజన, హైకోర్టు ఉత్తర్వులు అమలు చేస్తే వచ్చే పరిణామాలపై చర్చించారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పరిష్కరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

సిఎం అపాయింట్‌మెంట్‌కు వినతి



మన తెలంగాణ / హైదరాబాద్ : ఎస్‌సి వర్గీకరణకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్ళాలని కోరేందుకు సిఎం కెసిఆర్ అపాయింట్‌మెంట్‌ను కోరినట్లు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తెలిపారు. ఈ మేరకు బుధవారం సచివాలయానికి వచ్చి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ గతంలో హామీనిచ్చినట్లుగా అఖిలపక్ష బృందాన్ని ప్రధాని నరేంద్రమోడీ వద్దకు తీసుకెళ్లాలని అన్నారు. తమ 24 ఏళ్ల ఉద్యమ చరిత్రలో తొలిసారిగా బంద్‌కు పిలుపునిస్తున్నామని, టిఆర్‌ఎస్ సహా అన్ని పార్టీలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై ఒత్తిడి తేవాలని, టిఆర్‌ఎస్ ఎంపిలు తమ గళాన్ని వినిపించాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ప్రాజెక్టులు, హరితహారం పథకాలకు సిఎం సహా మంత్రులంతా డెడ్‌లైన్ పెట్టి మరీ పనిచేస్తున్నారని, ఇదే వేగం, స్ఫూర్తిని దళితులకు 3 ఎకరాల పథకంపై ఎందుకు పెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహ్మద్ మహమూద్ అలీ, మంత్రులు ఈటల రాజేందర్, టి.హరీష్‌రావులను మందకృష్ణ కలిసి విజ్ఞాపన పత్రాలను అందజేశారు.

అమరవీరుల కుటుంబాలకు సాయం

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మొత్తం 595 మంది అమరుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలుత అక్టోబరు 27 (2014లో)న మొత్తం పది జిల్లాల్లోని 450 మంది అమరులకు తలా పది లక్షల రూపాయల చొప్పున రూ. 45 కోట్లను (జివో నెం. 36) మంజూరు చేయగా, ఇందులో గరిష్ఠంగా కరీంనగర్ జిల్లాకు చెందిన అమరవీరులు 155 మంది, ఆ తర్వాత వరంగల్ జిల్లాలో 91 మంది, మెదక్ జిల్లాలో 52 మంది, నల్లగొండ జిల్లాలో 48 మంది చొప్పున ఉన్నారు. అనంతరం 2015 మార్చి, మే, జూలై, సెప్టెంబరు నెలల్లో 61 మందికి ఆర్థిక సాయం చేస్తూ జీవోలను విడుదల చేసింది. ఆ తర్వాతి సంవత్సరం జనవరి, మార్చి, మే, జూలై, ఆగస్టు, అక్టోబరు మాసాల్లో మరికొన్ని జీవోలను జారీ చేసి ఆర్థిక సాయం చేసింది. ఇప్పటివరకు మొత్తం 595 మంది అమరవీరుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించినట్లు రెవిన్యూ శాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. అమరవీరుల స్మారకస్థూపం నిర్మాణానికి వచ్చే నెల మొదటి వారంలో టెండర్లను ఆహ్వానించాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో అమరవీరుల కుటుంబాల జాబితాను రెవిన్యూ శాఖ సిద్ధం చేయగా ఇప్పటివరకు 595 మందికి జిల్లాల కలెక్టర్ల ద్వారా ఆర్థిక సాయం అందించినట్లు తేలింది.

ప్రియపై కేసులొద్దు

(మొదటిపేజీ తరువాయి)

దర్శకుడిపైనా దాఖలు అయిన కేసును కొట్టివేయాలని, ఇతర రాష్ట్రాలలో ఈ పాటకు సంబంధించి క్రిమినల్ చర్యలు నిరోధించాలని ప్రియా వారియర్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎఎం ఖాన్విల్కర్, డివై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం సత్వర రీతిలో స్పందించి బుధవారం తీర్పు వెలువరించింది. నటుడు, దర్శకుడిపై క్రిమినల్ కేసులను నిలిపివేసింది. తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు వెలువరించింది. నటిపై, దర్శకుడిపై ఎక్కడా క్రిమినల్ కేసులు నమోదు చేయవద్దని ఆదేశించడం ఈ నటికి మరింతగా రిలీఫ్‌ను ఇచ్చింది. ప్రియ, అబ్దుల్ రహూఫ్ జంటగా నటించిన చిత్రం ఒరు ఆదార్ లవ్‌లో ముస్లిం మనోభావాలను కించపరిచే విధంగా ఒక పాట ఉందని పేర్కొంటూ హైదరాబాద్‌లోని కొందరు విద్యార్థులు ఫలక్‌నుమా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీనితో నటిపై, దర్శకుడిపై కేసులు నమోదు అయ్యాయి. వీటిని నిలిపివేయాలని, తదుపరి చర్యలను తీసుకోరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది. మార్చి మొదటి వారంలో సినిమా విడుదల కానుంది. మహారాష్ట్రలో కూడా కొందరు ఈ పాట తమ మనోభావాలను గాయపర్చిందని పేర్కొంటూ ఫిర్యాదు చేయడం, కేసు నమోదు కావడం జరిగింది. ఈ నేపథ్యంలో తనపై ఎలాంటి చర్యలకు వీల్లేకుండా ఉత్తర్వులు జారీ చేయాలని ప్రియా వారియర్ పేర్కొన్నారు. ఈ సినిమాకు ఒమర్ లులు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ఈ పాట సందర్భంగా కన్ను గీటుతూ నటించిన ప్రియా వారియర్ తమ మత మనోభావాలను కించపరిచారని ముస్లిం వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. కేరళలోని త్రిస్సూర్ జిల్లా బికాం చదువుతున్న 18 సంవత్సరాల ప్రియా నటించిన సినిమాలోని ఒక సన్నివేశం నెట్ ద్వారా సంచలనానికి దారితీసింది.

పిల్లల్లో డిప్రెషన్

(మొదటిపేజీ తరువాయి)

రుగ్మతలపై ప్రజలకు సేవలందిస్తోందన్నారు. మరోవైపు ప్రపంచ ఐటి సదస్సు విజయవంతమైందని ఆ శాఖ మంత్రి కెటిఆర్ వ్యాఖ్యా నించారు. ఐటి రంగాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన విధానాలపై వివిధ రంగాల నిపుణులు మూడు రోజుల పాటు జరిగిన చర్చల్లో పలు సూచనలు చేశారని, వివిధ అంశాలపై లోతుగా జరిగిన చర్చలు అనేక సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తాయన్నారు. వచ్చే ఏడాది జరిగే ప్రపంచ ఐటి సదస్సుకు ఆర్మేనియా దేశం ఆతిథ్యం ఇవ్వనున్నందున ప్రతినిధులకు ఈ సదస్సు స్ఫటిక ట్రోఫీని కెటిఆర్ అందజేశారు. సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా హాజరైనందుకు బాలివుడ్ నటి దీపికా పదుకునేకు కెటిఆర్ 'స్పెషల్ థ్యాంక్స్' చెప్పారు. నాస్కామ్ ఫౌండేషన్ ప్రతినిధులు, సభికులకు ధన్యవాదాలు తెలియజేశారు. హైదరా బాద్‌లో ఈ సదస్సు విజయవంతం కావడంలో తెలంగాణ ప్రభుత్వంతో పాటు ఇక్కడికి వచ్చిన విదేశీ ప్రతినిధులందరి కృషి, భాగస్వామ్యం ఉందన్నారు. తైవాన్‌కు చెందిన టోయివాన్ సిటి తెలంగాణ ప్రభుత్వంతో వివిధ అంశాల్లో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కెటిఆర్ వెల్లడించారు. టి హబ్, టి బ్రిడ్జ్ కార్యకలాపాలకు ఆ దేశం సహాయ సహకారాలను తీసుకుంటామని, అధు నాతన టెక్నాలజీపై ప్రతి రెండేళ్లకోసారి సంయుక్త ప్రదర్శనలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. విద్యారంగంలోనూ, స్మార్ట్ టెక్నాలజీల్లోనూ తెలంగాణ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యా సంస్థలతో కలిసి పని చేసేందుకు టోయివాన్ సంసిద్ధత వ్యక్తం చేసిందని తెలిపారు.

ఆప్ ఎంఎల్‌ఎ సరెండర్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై దాడికి దిగినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. అన్షు ప్రకాశ్ పెదవి చిట్లినట్లు వైద్య నివేదికలో వెల్లడైంది. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఢిల్లీ పోలీసులు ఆప్ ఎంఎల్‌ఎ ప్రకాశ్ జర్వాల్‌ను అరెస్టు చేశారు. జర్వాల్ సౌత్ ఢిల్లీలోని డియోలీ నియోజకవర్గానికి ఎంఎల్‌ఎ ఉన్నారు. ఇప్పుడు ఒక్హాలా నియోజకవర్గ ఎంఎల్‌ఎ అమానతుల్లా పోలీసుల ఎదుట లొంగిపొయ్యారు. బుధవారం ఉదయం అమానతుల్లాను జామియా నగర్ పోలీసు స్టేషన్‌లో నిర్బంధంలోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు ఒక ప్రకటన వెలువరించాయి. చీఫ్ సెక్రెటరీపై దాడి ఘటన కేసులో ఈ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కాగా కేజ్రీవాల్ సలహాదారు వికె జైన్ కూడా దాడి సమయంలో ఘటనాస్థలిలో ఉన్నందున ఆయనను కూడా పోలీసులు విచారించారు. మరోవైపు ప్రధాన కార్యదర్శిపై దాడి, ఎమ్మెల్యేల అరెస్టు ఉదంతంలో జోక్యానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. పోలీసులు చట్ట ప్రకారం వారి చర్యలు వారు తీసుకుంటారని పేర్కొంది.

విద్యార్థులకు హెల్త్ కార్డులు, హైజీన్ కిట్స్



- 30 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- విద్యా, వైద్య శాఖల మంత్రుల నిర్ణయం

మనతెలంగాణ/హైదరాబాద్ : వచ్చే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని 30 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి హెల్త్ కార్డులు అందించాలని విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించాయి. దీనికి సంబంధించి ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డిలు బుధవారం సచివాలయంలో రెండు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జూలై నుంచి ఆరోగ్య పరీక్షలు ప్రారంభించి ఆరు నెలల్లో పూర్తి చేసి హెల్త్‌కార్డులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, విద్యాశాఖ గురుకుల విద్యాలయాలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న దాదాపు 8 లక్షల మంది విద్యార్థులకు హెల్త్ అండ్ హైజీన్ కిట్స్ ఇవ్వాలని నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో ప్రభుత్వం తెలిపింది. 31 జిల్లాల్లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ విద్యాలయాల్లోని విద్యార్థులందరికీ పరీక్షలు చేసి హెల్త్‌కార్డులు అందించాలని, ఇందుకు విద్య, వైద్య శాఖలు సంయుక్తంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయనున్నట్లు పేర్కొనింది. ప్రభుత్వ విద్యాలయాల్లో 7,8,9,10 తరగతులు చదివే విద్యార్థులకు యుక్తవయస్సులో వచ్చే ఆరోగ్య సమస్యలు, సంరక్షణపై అవగాహన తరగతులు నిర్వహించాలని, ఇందుకోసం ఉన్నత పాఠశాలలలోని మహిళా టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొనింది. బాలికల్లో రక్తహీనతను దృష్టిలో పెట్టుకుని కెజిబివిలు, మోడల్ స్కూళ్లు, గురుకుల పాఠశాలల్లో అందిస్తున్న పోషకాహారం మెనూను మిగిలిన పాఠశాలల్లో కూడా అమలుచేసేలా ఆరోగ్యశాఖకు మంత్రి కడియం విజ్ఞప్తి చేసినట్లు తెలిపింది. ఈ రెండు కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేసే ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొనింది. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమార్, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

సిఎం కెసిఆర్ సోదరి మృతి



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రెండవ సోదరి పి.విమలాబాయి బుధవారం ఉదయం మరణించారు. గత కొద్ది కాలంగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. చికిత్స పొందుతూ ఒక ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. విమలాబాయి మృతి తెలియగానే సిఎం కెసిఆర్ అల్వాల్‌లోని మంగాపురం కాలనీలోని ఆమె నివాసానికి వెళ్ళి భౌతికకాయంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అక్కడ పార్థీవ శరీరాన్ని చూసిన కెసిఆర్ భావోద్వేగానికిలోనై కన్నీటి పర్యంతమయ్యారు. ఆమెతో ఉన్న అనుబంధాన్ని కెసిఆర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కెసిఆర్‌కు మొత్తం 8 మంది అక్కలు, ఒక చెల్లె, ఒక అన్న ఉన్నారు. మంత్రులు మహ్మద్ మహమూద్ అలీ, టి.హరీష్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు విమలాబాయి నివాసానికి వెళ్ళి భౌతికకాయంపై పుష్పగుచ్చాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. విమలాబాయి అంత్యక్రియలు తిరుమలగిరి శ్మశానవాటిలో జరిగాయి.

మృత్యు కారు

(మొదటిపేజీ తరువాయి)

గ్రామంలో గల దేవర పండుగ కోసం బయలుదేరారు. దాదాపు 8 గంటల ప్రాంతంలో కనిమెట్ట గ్రామం దాటి వెళ్తుండగా వాహనం టైరు పగిలి డివైడర్ దాటి కర్నూల్ నుండి హైద్రాబాద్ వెళ్తున్న (టిఎస్ 08 ఇక్యు 8108) మరో కారు ను ఢీకొనడంతో హైదరాబాద్ నుండి మూలమల్ల వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న మూలమల్ల గ్రామానికి చెందిన మల్లేష్,ఆంజనేయులు, గోపన్‌పేట గ్రామానికి చెందిన బీరయ్య, అజ్జకొల్లు గ్రామానికి చెందిన రాజులు అక్కడికక్కడే మృతి చెందారు. మొగులన్న, నాగేష్‌లకు తీవ్ర గాయాలు కాగా మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా నాగేష్ నందిమల్ల ఆసుపత్రిలో మృతి చెందాడు. అదే విధంగా కర్నూల్ నుండి హైద్రాబాద్ వెళ్తున్న సూరిబాబు, తల్లి ప్రసూన, అత్త రాజేశ్వరమ్మ, ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా సూరిబాబు భార్య సునిత ,కూతురు కల్పనకు తీవ్ర గాయాలు కాగా మహబూబ్ నగర్ ఆసుపత్రిలోచికిత్స చేస్తుండగా సునిత మృతి చెందింది. ఘటనాస్థలిలో మృతి చెందిన ఏడుగురి మృతదేహాలను ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వాహనంలో ఇరుక్కున్న మృతదేహాలు..

రోడ్డు ప్రమాదానికి గురైన రెండు కార్లలో బీరయ్య, మల్లేష్ ,మరో వాహనంలో సూరిబాబు, తల్లిప్రసూన, అత్త రాజేశ్వరమ్మలు కారులో మృతదేహాలు ఇరుక్కుపోయాయి. ప్రమాద సంఘటన తెలుసుకున్న సిఐ సోంనారాయణ్‌సింగ్ ,ఎస్‌ఐ రవి కాంత్‌రావు వచ్చి గ్రామస్తుల సహకారంతో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి వాహనంలో ఇరుక్కున్న వారిని అతి కష్టంమీద పోలీసులు ,ఎల్‌అండ్‌టి కార్మికులు బయటకు తీశారు. కాగా, విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఎ ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిరంజన్, ఎఎస్‌పి సురేందర్ రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఇంటింటికీ ఇంటర్నెట్

(మొదటిపేజీ తరువాయి)

దేశంలోనే ముందున్నామన్నారు. ప్రపంచ ఐటి సదస్సులో బుధవారం నాస్కామ్ సోషల్ ఇన్నోవేషన్ ఫోరం (ఎన్‌ఎస్‌ఐ) 2017–18 అవార్డుల ప్రదానోత్స కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కెటిఆర్ ప్రసంగించారు. ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, నాస్కామ్ ఫౌండేషన్ సిఈవో శ్రీకాంత్ సిన్హా, సయంట్ ఫౌండర్ అండ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బివిఆర్ మోహనరెడ్డి తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో కెటిఆర్ ప్రసంగిస్తూ, మరమనిషి సోఫియా పనితీరు సర్వత్రా ఆసక్తిని రేకెత్తించిందన్నారు. రానున్న రోజుల్లో మైక్రోసాఫ్ట్ సహాయంతో చిన్నారులకు రోబో (మర మనిషి) ద్వారా వైద్య పరీక్షలు అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేయనుందన్నారు. ఈ విధానం మరిన్ని మార్పులకు నాంది పలకనుందని కెటిఆర్ అన్నారు. కృత్రిమ మేధస్సు సహా కొత్త సాంకేతిక సహాయంతో వ్యవసాయం, విద్య, వైద్యం సహా అనేక రంగాల సమస్యలకు పరిష్కారం చూపవచ్చని నిపుణులు చెబుతున్నారని కెటిఆర్ అన్నారు. గ్రామీణ సాంకేతికతపై దృష్టి సారిస్తే తెలంగాణ అద్భుత ఫలితాలను సాధిస్తుందని, పెట్టుబడులు పెట్టేందుకు బహుళజాతి సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.

సామాజిక ఆవిష్కరణలకు 40 లక్షలు : సామాజిక ఆవిష్కరణలకు రూ. 40 లక్షలను నాస్కామ్ ఫౌండేషన్ అందజేసింది. వివిధ విభాగాల్లో పదవ ఎడిషన్ విజేతలను ప్రకటించిన నాస్కామ్ మంత్రి కెటిఆర్ చేతుల మీదుగా విజేతలకు నగదు పురస్కారాలను ప్రదానం చేసింది. ఎడ్యుకేషన్ విభాగంలో పిఓ జామ్ ఫౌండేషన్, సాజా సంస్థ, ఫైనాన్సియల్ ఇన్‌క్లూజన్ విభాగంలో డోనెట్ కార్ట్, దానామోజా సంస్థలకు, పర్యావరణ విభాగంలో స్ట్రాటా ఎన్విరో లిమిటెడ్, హెల్త్ కేర్‌లో ఎపోకేర్, ఎంపథి డిజైన్ ల్యాబ్స్‌ను విజేతలకుగా ఎంపికైన సంస్థల్లో ఉన్నాయి.

జ్వలించే జ్ఞాపకం

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. లుంబినీ పార్కుకు ఆనుకుని ఉన్న మూడెకరాల స్థలంలో సుమారు పాతిక మీటర్ల ఎత్తులో ఈ స్మారకాన్ని నిర్మించడానికి రంగం సిద్ధమైంది. గతంలో రూపొందించిన స్మారక స్థూపం నమూనాకు ఇటీవల స్వల్ప మార్పులు చేసిన తర్వాత సిఎం ఆమోదం లభించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి స్మారకస్థూపాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు రోడ్డు భవనాల శాఖ అధికారులు వ్యాఖ్యానించారు. తెలంగాణ శకటాన్ని రూపొందించిన ప్రముఖ ఆర్టిస్టు రమణారెడ్డి ఈ నమూనాను తయారుచేయగా తనికెళ్ళ ఇంటిగ్రెటెడ్ కన్సల్టెంట్లు అనే సంస్థ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరించింది. ప్రస్తుతం పర్యాటకశాఖ వినియోగంలో ఉన్న ఈ స్థలాన్ని జిహెచ్‌ఎంసి ఇటీవల తన ఆధీనంలోకి తీసుకుంది. మొత్తం ఏడంతస్తులతో డిజైన్ చేసిన ఈ స్మారక స్థూపంలో ఒక కన్వెన్షన్ హాల్ (700 మంది కూర్చునేలా 715 చ.మీ. విస్తీర్ణం), ఆడియో విజువల్ థియేటర్ (150 మందికి సరిపోయేలా 152 చ.మీ. విస్తీర్ణం), ఫోటో గ్యాలరీ (60 చ.మీ.), ఉద్యమాన్ని ప్రతిబింబించే మ్యూజియం (60 చ.మీ.), రెస్టారెంటు తదితరాలు ఉంటాయి. సందర్శకుల తాకిడి గణనీయంగా ఉంటుందని భావించిన ఆర్కిటెక్ట్‌లు భూమి లోపల రెండు సెల్లార్ అంతస్తులను వాహనాల పార్కింగ్ కోసమే కేటాయించేలా డిజైన్‌ను రూపొందింది. డిజైన్ ప్రకారం నిర్మాణం చేపట్టేందుకు గల అవకాశాల కోసం రోడ్లు భవనాల శాఖ అధికారులు ఆరు చోట్ల మట్టి సమూనాలను సేకరించి అనువుగా ఉన్నట్లు ధృవీకరించారు. వెలుగుతున్న జ్యోతి, ప్రమిద ఆకారంలో ఉండే ఈ స్థూపం భూ ఉపరితలం నుంచి 23 మీటర్ల ఎత్తుతో ఉంటుంది. వెలుగుతున్న జ్యోతిలా ఉండే ఆకారం ఎత్తు సుమారు 20 అడుగుల కంటే ఎక్కువే ఉంటుంది. రాత్రివేళల్లో వెలుగుతున్నట్లుగా కనిపించేలా ప్రత్యేకమైన ఫైబర్‌తో తయారుచేసి 'గ్లో సైన్' దీప కాంతులను అమర్చాలని అధికారులు భావిస్తున్నారు. ప్రాంగణంలో నీళ్ళ ఫౌంటెయిన్ మధ్యలో సుమారు 15 మీటర్ల ఎత్తులో స్థూపాన్ని, దానిపైన చివర్లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అమర్చేలా డిజైన్ రూపొందింది. ఈ స్థూపానికి ఇరువైపులా పది జిల్లాలకు ప్రతీకగా పది అమరుల స్థూపాలు కూడా ఉంటాయి. ట్యాంక్‌బండ్‌కు ప్రత్యేక ఆకర్షణగా ఉన్న బుద్ధ విగ్రహం, జాతీయ జెండా స్థూపం సైతం ఇక్కడికి కనిపించేలా డిజైన్ రూపొందింది. టెండర్లు ఖరారైన తర్వాత ఏడాదికాలంలోపే నిర్మాణం పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు. అమరవీరుల త్యాగం నిత్యం స్ఫురణలో ఉండేలా జ్వలిస్తున్న జ్యోతి ఆకారం, ప్రమిద తరహాలో డిజైన్‌ను రూపొందించడం విశేషం.

పల్లీ ధర పల్టీ



(మొదటిపేజీ తరువాయి)

వనపర్తి మార్కెట్ యార్డులో ప్రారంభించిన వేరుశనగ కొనుగోలు కేంద్రం ద్వారా రైతులందరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తాం : ప్రభుత్వం ఇటీవల వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన వేరుశనగ కొనుగోలు కేంద్రం ద్వారా వేరుశనగ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని జెసి నిరంజన్ హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమింపజేశారు. జడ్పిటిసి వెంకటయ్య యాదవ్, డిసిసి అధ్యక్షులు శంకర్ ప్రసాద్, యాదవ సంఘం నాయకులు వసంత సుబ్బయ్య ఉన్నారు.

కమల్ పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

నాయకుడిగా నటించి దశాబ్దాలుగా అందరి మన్ననలు అందుకుంటూవస్తున్న కమల్ తనకు మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం ఆదర్శం అని పేర్కొంటూ ఈ కొత్త పార్టీని ప్రారంభించారు. తమిళనాడులో ద్రవిడ పదం లేకుండా ఒక రాజకీయ పార్టీ ఆవిర్భవించడం ఇదే తొలిసారి. పార్టీ ప్రారంభానికి ముందు మధురైలోని కలాం నివాసానికి వెళ్లి , కలాం శతాధిక వయోవృద్ధ సోదరుడు మహమ్మద్ ముత్తుమీరన్ లెబ్బల్ మరైక్కయర్ ఆశీస్సులు పొందారు. కలాం నివాసం నుంచే తన రాజకీయ యాత్ర ప్రారంభం అవుతుందని వెల్లడించారు. విలక్షణ నటుడిగా పేరొందిన కమల్ తాను రాజకీయాల ప్రక్షాళనకు, తమిళుల ఆత్మగౌరవానికి రాజకీయాలలోకి వస్తున్నానని ప్రకటిస్తూ వచ్చారు. అనుకున్నట్లుగానే ఆయన రాజకీయ అరంగేట్రం చేశారు. జస్టిస్ ఫర్ పీపుల్ తన నినాదం అని, అందుకే పార్టీకి మక్కళ్ నీది మయ్యమ్ పేరు పెట్టానని కమల్ వెల్లడించారు. తమిళనాడులో తాజాగా విజయ్‌కాంత్ తరువాత రాజకీయ పార్టీ ఆరంభించిన సినీ నటుడిగా కమల్ నిలిచారు. తోటి అగ్రనటుడు రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశం వార్తలు జోరు అందుకున్న తరుణంలోనే కమల్ రాజకీయపార్టీ ఆరంభం కావడం విశేషం. మధురైలో ఒత్తకడై మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పార్టీ పేరును జెండాను కమల్ అశేష అభిమానులు, విశ్లేషకులు మధ్య ప్రకటించారు. తెలుపు రంగు జెండాలో ఎరుపు నలుపు మిళితం అయి ఉంది. ఆరు కలిసి ఉన్న చేతులు తెలుపు, ఎరుపు రంగుల్లో ఉండగా మధ్యలో తెల్లటి నక్షత్రంతో జెండా రూపొందింది. దక్షిణాది రాష్ట్రాల ప్రజలంతా ఒకటేఅనే సంకేతాన్ని ఈ జెండాలో వ్యక్తపర్చారు. కమల్ రాజకీయ పార్టీ ప్రారంభ సభకు ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ ముఖ్య అతిధిగా వచ్చారు. ఢిల్లీ న్యాయశాఖ మాజీ మంత్రి సోమ్‌నాథ్ భారతి, రైతు నాయకుడు పిఆర్ పాండ్యన్ సభకు అతిధులుగా వచ్చారు. maiam.com పేరిట పార్టీ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఇదే పేరుతో ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలను ప్రారంభించారు. ఇది తన సొంత పార్టీ కాదని, ప్రజల పార్టీ అని, ఇందులో తాను ఒక భాగం అని , ఇక్కడికి వచ్చింది పార్టీ ప్రారంభించింది తాను చెప్పింది ప్రజలు వినడానికి కాదని, ప్రజలు చెప్పేది తాను వినడానికి అని కమల్ వేలాది మంది కరతాళధ్వనుల మధ్య చెప్పారు. తాను నాయకుడిని కానని, ప్రజల చేతిలో పనిముట్టును అని, ప్రజలకు సలహాలు చెప్పేంత స్థాయి తనకు లేదని, వారి నుంచి తగు సూచనలు తీసుకుని ఈ ప్రస్థానంలో సాగిపోతానని తెలిపారు. తనను ప్రజలు తనవాడిగా భావించుకుని, వారి చేతుల్లో ఉపకరణంగా అనుకుని తగు విధంగా ఆదేశించాలని, అప్పుడే ఈ పార్టీకి తాను న్యాయం చేయడం, తద్వారా ప్రజా న్యాయం ఆశయం సాధించడం జరుగుతుందని తెలిపారు. మీకు సేవలు చేసేలా నాకు మార్గదర్శనం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం ఇప్పుడు అవినీతితో రగిలిపోతోందని, తమిళనాడు అంటే అవినీతిమయం అనే చెడ్డపేరు వచ్చిందని, ఈ మచ్చ తొలిగిపోయి, అవినీతి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం తన అభిమతం అని కమల్ ఉద్వేగభరితంగా తెలిపారు. రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు ముందు కమల్ రామేశ్వరంలోని అబ్దుల్ కలాం సమాధిని దర్శించుకున్నారు. కలాం సమాధి ముందు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కమల్‌కు అభివాదాలు తెలుపుతూ అభిమానులు తరలిరావడంతో ఆ ప్రాంతం మార్మోగింది. వారిని అదుపు చేయడం పోలీసులకు ఇబ్బందిగా మారింది.


ప్రజలతో ఇష్టాగోష్టి పలు ప్రశ్నలకు సమాధానం

ప్రసంగం ముగించిన తరువాత కమల్ ఇష్టాగోష్టిలో పాల్గొన్నారు. సభికుల నుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. రచయిత భారతి కృష్ణకుమార్ అనుసంధానకర్తగా ఉన్నారు. ఇప్పటివరకూ మీరెక్కడున్నారు? అనే ప్రశ్నలే నటుడికి ఎక్కువగా వచ్చాయి. వీటికి కమల్ నవ్వుతూ తాను ఇంత కాలం జనం మదిలో (ఉల్లం) ఉన్నానని, వారి అభిమానం తనకు అందిందని తెలిపారు. ఇకపై తాను అందరి ఇళ్లల్లో (ఇళ్లమ్) ఉంటానని కమల్ చెప్పడం ఆకట్టుకుంది. తనను ఇంట్లో వెలిగే దీపంగా భావించుకుంటే సంతోషం అన్నారు. ఎంతకాలం తమతో ఉంటారని అడగ్గా జీవించి ఉన్నంత వరకూ అని చెప్పారు.

పార్టీ జెండాపై వివరణ

పార్టీ జెండాలోని ఆరు చేతులు పాండిచ్చేరితో పాటు దక్షిణాదిలోని ఆరు రాష్ట్రాలను ప్రతిఫలిస్తాయని కమల్ చెప్పారు. ఇక నక్షత్రం ప్రజలకు ప్రతీక అని చెప్పారు. ఈ జెండా ద్వారా దక్షిణాది ప్రాంతీయతను చాటేందుకు కమల్ సిద్ధం అయినట్లు వెల్లడయింది.

పార్టీని ప్రారంభించిన కమల్ హాసన్‌ను వేదిక నుంచి ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ అభినందించారు. ఉప్రజలకు ప్రత్యామ్నాయ శక్తిగా ఆయన ఎదుగుతారని తెలిపారు. ఇప్పటివరకూ ఈ రాష్ట్రం అవినీతి పార్టీల చక్రబంధంలో రగిలిపోయిందని ఇకపై కొత్త అనుబంధం ఉంటుందని ఇది మంచికే అని ఆశిస్తున్నట్లు వెల్లడించారు.







హైదరాబాద్‌లో కొత్తగా నాలుగు పారిశ్రామిక పార్కులు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని నాలుగు కొత్త పారిశ్రామిక పార్కులను 'పారిశ్రామిక టౌన్‌షిప్' లుగా ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ టౌన్‌షిప్‌లు ఇకపై స్థానిక సంస్థలుగా పనిచేస్తాయి. నోటిఫై అయిన ప్రాంతాలు మాదాపూర్, ఇబ్రహీంపట్నం, కుత్బుల్లాపూర్, వరంగల్‌లలో ఉన్నాయి. అలాగే నానాక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి ఐటి సెజ్‌లలోని ఐటి పార్కులను 'పారిశ్రామిక టౌన్‌షిప్'లుగా నోటిఫై చేశారు. ఈ మేరకు రాష్ట్ర పుర పాలక పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాదాపూర్ ఐఎఎల్‌ఎలో రాయదుర్గ్‌లోని హైదరాబాద్ నాలెడ్జ్ సిటీ, మియాపూర్, కుత్బుల్లాపూర్ ఐఎఎల్‌ఎలో గాజులరామారం, ఇబ్రహీంపట్నం ఐఎఎల్‌ఎలో కొంగరకలాన్, ఇబ్రహీంపట్నం కంపోజిట్ మానిఫ్యాక్చర్ క్లస్టర్, వరంగల్ ఐఎఎల్‌ఎలో మడికొండ ఐటి పార్క్, టెక్స్‌టైల్ పార్కులు, కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌లు ఉన్నాయి. ఐఎఎల్ ఎలు, వాటి పరిసర ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీలు, చెరువుల నిర్వహణ, మౌలికసదుపాయాలను అభివృద్ధి కార్యక్రమాలను టిఎస్‌ఐఐసి చేపడుతుందని పురపాలక పరిపాలనా శాఖ తెలియజేసింది. ఈ టౌన్‌షిప్‌ల నుంచి వచ్చే ఆదాయంలో 35 శాతాన్ని సంబంధిత స్థానిక సంస్థలకు అందజేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. టిఎస్‌ఐఐసి వైస్ ఛైర్మన్, ఎండిల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

పకడ్బందీగా ప్రమాదాల నివారణ

- **10 ఎకరాల్లో అధునాతన ఇన్‌స్పెక్షన్, టెస్టింగ్ సెంటర్**
- **90 శాతం పూర్తైన నిర్మాణం**

మన తెలంగాణ /హైదరాబాద్ : ట్రాన్స్‌పోర్ట్, ప్రయాణికుల రవాణ భారీ వాహనాలలో లోపాలను నివారించి పూర్తిస్థాయిలో భద్రతా ప్రమాణాలను పాటించడం, తద్వారా ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా రాష్ట్రంలో నిర్మిస్తున్న 'అడ్వాన్స్‌డ్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్షన్, టెస్టింగ్ సెంటర్'' (ఎ ఎంవిఐటిసి) మే నెలలో ప్రారంభం కా నుంది. కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ, తెలంగాణ రాష్ట్ర రవాణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూ. 14.4 కోట్ల వ్యయంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపురంలో 10 ఎకరాలలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన ఎఎంవిఐటి సెంటర్ నిర్మాణం దాదాపు 90 శాతం మేరకు పూర్తైంది. పరిపాలన భవనంతో పాటు నాలుగు టెస్టింగ్ కేంద్రాలను నిర్మించగా స్పెయిన్, స్వీడన్ నుంచి దిగుమతి చేసుకుంటున్న పరికరాలు త్వరలోనే రాష్ట్రానికి రానున్నాయి. ఈ సెంటర్ కోసం బడ్జెట్‌లో కేటాయించిన రూ.3.5 కోట్లతో మిగిలిన పనులను పూర్తి చేసేందుకు రవాణ శాఖ చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న ప్రమాదాలను, ముఖ్యంగా భారీ ట్రాన్స్‌పోర్ట్, ప్రజా రవాణ వాహనాల నిర్వహణ లోపాలు, భద్రతా ప్రమాణాలు పా టించకపోవడం వల్ల ఏటా పెద్దఎత్తున ప్రమాదాలు చోటుచేసుకుంటూ ఎక్కువ సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారీ వాహనాల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్ల జారీ వ్యవస్థను ప్రక్షాళన చేసి మరింత పటిష్టంగా అమలు చేయాలని కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారులశాఖ నిర్ణయించింది. అందులో భాగం గా రవాణ శాఖ అధికారులు, సిబ్బంది భౌతికంగా వాహనాలను పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను జారీ చేసే వ్యవస్థను పూర్తిగా మార్చివేసేందుకు చర్యలు చేపట్టింది. మల్కాపూర్ ఏర్పాటు చేస్తున్న ఎఎంవి ఐటి సెంటర్‌లో మానవ తప్పిదాలకు, సిబ్బంది అవినీతి అవకతవకలకు ఆస్కారం లేకుండా నిబంధనల ప్రకారం వాహనాల భద్రత ప్రమాణాలు, కాలుష్య ఉద్గారాలను పూర్తిగా కంప్యూటరీకరించనుంది.

ఏ లోపమున్నా పట్టేస్తుంది : భారీ వాహనాల టైర్లు మొదలు స్టీరింగ్, హెడ్ లైట్లు, గేర్ బాక్స్, బ్రేకులు, వీల్ అలైన్‌మెంట్, వీల్ బ్యాలెన్సింగ్, గ్లాస్ అలైన్ మెంట్, కాలుష్య ఉద్గారాల విడుదల మోతాదు తదితరాలన్నీ పూర్తిగా కంప్యూటరీకరణ పద్ధతిలోనే జరుగుతుంది. వాహనంలోని చిన్న లోపాన్ని కూడా ఈ పరికరాలు కచ్చితంగా గుర్తిస్తాయి. మరమ్మత్తులు చేసి వాటిని సరిచేసుకుంటే తప్ప సర్టిఫికేట్ జారీ చేయడం సాధ్యం కాదు. ప్రతి రోజు సుమారు 300 వాహనాలను పరిశీలించే సామర్థ్యం ఈ సెంటర్‌కు ఉంది. తొలి దశలో భారీ ట్రాన్స్‌పోర్ట్, ప్రజా రవాణ వాహనాలను, మలి దశలో అన్ని రకాల ట్యాక్సీ వాహనాలను పరిశీలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎఎంవిఐటి సెంటర్‌ను పూణె కేంద్రంగా కొనసాగుతున్న భారత ఆటోమొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ (ఎఆర్ఎఐ) ఆధ్వర్యంలో స్పెయిన్‌కు చెందిన 'విటెక్' సంస్థ రెండేళ్ల పాటు నిర్వహించి అనంతరం రాష్ట్ర రవాణ శాఖకు బదిలీ చేస్తుంది. దేశంలోని అధునాతన వాహన టెస్టింగ్ సెంటర్లలో రాష్ట్రంలోని ఎఎంవిఐటి సెంటర్ ఒక ప్రముఖ సెంటర్‌గా నిలవనుందని రాష్ట్ర రవాణ శాఖ అధికారులు భావిస్తున్నారు.


ప్రమాదాలను అరికట్టవచ్చు : ''రాష్ట్రంలో కూడా భారీ ట్రాన్స్‌పోర్ట్, ప్రజా రవాణ వాహనాలను వాటి యజమానులు సక్రమంగా నిర్వహించడం లేదు. చౌటుప్పల్ ఎఎంవిఐటి సెంటర్‌లో పూర్తిగా కంప్యూటరీకరించిన విధానంతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను జారీ చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించడం, సిబ్బంది తప్పిదాలు, పొరపాట్లను నివారించడం, ఈ వ్యవస్థలో అవకతవకలు, అవినీతిని అరికట్టేందుకు అవకాశం ఏర్పడుతుంది'' అని రవాణ శాఖ సంయుక్త కమీషనర్ సి.రమేష్ 'మన తెలంగాణ' ప్రతినిధితో చెప్పారు.



స్వర్ణ దేవాలయంలో కెనడా ప్రధాని

- **పంజాబ్ సిఎంతో భేటీ, ఖలిస్థాన్ వేర్పాటువాదులకు మద్దతివ్వబోమని హామీ**

అమృత్‌సర్: కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో బుధవారం స్వర్ణ దేవాలయంలో ప్రార్థనలు చేశారు. ఆయన కాషాయ రంగు శిరోవస్త్రం, తెల్లని కుర్తా–పైజామా వంటి సిక్కు సాంప్రదాయిక వస్త్రధారణలో స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు. ఆయన వెంట పంజాబీ వస్త్రధారణలోనే ఆయన భార్య సోఫీ గ్రెగోయిర్ ట్రూడో, ఇద్దరు పిల్లలు కూడా ప్రార్థనలు చేశారు. జస్టిన్ ట్రూడోకు ఎల్లా గ్రేస్, జావియర్, హ్యాడ్రిన్ అనే ముగ్గురు సంతానం. ఆయన వెంట మాత్రం ఇద్దరే ఆలయానికి వచ్చారు. ఆలయాన్ని సందర్శించే వారికి సిక్కు భక్తులు స్వచ్ఛందంగా అందించే సేవలో భాగంగా ఆయన గురు రామ్ దాస్‌జీ లంగర్ హాల్‌లో రొట్టెలు కూడా చేశారు. అంతేకాక వారు వందలాది భక్తులు తమ మొబైళ్ల ద్వారా ఫోటోలు తీసుకునేప్పుడు చేతులు మోడ్చి నమస్కరించారు. ఆ కెనడా ప్రముఖుల చుట్టూ ఆలయంలోని 'సేవాదార్‌లు'(స్వచ్ఛంద కార్యకర్తలు) వలయంగా ఏర్పడి రక్షణ కవచం కల్పించారు. ట్రూడో కుటుంబానికి శిరోమణి గురుద్వార ప్రబంధక్ కమిటీ స్వర్ణ దేవాలయంలోకి ఘనస్వాగతం పలికింది. గుడి చుట్టూ ట్రూడో కుంటుంబ సభ్యులు పరిక్రమ(ప్రదక్షిణ) చేశారు. ఆలయంలో వారి కుటుంబ సభ్యులకు 'సిరోప'(గౌరవ వస్త్రం) ఇచ్చారు. కెనడా ప్రధాని వెంట ఆ దేశ రక్షణ మంత్రి హర్జీత్ సజ్జన్ కూడా స్వర్ణ దేవాలయానికి వచ్చారు. గృహ, పట్టణ వ్యవహారాల కేంద్ర సహాయ మంత్రి (స్వతంత్ర) హర్దీప్ సింగ్ పూరి, పంజాబ్ సాంస్కృతిక వ్యవహారాలు, పర్యటన మంత్రి నవజోత్ సింగ్ సిధు కూడా ఆయన వెంట ఉన్నారు. కెనడా సిక్కులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. శిరోమణి అకాలీ దళ్ చీఫ్ సుఖ్‌బీర్ సింగ్ బాదల్, శిరోమణి గురుద్వార ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు గోబింద్ సింగ్ లొంగోవాల్ వారందరినీ స్వర్ణ దేవాలయంలోకి ఆహ్వానించారు. ఆయన పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్‌తో హోటల్‌లో 40 నిమిషాల పాటు భేటీ అయినప్పుడు భారత్‌లో కానీ, ఇంకా వేరే ఎక్కడైనా కానీ వేర్పాటువాదులకు కెనడా మద్దతు ఇవ్వదని హామీ ఇచ్చారు. వారిద్దరూ వ్యాపారం, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాల గురించి చర్చించారు.



మాటల గారడీ చేస్తున్న ప్రభుత్వం

- **కార్యకర్తలకు అండగా ఉంటాం**
- **సిఎల్‌పి నేత జానారెడ్డి**
- **కాంగ్రెస్‌లో పలువురి చేరిక**

మనతెలంగాణ/అడవిదేవులపల్లి: గారడీ మాటలతో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతుందని సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. అడవిదేవులపల్లి మండల కేంద్రంలో బుధవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్ అధ్యక్షతన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అడవిదేవులపల్లి, ఉడిపి, బాల్నేపల్లి, చిట్యాల గ్రామాలకు చెం దిన పలువురు కార్యకర్తలు జానా సమక్షంలో కాంగ్రెస్‌లో చేరా రు. వారికి జానా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించా రు. టిడిపికి చెందిన బండి నాగేశ్వర్‌రావు, టిఆర్‌ఎస్‌కు చెం దిన కేశబోయిన మల్లయ్య, తదితరులు పార్టీలో చేరారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. పార్టీకి చేదోడు వాదోడుగా ఉంటూ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను కంటికి రెప్పలాగా కాపాడుకుంటామన్నారు. టిఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగేళ్లు అవుతున్నా.. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతులకు రూ. లక్ష రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని చెప్పి నాలుగు విడతలుగా చేయడం వల్ల అది వడ్డీకే సరిపోయిందన్నారు.



సాధ్యం కాని హామీలతో అధికారంలోకొచ్చిన టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఎస్‌సి,ఎస్‌టి భూపంపిణీ, ముస్లింలకు 12% రిజర్వేషన్లు వంటి హామీలు నీటి మూటలయ్యాయన్నారు. మాటల ప్రభుత్వమే కానీ.. చేతల ప్రభుత్వం కాద ని ఎద్దేవా చేశారు. ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వారికి పార్టీ ఎప్పు డు అండగా ఉంటుందన్నారు. కొత్తగా చేరిన వారు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- **కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న మోడీ : చాడ**
- **కోహెడలో సిపిఐ జిల్లా మహాసభలు ప్రారంభం**

మనతెలంగాణ/కోహెడ: దేశంలో మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ అనేక హామీలను ఇస్తూ ప్రజలను మోసగిస్తున్నారు.. వారివి ఉత్తమాటలే తప్పా చేతల్లేవ్..నల్లధనాన్ని వెనక్కి తెప్పించడంలో ప్రధాని మోడీ విఫలమయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ నియంతృత్వ పాలన సాగిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. బుధవారం సిద్దిపేట్ జిల్లా కోహెడ మండల కేంద్రంలో సిపిఐ జిల్లా రెండవ మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు స్థానిక అంగడీ బజారులో నిర్వహించిన బహిరంగ జిల్లా కార్యదర్శి మంద పవన్ అధ్యక్షతన జరిగింది.ఈ సభలో చాడ వెంకట్‌రెడ్డి ప్రసంగించారు. దేశంలో అధికారంలోకి వస్తే బిజెపి అవినీతిరహిత పాలన కొనసాగిస్తాందని, విదేశాల్లో ఉన్న రూ,71లక్షల కోట్ల నల్లధనాన్ని వంద రోజుల్లో వెనక్కి తెస్తామని చెప్పి



అధికారంలోకి వచ్చాక ఆ డబ్బు తీసుకురావడంలో మోడీ విఫలమయ్యారు. ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కెసిఆర్ వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో టిఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా రాజకీయ పునరేకీకరణ జరగాలని, అందుకోసం సిపిఐ మిగతా వామపక్షలను కలుపుకుని ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు,కంట్రోల్ కమిటీ సభ్యులు ఎడ్ల వెంకట్రాంరెడ్డి,జిల్లా కార్యదర్శి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులుదయనందరెడ్డి, ఐలయ్య, సృజన్‌కుమార్, బాలమల్లు, శంకర్, మల్లేశ్, శ్రీనివాస్,వెంకట్‌రెడ్డి, కూమార్,భిక్షపతి, స్వామి, వంశీదర్, జనర్దన్,తిరుపతి, పాల్గొన్నారు.

లంగర్‌హౌస్‌లో భారీ చోరీ

మన తెలంగాణ/హైదరాబాద్/కార్వాన్: లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే లంగర్‌హౌస్ ప్రాంతానికి చెందిన షేక్ ఫయాజుద్దీన్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం సాయంత్రం సమయంలో బోరబండలో జరిగిన విందుకు వెళ్లారు. అతడి కుమారుడు షేక్ రియాజుద్దీన్ రాత్రి 10 గంటలకు కంటి అద్దాల దుకాణాన్ని మూసివేసి ఇంటికి వచ్చాడు. ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని 70 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు కనిపించలేదు. వెంటనే అతడు లంగర్‌హౌస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాసిరకం కందులు సీజ్

మనతెలంగాణ/కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని వ్యవసాయా మార్కెట్ యార్డులో హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కోనుగోలు కేంద్రానికి బుదవారం గుర్త తెలియని వ్యక్తులు విక్రయించడానికి తీసుకు వచ్చిన కందులను వ్యవసాయాధికారులు సీజ్ చేశారు. రెండు సంవత్సరాల క్రితం దాచిన నాసిరికం కందులను 120 బస్తాలు, 60 క్వింటాళ్లకు కందులను విక్రయించడానికి ప్రయ త్నించడంతో గమనించి హాకా అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కందులకు సంబంధించి వ్యక్తులు ఎవరు ముందుకు రాక పోవడంతో కందులను సీజ్ చేసినట్లు ఏడిఏ విజేందర్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయాదికారి విజయ్‌రెడ్డి, ఏఈవోలు సురేష్, రాకేష్, హాకా అధికారి సురేంద్రనాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉపసర్పంచ్ ఆత్మహత్యాయత్నం

మనతెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: కలెక్టరేట్‌లో ఉప సర్పంచ్ పురుగుల మందు తాగి ఆత్మ హత్యా యత్నానికి పాల్పడిన సంఘ టన బుధవారం నల్లగొండలో చోటు చేసు కుంది. జిల్లా పరి ధిలోని మాడ్గులపల్లి మండలం గోపాల పురం గ్రామ ఉప సర్పంచ్‌గా కొనసాగుతున్న యాదయ్య తన సాగుభూమిలోకి నీరు రానివ్వడం లేదని డి 37 సాగు నీటి కాల్వ వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ సైదులు అదే గ్రామానికి చెందిన నాగరాజు అనే రైతుతో మంగళవారం గొడవ పడటంతో అతను యాద య్యను చంపుతానని బెదిరించాడు. మన స్థాపానికి గురైన యా దయ్య ఉదయం కలెక్టరేట్‌కు చేరుకొని తనను వేధిం పు లకు గురిచేస్తున్నాడంటూ కలెక్టరేట్‌లో తన వెంట తెచ్చుకున్న పురుగుల మందుతాగి ఆత్మహత్య యత్నం చేశాడు. అ ప్రమత్తమైన కలెక్టరేట్ సిబ్బంది యాదయ్యను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డీఆర్వో ఖీమ్యా నాయక్, ఎఓ మోతీలాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యాదయ్యను పరామర్శించి ఆరోగ్యపరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకు న్నారు.

వైభవంగా యాదాద్రి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



మనతెలంగాణ/యాదాద్రి:తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రిలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవ రోజైన శుక్రవారం వటపత్రసాయి పొన్నవాహనసేవలో లక్ష్మి నరసింహుడు భక్తకోటికి దర్శనమిచ్చాడు. సాయంత్రం ఆలయంలో శ్రీవారిని పొన్నవాహన అలంకార సేవలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం నిర్వహించిన అలంకార సేవలను ఆలయ మండపంలో అధిష్టించి స్వామివారి సేవల విశిష్టతను ఆలయ అర్చకులు భక్తకోటికి తెలిపి మంగళారాధనను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో యజ్ఞాచార్యులు సముద్రాల శ్రీనివాసాచార్యులు, ప్రధాన అర్చకులు నల్లంధిగల్ లక్ష్మి నరసింహాచార్యులు, కారంపొడి నరసింహ్మాచార్యులు, కాడూరి వెంకటాచార్యులు, వేద పండితులు శ్రీనివాసశర్మ, కాడూరి వెంకటచార్యులు, సంపతాచార్యులు, అర్చకుల బృందం, అనువంశిక ధర్మకర్త నరసింహ్మామూర్తి, ఆలయ ఈవో గీత, సహాయ కార్య నిర్వహణ అధికారులు భాస్కర్‌శర్మ, చంద్రశేఖర్, రాంమోహన్, ఆలయ ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుండి ధార్మిక సభలు : శ్రీ వారి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేకతమైన ధార్మిక సాహిత్య సంగీత మహా సభలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. భక్తులను ఆధ్యాత్మికంగా అలరించేందుకు 22 నుండి 26వ తేదీ వరకు ఉదయం 6 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు సంగీత మహా సభలను కొనసాగానున్నాయి.



రైతు రుణమాఫీలో ప్రభుత్వం విఫలం

మన తెలంగాణ/కమలాపూర్ : లక్షల రూపాయల రైతు రుణమాఫీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని, ఒక్క టీచర్ పోస్టును డిఎస్సీతో భర్తీ చేయని అసమర్ధత ప్రభుత్వం టిఆర్ఎస్‌దని కాంగ్రెస్ మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆరోపించారు. బుధవారం కమలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీతో ఏ ఒక్క రైతు కూడా సంతోషంగా లేదని, పండించిన వరి ధాన్యం, పత్తి, మిర్చీ పంటలకు మద్దతు ధర, గిట్టుబాటు ధరలు రాక ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు స్వర్గం రవి, పరిపాటి రవీందర్ రెడ్డి,ప్యాట రమేష్, తుమ్మేటి సమ్మిరెడ్డి, జయ రామారాజు, మండలాధ్యక్షులు చెరపెల్లి రాంచందర్, నాయకులు పెండ్యాల తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

సొంతింటికి చేరుకున్న తొమ్మిది మంది కువైట్ బాధితులు



మన తెలంగాణ/శంషాబాద్: అక్రమంగా కువైట్‌లో ఇరుకుపోయిన వారిలో మొదటి విడతగా 9మంది బాధితులను మంగళవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఏడు సంవత్సరాల తర్వాత కువైట్ ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్ష పెట్టిందన్నారు. అయితే తిరిగి స్వదేశానికి రావడానికి డబ్బులు లేక అక్కడే ఉండిపోయామన్నారు. గత కొన్ని రోజుల క్రితం జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, నిజామాబాద్ ఎంపి తమ జాగృతి సంస్థ ద్వారా కువైట్‌లో చిక్కుకున్న వారికి ఉచితంగా విమాన టికెట్‌లను కొని ఇస్తామని ప్రకటించిందన్నారు.దీంతో మేము వారి సంస్థను సంప్రదించగా వారు అందించిన టికెట్‌లతో సొంతగడ్డపై కాలు పెట్టినట్లు తెలిపారు. వారి సహకారంతో మొదటి విడతగా 9మంది ఈ రోజు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్ వచ్చిన బాధి తులకు జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, జాగృతి యువత అధ్యక్షుడు కొరబోయిన విజయ్ తదితరులు స్వాగతం పలికారు. తాము స్వదేశానికి రావడానికి సహకరించిన ఎంపి కవితకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

14 వేల పోలీసుల కొత్త పోస్టులు

- **త్వరలో పోలీసులకు ఒక రోజు సెలవు ప్రకటన**



మన తెలంగాణ/జహీరాబాద్: రాష్ట్రంలో త్వరలో మరో 14వేల మంది కొత్త పోలీసులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పోలీసుల పనితీరు భేషుగ్గా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం మెదక్ జిల్లా జహీరాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు వచ్చిన నాయిని పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ పోలీసులకు ఇక నుంచి వారానికి ఒక రోజు సెలవు ప్రకటించనున్నట్లు హామీనిచ్చారు. జహీరాబాద్ పట్టణంలో త్వరలోనే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పట్టణంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలతో నేరాలు అదుపులో ఉన్నాయన్నారు. స్థానిక ఎంపి బిబి పాటిల్ మాట్లాడుతూ ప్రజలే ప్రభుత్వానికి యజమానులని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఎంఎల్‌సి యం.డి ఫరీదుద్దీన్, జిల్లా పరిషత్ చైర్మన్ రాజమణి మురళీధర్ యాదవ్, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విదేశీయులు వెళ్లాల్సిందే

- **వీసా గడువు ముగిసినా అక్రమంగా ఉండటంపై చర్యలు**




మనతెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో : వీసా గడువు ముగిసిన విదేశీయులపై చర్యలకు నగర పోలీసు యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ప్రధానంగా మాదక ద్రవ్యాల రవాణా, అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరుతున్న నేపథ్యంలో వీసాలు గడువు ముగిసిన వారిని వారివారి దేశాలకు తిరిగి పంపించాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. బుధవారం నగరంలోని పశ్చిమ మండలం డిసిపి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు హుమాయూన్‌నగర్, బంజారాహిల్స్, ఆసిఫ్‌నగర్, గోల్కొండ పోలీసు స్టేషన్‌ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా 55 మంది వీసా నియమనిబంధనలను అతిక్రమించినట్టు గుర్తించారు. 10 మంది నియమాలను అతిక్రమించినప్పటికీ తిరిగి పున: అనుమతి తీసుకోవడం ద్వారా వారిని నగరంలో కొనసాగించవచ్చని డిసిపి వెంకటేశ్వర్‌రావు వెల్లడించారు. టోలిచౌకిలోని ఓ విదేశీయుడి వద్ద సుమారు 10 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించినట్టు పోలీసు అధికారులు వివరిస్తున్నారు.

అహం బ్రహ్మాస్మి



విలక్షణ దర్శకుడు జాగర్లమూడి రాధాకృష్ణ అలియాస్ క్రిష్ గత ఏడాది 'గౌతమిపుత్ర శాతకర్ణి' చిత్రంతో మంచి బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకున్నాడు. ఈ చిత్రంతో తెలుగువారి చరిత్రను, ఘనతను ప్రపంచానికి చాటి చెప్పాడు. ఆయన ప్రస్తుతం బాలీవుడ్‌లో ఝాన్సీ లక్ష్మీ భాయి జీవితం ఆధారంగా కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో 'మణికర్ణిక' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఈ చిత్రం సెట్స్‌పైన ఉండగానే... క్రిష్ ఓ తెలుగు చిత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్‌ను మొదలుపెట్టడం విశేషం. సాయిబాబు జాగర్లమూడి, రాజీవ్ రెడ్డి సంయుక్తంగా నిర్మించనున్న ఈ భారీ బడ్జెట్ మూవీ కోసం 'అహం బ్రహ్మాస్మి' అనే టైటిల్‌ను కూడా రిజిస్టర్ చేయించారు. ఈ చిత్రంలో కథానాయకుడిగా ఒక స్టార్ హీరో నటించనున్నాడు. ప్రస్తుతం ఆ స్టార్ హీరోతో క్రిష్ చర్చలు జరుపుతున్నాడు. ఈ చిత్రం భారీ బడ్జెట్, అత్యాధునిక సాంకేతిక విలువలతో రూపొందనుంది. ఆగస్టులో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది. ఈ చిత్రం నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియనున్నాయి.



లవ్‌స్టోరీ కాదు థ్రిల్లర్

రామ్‌చరణ్ తాజాగా నటిస్తున్న 'రంగస్థలం' చిత్రం విడుదల కోసం ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రాన్ని సమ్‌థింగ్ స్పెషల్‌గా తీర్చిదిద్దుతున్నాడు దర్శకుడు సుకుమార్. ఇటీవల విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రంలో చరణ్ వినికిడి సమస్య ఉన్న వ్యక్తిగా నటిస్తున్నాడు. అయితే టీజర్ చూసిన ప్రేక్షకులు ఈ చిత్రం మంచి ఫీల్ ఉన్న లవ్ స్టోరీ అని అనుకుంటున్నారు. లవ్‌స్టోరీల మేకింగ్‌లో దర్శకుడు సుకుమార్ తనదైన ముద్రతో, ఎమోషన్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాడనే పేరుంది. దీంతో రామ్‌చరణ్ చిత్రం కూడా మంచి లవ్‌స్టోరీ అని అంటున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం మెయిన్ జోనర్ లవ్‌స్టోరీ కాదని... థ్రిల్లర్ అని తెలిసింది. చిత్ర కథ విషయానికొస్తే... రామ్‌చరణ్ సోదరుడు హత్యకు గురవుతాడు. హత్య చేసింది ఎవరో తెలుసుకోవడానికి చరణ్ తన శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తుంటాడు. అసలే వినికిడి సమస్య ఉన్న హీరో... కానీ హంతకుడి ఆచూకీ పట్టుకోవాలి. ఈ థ్రిల్లింగ్ అంశం చుట్టూ కథ నడుస్తుందట. చివరికి హీరో తన ప్రయత్నంలో ఎలా సక్సెస్ అయ్యాడనేదే ఈ సినిమా కథ అని తెలిసింది. ఆద్యంతం ఆసక్తికరంగా ఉండే ఈ చిత్రం ప్రేక్షకులను ఏమేరకు అలరిస్తుందో చూడాలి.



రానా




గుణశేఖర్

దగ్గుబాటి రానా సోలో హీరోగా ఇంకా పెద్ద మార్కెట్ సంపాదించుకోలేదు. గత ఏడాది అతను కథానాయకుడిగా నటించిన ఘాజీ, నేనే రాజు నేనే మంత్రి మంచి ఫలితాలను అందించి కమర్షియల్‌గా సక్సెస్‌ను సాధించాయి.

రూ.100 కోట్లకు పైగా బడ్జెట్!

అయితే ఈ రెండింటి మీద తక్కువ బడ్జెట్ పెట్టారు. 'ఘాజీ'ని మూడు భాషల్లో విడుదల చేయడం వల్ల మంచి లాభాలు వచ్చాయి. 'నేనే రాజు నేనే మంత్రి' పెట్టిన పెట్టుబడిని వెనక్కి తెచ్చింది. 'బాహుబలి' సినిమాతో దేశవ్యాప్తంగా మంచి పేరు సంపాదించినప్పటికీ సోలో హీరోగా రానా మీద 30 నుంచి40 కోట్ల బడ్జెట్ అన్నా కష్టమే అన్నట్లుంది పరిస్థితి. అలాంటిది సీనియర్ దర్శకుడు గుణశేఖర్.. రానా మీద రూ.100 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాలని చూస్తున్నట్లు తెలిసింది. 'రుద్రమదేవి' చిత్రం తర్వాత బాగా గ్యాప్ తీసుకున్న గుణశేఖర్... 'హిరణ్యకశిప' సినిమా తీయడానికి సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. తాను ఈ సినిమా చేయబోతున్నట్లు రానా కూడా ధృవీకరించాడు. 'రుద్రమదేవి' లాంటి లేడీ ఓరియెంటెడ్ మూవీ మీద రూ.70 కోట్ల దాకా పెట్టుబడి పెట్టి పెద్ద సాహసమే చేశాడు గుణశేఖర్. ఆ సినిమా చాలా వరకు పెట్టుబడిని వెనక్కి తెచ్చి ఆయనకు కష్టానికి మంచి ఫలితాన్నే అం దించింది. ఆ సినిమా ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో రానా మీద రూ. 100 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టడానికి సిద్ధమవుతున్నాడట ఈ విలక్షణ దర్శకుడు. ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక విలువలతో భారీగా తీర్చిదిద్దాలని...పలు భాషల్లో దీన్ని రిలీజ్ చేయడం ద్వారా పెట్టినపెట్టుబడిని రాబట్టుకోవాలని ప్రణాళికలు రచిస్తున్నాడట గుణశేఖర్. కానీ ఏం చేసినా రానా మీద అంత పెద్ద బడ్జెట్ పెడితే వర్కవుట్ అవుతుందా అన్నది సందేహమే.

మరోసారి 'టీజర్'తో మ్యాజిక్?



రెండేళ్ల కిందట సౌంతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమా 'కబాలి' టీజర్ సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మొదలుపెట్టినప్పుడు పెద్దగా అంచనాల్లేవు. కానీ ఒక్కసారి సినిమా టీజర్ రాగానే అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఆతర్వాత ట్రైలర్ కూడా రిలీజ్ చేయాల్సిన అవసరం లేకపోయింది. కానీ టీజర్ చూసి ఏదో ఊహించుకొని 'కబాలి'కి వెళ్తే అక్కడ సినిమా వేరేలా ఉంది. దీంతో ప్రేక్షకులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అయితే 'కబాలి' ఫలితం ఎలా ఉన్నప్పటికీ రజనీకాంత్ మళ్లీ రంజిత్‌తో సినిమా చేయడానికి అంగీకరించి ఆశ్చర్యపరిచాడు. వీళ్లిద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కిన కొత్త సినిమా 'కాలా' ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ఇంకో రెండు నెలల సమయం ఉన్న నేపథ్యంలో ఇక ప్రమోషన్ హడావిడి మొదలుపెట్టాలని చూస్తున్నాడు నిర్మాత ధనుష్. ముందుగా మార్చి 10న 'కాలా' టీజర్‌ను విడుదల చేయనున్నారట. కానీ ఈసారి కూడా టీజర్‌తో మ్యాజిక్ చేసి... సినిమా విషయంలో షాక్ ఇస్తారేమోనని అభిమానుల్లో కలవరం మొదలవుతోంది. 'కాలా' టీజర్ కూడా 'కబాలి'ల ఉండి ప్రేక్షకులను వెర్రెత్తించకపోతేనే మంచిదన్న అభిప్రాయం రజనీ అభిమానుల్లో వ్యక్తమవుతోంది. టీజర్ మీద కంటే సినిమా మీద ఎక్కువ ఫోకస్ పెట్టి జనరంజకంగా తీర్చిదిద్దితే మంచిదని అభిమానులు అంటున్నారు. మరి 'కాలా' టీజర్ ఎలా ఉంటుందో తెలియాలంటే మార్చి 10 వరకు ఆగాల్సిందే.

హంసకు లక్కీ ఆఫర్

కొంటెచూపుల సుందరాంగి హంసానందిని చిత్ర పరిశ్రమలో చాలా కాలంగానే ఉంది. ఆమె నటించిన సినిమాల్లో సూపర్ హిట్లు, అట్టర్ ఫ్లాపులు రెండూ ఉన్నాయి. తను నటించిన ప్రతి సినిమాలోనూ ఐటమ్‌సాంగ్‌లతో ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. కానీ ఈ అమ్మడికి ఇంతవరకు సరైన బ్రేక్ మాత్రం రావడం లేదు. ఈగ నుండి మిర్చి చిత్రం వరకు... అత్తారింటికి దారేది నుంచి జై లవ కుశ సినిమా వరకు ఆమె చేసిన సినిమాలన్నీ హిట్టే. కానీ మధ్యలో భాయ్, బెంగాల్ టైగర్, కిట్టుగాడు ఉన్నాడు జాగ్రత్త వంటి ఫెయిల్యూర్ సినిమాలు కూడా ఉన్నాయి. తాజాగా హంసానందినికి మంచి గుర్తింపు తెచ్చే పాత్ర ఒకటి వచ్చిందట. గోపీచంద్ హీరోగా కొత్త దర్శకుడు చక్రి తెరకెక్కించనున్న యాక్షన్ మూవీ 'పంతం'లో ఈ హాట్ బ్యూటీ ఓ కీలక పాత్ర చేయబోతోంది. ఇందులో ఐశ్వర్యంలో మునిగితేలే అమ్మాయిగా ఆమె కనిపించబోతోంది. ''ఈ సినిమాలో నా రోల్ గురించి విన్నప్పుడు ఎంతో కొత్తగా అనిపించింది. నాలుగు గోడల మధ్య నుంచి ఆరుబయటకు వచ్చి చల్లగాలి పీల్చిన విధంగా చాలా ఆనందపడిపోయాను. నన్ను నేను కొత్తగా చూసుకునే అవకాశం ఉన్న పాత్ర కావడంతో వెంటనే ఓకే చెప్పేశాను''అని హంసానందిని పేర్కొంది. ఇప్పటివరకు ఐటమ్ బాంబుగా పేరుతెచ్చుకున్న ఈ భామ ఈ చిత్రంతో నటిగా కూడా పేరుతెచ్చుకుంటానంటోంది. ఈ చిత్రంపై హంసానందినికే కాదు హీరో గోపీచంద్‌కు కూడా ఎన్నో ఆశలున్నాయి. చాలా రోజులుగా కమర్షియల్ హిట్ లేక నిరాశలో ఉన్న అతను ఈ చిత్రంతో మంచి హిట్ కొట్టాలని ఆశిస్తున్నాడు.





గంటలకొద్దీ మేకప్!

అందం, అభినయం కలగలిసిన భామలే స్టార్ హీరోయిన్‌లు గుర్తింపు తెచ్చుకుంటారు. అలాగే అందాల భామలకు క్రమశిక్షణ కూడా చాలా ముఖ్యమే. అందులో ఏమాత్రం తేడా వచ్చిన అవకాశాలతో పాటు ఇమేజ్ కూడా దెబ్బతినే అవకాశం ఉంది. క్రమశిక్షణ లేకపోవడంతో కొందరు హీరోయిన్‌లు తమ కెరీర్‌ను నాశనం చేసుకున్నారు. ఈమధ్య యంగ్ బ్యూటీ కీర్తిసురేష్ క్రమశిక్షణ తప్పుతోందని తెలిసింది. సమయానికి షూటింగ్‌కు వచ్చినప్పటికీ ఎక్కువగా ఆమె క్యారీవ్యాన్‌లోనే గడుపుతోందట. ప్రస్తుతం తెలుగు, తమిళ్‌లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తున్న ఈ భామ ఈమధ్య తన ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తిస్తోందని తెలిసింది. షూటింగ్ స్పాట్‌కు ఉదయం 9 గంటల కంటే ముందే వచ్చే కీర్తిసురేష్ క్యారీ వ్యాన్‌లోనే ఎక్కువ సమయం గడుపుతోందట. ఆమె 11 గంటల సమయంలో కెమెరా ముందుకు వస్తోందట. అంతసేపు ఆమె క్యారీవ్యాన్‌లో ఉండటానికి కారణం హెవీ మేకప్ అని తెలిసింది. చిన్న షాట్‌కు కూడా కీర్తి ఎక్కువగా మేకప్ చేసుకొని దర్శకనిర్మాతలకు కోపాన్ని తెప్పిస్తోందట. గత కొన్ని నెలలుగా ఇదే విధంగా వ్యవహరిస్తుండడంతో ఈ భామ ఇమేజ్ దెబ్బతింటోంది.

వినోదంతో పాటు సందేశం

సాత్విక్ ఈశ్వర్‌ని హీరోగా పరిచయం చేస్తూ సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నం.1 చిత్రంగా 'సత్యగ్యాంగ్' రూపుదిద్దుకుంటోంది. కర్నూల్‌కు చెందిన వ్యాపారవేత్త మహేష్ ఖన్నా నిర్మిస్తున్న చిత్రమిది. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు సంగీతాన్ని సమకూర్చాడు ప్రభాస్. పుష్కలమైన వినోదానికి కాస్తంత సందేశాన్ని జోడించిన తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఆడియో వేడుక కర్నూల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సాత్విక్ ఈశ్వర్, అక్షిత, మహేష్ ఖన్నా, ప్రభాస్, అడుసుమిల్లి విజయ్ కుమార్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేష్ ఖన్నా మాట్లాడుతూ ''సమాజంలో అనాథలనేవారు ఉండకూడదనే సందేశానికి వినోదాన్ని మేళవించి తీస్తున్న చిత్రం 'సత్యగ్యాంగ్'. హీరోగా పరిచయమవుతున్న సాత్విక్ ఈశ్వర్‌కు మంచి భవిష్యత్ ఉంది. ఇటీవల విడుదలైన పాటలకు మంచి స్పందన వస్తోంది. మా దర్శకుడు ప్రభాస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా కూడా మంచి మార్కులు స్కోర్ చేశాడు. మార్చి 15న సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం''అని అన్నారు. దర్శకుడు ప్రభాస్ మాట్లాడుతూ ''ఈ సినిమా బాగా వచ్చింది. పాటలకు మంచి సంగీతం కుదిరింది. నిర్మాత ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు''అని చెప్పారు. 'సత్యగ్యాంగ్' వంటి ఓ మంచి సినిమాతో హీరోగా పరిచయమవుతుండడం గర్వంగా ఉందని హీరో సాత్విక్ ఈశ్వర్ అన్నారు. ఈ చిత్రం హీరోయిన్‌గా తనకు మంచి పేరును తీసుకువస్తుందని హీరోయిన్ అక్షిత పేర్కొన్నారు.



ఆ స్టార్ ప్రశంస ఎంతో ఆనందాన్నిచ్చింది

రంజిత్, పాలక్ లల్వానీ జంటగా త్రికోటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జువ్వ'. ఎస్.వి.రమణ సమర్పణలో సొమ్మి ఫిలింస్ పతాకంపై డా.భరత్ సోమి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా హీరో రంజిత్‌తో ఇంటర్వ్యూ విశేషాలు.

- **రెండో సినిమా ఇది...**
మా స్వస్థలం వైజాగ్. హీరోగా నా మొదటి చిత్రం 'నువ్వు నేను ఒకటవుదాం'. 'జువ్వ' నా రెండో సినిమా. సొంత నిర్మాణంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంది.

- **చాలా ప్రయత్నించాను...**
చిన్నప్పటి నుంచి నాకు సినిమాలంటే చాలా ఇష్టం. నన్ను నేను హీరోగా చూసుకోవాలనేది నా కోరిక. చాలా కాలం హీరోగా చేయడానికి ఒక్కడినే ప్రయత్నించాను కూడా.

- **పూర్తి వినోదంతో...**
'జువ్వ' అవుట్‌పుట్ చూశాను. చాలా బాగా వచ్చింది. ఇదొక అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్. ఇందులో రొమాన్స్, యాక్షన్, మంచి పాటలతో పాటు పూర్తి వినోదం ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది.

- **అనవసరంగా ఖర్చు పెట్ట-లేదు...**
ఈ స్క్రిప్ట్ ఓకే చేశాక ముందుగా ఒక బడ్జెట్ అనుకున్నాం. కానీ షూటింగ్ సమయానికి అది కాస్త ఎక్కువైంది. అయితే అనవసరంగా ఎక్కడా ఖర్చు పెట్టలేదు. పెట్టిన బడ్జెట్‌కు తగ్గట్టే సినిమా అవుట్‌పుట్ వచ్చింది.

- **చాలా విషయాలు నేర్చుకున్నా...**
దర్శకుడు త్రికోటికి ఇది రెండవ సినిమా. ఆయన మొదటి చిత్రం 'దిక్కులు చూడకు రామయ్య' మంచి విజయాన్ని అందుకుంది. ఆ తరహాలోనే ఈ సినిమా కూడా వినోదాత్మకంగా ఉంటుంది. త్రికోటికి మంచి టాలెంట్ ఉంది. షూటింగ్ సమయంలో ఆయన వద్ద నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను.

- **జాలీగా, సరదాగా..**
సినిమాలో నా పేరు రానా. ఎప్పుడూ జాలీగా, సరదాగా ఉండే కుర్రాడిగా కనిపిస్తా. కుర్రాడి పాత్ర, ఫైట్స్, రొమాన్స్, ఫన్ అంతా జాలీగానే ఉంటుంది.

- **సంగీతం గొప్పగా ఉంది...**
కీరవాణిలాంటి పెద్ద సంగీత దర్శకుడు నా సినిమాకు మ్యూజిక్‌ను అందించడం చాలా సంతోషంగా ఉంది. ఆయనిచ్చిన సంగీతం చాలా గొప్పగా ఉంది. రీ రికార్డింగ్ అయితే సినిమాకే హైలైట్‌గా ఉంటుంది.

- **అడగగానే ఒప్పుకున్నారు..**
మెగాస్టార్ చిరంజీవిని అడగగానే ఒప్పుకొని సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఆయన ఈ టీజర్ చూసి నాది ఫొటోజెనిక్ ఫేస్ అని మెచ్చుకున్నారు. ఈ ప్రశంస నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది.

- **అన్నీ సమకూర్చారు...**
మా అన్నయ్య డా.భరత్ ఈ సినిమాను చాలా ఇష్టపడి నిర్మించారు. ఎక్కడా రాజీపడకుండా అన్నీ సమకూర్చారు. సినిమా ఇంత గొప్పగా రావడానికి ఆయనే ప్రధాన కారణం.

- **ఆ సినిమాలు చేయాలనుంది.**
స్పోర్ట్స్ డ్రామా మూవీలలో నటించాలనే కోరిక ఉంది. అలాగే ఫ్రెష్ లవ్ స్టోరీలన్నా ఇష్టమే. హీరోగా ప్రేక్షకులకు పూర్తి వినోదాన్ని అందించాలని కోరుకుంటాను.



రంజిత్

పెళ్లికి సిద్ధమవుతోంది

స్టార్ హీరోయిన్ శృతిహాసన్ కెరీర్ ఒకప్పుడు బాగానే నడిచింది. హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేసి ప్రేక్షకులను అలరించింది. కొన్నాళ్లుగా మాత్రం పరిస్థితి మారిపోయింది. శృతి ఇప్పుడు ఖాళీగా ఉంది. చేతిలో సినిమాలేవీ లేవు. అందుకే జీవితంలో స్థిరపడాలని నిర్ణయించుకుందట ఈ భామ. ఈ ఏడాదే ఆమె పెళ్లి చేసుకుంటుందని టాక్. ఇక సినీ కెరీర్ విషయానికొస్తే... శృతిహాసన్ బాలీవుడ్‌లో అడుగుపెట్టాక అక్కడ అన్నీ వరుస ఫ్లాపులే పలకరించాయి. అయితే 'గబ్బర్‌సింగ్' ఘన విజయంతో తెలుగులో కొన్నాళ్ల పాటు హీరోయిన్‌గా దూసుకుపోయింది. కొత్త హీరోయిన్లు రావడంతో శృతికి అవకాశాలు తగ్గిపోయాయి. తమిళంలో ఆమెకు పెద్దగా క్రేజ్ లేదు. దీంతో ఏడాదిగా ఆమెకు చెప్పుకోదగ్గ స్థాయిలో సినిమాలు లేవు. కానీ తన బాయ్‌ఫ్రెండ్‌తో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతూ ఎంజాయ్ చేస్తోంది శృతి హాసన్. లండన్‌కు చెందిన మైఖేల్ కోర్సెల్‌తో ఈ భామ ప్రేమాయణాన్ని కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. మైఖేల్ లండన్‌లో థియేటర్ ఆర్టిస్టు. తన తల్లిదండ్రులకు అతన్ని పరిచయం చేసింది శృతిహాసన్. కమల్‌హాసన్ వీరి పెళ్లికి ఒప్పుకున్నట్టు సమాచారం. సారిక కూడా కూతురి కోరికను కాదనలేకపోయిందట. దీంతో వీరి ప్రేమకు గ్రీన్ సిగ్నల్ పడినట్టే. ఎలాగూ చేతిలో సినిమాలు లేవు కాబట్టి ఈ ఏడాదే పెళ్లి చేసుకోవడానికి శృతి సిద్ధపడుతోందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో వీరి పెళ్లి జరుగనున్నట్టు సమాచారం. శృతి ప్రస్తుతం ముంబయ్‌లో ఉండగా... మైఖేల్ వర్క్‌పర్మిట్ వీసాతో లండన్ నుండి ఇండియాకు వచ్చిపోతున్నాడు.





ద్రవ్యోల్బణం పెరుగుదలపై ఆర్‌బిఐ ప్యానెల్ ఆందోళన

ముంబై : ద్రవ్యోల్బణం పెరగడంపై ఆర్‌బిఐ ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈనెల 6–7 తేదీలలో నిర్వహించిన ద్రవ్యపరపతి విధాన సమీక్ష మినిట్స్‌ను బుధవారం విడుదల చేశారు. ఆర్థిక వ్యవస్థ బలోపేతం విషయంలో అనిశ్చితి నెలకొంటోందని ఆర్‌బిఐ కమిటీ పేర్కొంది. ఎంపిసి(ద్రవ్య విధాన కమిటీ) సమావేశంలో పాలసీ రేటు 6 శాతం యథాతథంగా కొనసాగించింది. సభ్యుల్లో ఆర్‌బిఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖెల్ పాత్రా ఒక్కరు మాత్రమే 25 బేసిస్ పాయింట్లు వడ్డీ రేటును పెంచాలని ఓటు వేశారు. ద్రవ్యోల్బణం గురించి ఆరుగురు ఎంపిసి సభ్యులు ఆందోళన వ్యక్తం చేసినట్టు మినిట్స్‌లో పేర్కొన్నారు. డిసెంబర్‌లో 5.21 శాతంతో 17 నెలల గరిష్ఠంలో ఉందని, ఈ సంవత్సరంలోనూ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఆహార పదార్థాలు, ఇంధన ధరలు పెరుగుదల ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వెల్లడించారు. అయితే జనవరిలో ద్రవ్యోల్బణం కొంత మేరకు తగ్గి 5.07 శాతంగా నమోదు అయింది. అయితే ఆర్‌బిఐ లక్ష్యం 4 శాతం పైనే ఉండడం గమనార్హం. ద్రవ్యోల్బణం ఆందోళన ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఎంపిసి సభ్యులు చెబుతున్నారు.

యుపికి పెట్టుబడుల వరద

- రూ.4లక్షల కోట్లకు పైగా ఇన్వెస్ట్‌మెంట్స్
- ఇన్వెస్టర్ల సదస్సులో అదానీ, బిర్లా, అంబానీ హామీ

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఇన్వెస్టర్ల సదస్సు తొలి రోజు రూ.4.28 ట్రిలియన్ల(4లక్షల 28వేల కోట్లు) విలువచేసే 1,045 ఒప్పందాలు జరిగాయి. ఈమేరకు వ్యాపార దిగ్గజాలు హామీ ఇచ్చారని యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ ఒప్పందాల విలువ 2018–19 వార్షి క బడ్జెట్‌కు సమానంగా ఉంటుందని అన్నారు. తాను ప్రతి ప్రాజెక్ట్‌ను పర్యవేక్షిస్తానని, అమలు ప్రక్రియ జరిగేలా ప్రయత్నిస్తానని అన్నారు. వచ్చే ఐదేళ్లకు గాను అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ గౌతమ్ అదానీ నుంచి 350 బిలియన్ల ఒప్పందం జరిగిందని సిఎం తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లో రూ.20వేల కోట్లను పెట్టుబడులుగా పెట్టిన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్, మరో రూ.10వేల కోట్లను వచ్చే మూడేళ్లలో పెట్టుబడులుగా పెట్టనున్నట్టు ప్రకటించింది. రాష్ట్రంలో డిజిటల్ సదుపాయాలను అభివృద్ధి చేయడానికి ఈ పెట్టుబడులను ఉపయోగించనున్నట్టు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, చైర్మన్ ముఖేష్ అంబానీ తెలిపారు. ఈ పెట్టుబడులతో జియో ఇక్కడ వచ్చే కొన్నేళ్లలో దాదాపు లక్ష ఉద్యోగ అవకాశాలను సృష్టించనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా, మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా కూడా యుపిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టనున్నట్టు హామీ ఇచ్చారు.






బుధవారంనాడు ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో యుపి ఇన్వెస్టర్స్ సమ్మిట్–2018ను ప్రారంభిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

అతిపెద్ద గడియారంతో అమెజాన్ సిఇఒ బెజోస్





న్యూయార్క్: ప్రపంచ ధనికుల్లో ఒకరైన అమెజాన్ సిఇఒ జెఫ్‌బెజోస్ ఓ భారీ గడియారాన్ని తయారు చేయిస్తున్నారు. అయితే ఈ గడియారానికి పెట్టే ఖర్చు తెలిస్తే ముక్కున వేలు వేసుకోవాల్సిందే.. 42 మిలియన్ డాలర్లు అంటే రూ.272 కోట్లు అన్నమాట.. ఇంత భారీగా ఖర్చు చేస్తున్న 10 వేల ఏళ్ల గడియారం ఎత్తు 500 ఎడుగులు ఉంటుందని ట్విటర్ ద్వారా వెల్లడించారు. ఈ గడియారం పది వేల ఏళ్ల పాటు నిర్విరామంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. గడియారం తయారుచేస్తున్న వీడియోను ఆయన ట్వీటర్‌లో పోస్ట్ చేశారు.

నేడు రెడ్‌మీ నోట్ 5 ఫోన్ల సేల్



న్యూఢిల్లీ: ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న రెడ్ మీ నోట్ 5, నోట్ 5 ప్రో అమ్మకాలు నేడు(గురువారం) ప్రారంభం కానున్నాయి. ఈ ఫోన్లను ఫ్లిప్ కార్ట్. కామ్, ఎంఐ.కామ్‌లో ఫ్లాష్ సేల్ కింద విక్రయించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు సేల్ షురూ అవుతుంది. ఈ నెల 14న ఈ మోడళ్లను షియోమి ఆవిష్కరించిన తర్వాత విక్రయాలు ప్రారంభించడం ఇదే మొదటిసారి.. రిలయన్స్ జియోతో ఒప్పందం చేసుకున్న ఈ సంస్థ రూ.2,200 వరకు విలువైన వోచర్లను అందించనున్నట్టు ఇప్పటికే ప్రకటించింది.


స్టాక్ మార్కెట్


ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33844.86	141.27	0.42%
నిఫ్టీ	10397.45	37.05	0.36%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29110	31133.69	–0.55%
ముంబై	30100	32192.51	–0.36%
ఢిల్లీ	29850	31925.13	–0.5%
కోల్‌కతా	30350	32459.89	0%
కేరళ	28200	30160.43	–0.7%
బెంగళూరు	28700	30695.19	–0.52%
హైదరాబాద్	29110	31133.69	–0.38%
గల్ఫ్	1411.85	1510.00	–1.47%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	మంగళవారం	సోమవారం	మార్పు (%)
చెన్నై	41200.00	41400.00	–0.48
ముంబై	41200.00	41400.00	–0.48
ఢిల్లీ	41200.00	41400.00	–0.48
కోల్‌కతా	41200.00	41400.00	–0.48
హైదరాబాద్	41200.00	41400.00	–0.48



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	375
వరంగల్	367	చిత్తూరు	408
విజయవాడ	375	చెన్నై	415
గోదావరి	375	బెంగళూరు	405

ఇపిఎఫ్ఒ వడ్డీ రేటు 8.55 శాతానికి తగ్గింపు



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2017–18) గాను రిటైర్మెంట్ ఫండ్ సంస్థ ఇపిఎఫ్ఒ వడ్డీ రేటును 8.55 శాతానికి తగ్గించింది. పిఎఫ్ వడ్డీ రేటును తగ్గించడం ఇది వరుసగా మూడోసారి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2016–17)లో ఈ వడ్డీ రేటు 8.65 శాతం ఉంది. ఇపిఎఫ్ఒ(ఉద్యోగ భవిష్య నిధి సంస్థ)లో ఆరు కోట్ల మందికి పైగా ఉద్యోగులకు పైగా కలిగివున్నారు. ఇపిఎఫ్ఒ ట్రస్టీ సమావేశమై 8.55 శాతంగా వడ్డీ రేటును నిర్ణయించింది. సమావేశం ముగిసిన తర్వాత కేంద్ర కార్మిక శాఖా మంత్రి సంతోష్ గాంగ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా భవిష్యత్తును నిర్ణయించడం కష్టమని, గతేడాది 8.65 శాతం వడ్డీ చెల్లించామని, దీంతో రూ.695 కోట్లు మిగిలిందని అన్నారు. 2017–18కి గాను 8.55 శాతంగా వడ్డీ రేటు నిర్ణయించామని, దీంతో రూ.586 కోట్లు మిగలనుందన్నారు. నిర్ణయించిన 8.55 వడ్డీ రేటు ప్రతిపాదనను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు పంపనున్నామని, ఆమోదం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనుమతి లభిస్తే వడ్డీ రేటు అమల్లోకి వస్తుందని వెల్లడించారు. అలాగే కార్మిక సంఘాలు కూడా అంగీకరిస్తాయని ఆశిస్తున్నామని అన్నారు. ఇపిఎఫ్ఒ వడ్డీ చెల్లించేందుకు ఇటిఎఫ్‌లను విక్రయించనుందని తెలిపారు. బాండ్లలో పెట్టుబడుల ద్వారా 8 శాతం రాబడి వచ్చిందని అయితే 8.55 శాతం వడ్డీ చెల్లించేందుకు ఇటిఎఫ్‌లలో కొన్ని పెట్టుబడులు విక్రయించినట్టు వెల్లడించారు.

మూడు రోజుల నష్టాలకు బ్రేక్



ముంబై : వరుసగా మూడు రోజుల స్టాక్‌మార్కెట్ నష్టాలకు బుధవారం బ్రేక్ పడింది. ఆసియా మార్కెట్లు సానుకూలంగా ఉండడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టారు. దేశీయంగా ఐటి, బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసిజి, ఆయిల్, గ్యాస్ వంటి కౌంటర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సూచీలు లాభాలను నమోదు చేశాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 141 పాయింట్లు లాభపడి 33845 పాయింట్లు వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 37 పాయింట్లు లాభపడి 10,397 వద్ద స్థిరపడింది. గురువారం డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు పూర్తి కానున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించారు. దీంతో సూచీలు నిలకడగా ట్రేడ్ అవగా, ఇంట్రాడేలో సెన్సెక్స్ 33,702 నుంచి 33,911 మధ్య శ్రేణిలో కదలాడింది. కీలకమైన బ్యాంక్ నిఫ్టీ 25 పాయింట్లు లాభపడి 24,936.70 పాయింట్ల వద్ద ముగిసింది. రంగాలవారీగా చూస్తే ఫార్మా, మెటల్ రియల్టీ, ఆటో రంగాలకు చెందినషేర్లు నష్టాలతో ముగిశాయి. నాస్కామ్ అంచనాలతో జోష్‌తో ఐటి సూచీ 2శాతం లాభపడింది. అలాగే పియుసి బ్యాంక్ సెక్టార్, ఎఫ్‌ఎమ్‌సిజి, మీడియా, ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీస్‌లకు చెందిన షేర్లు లాభాలతో ముగిశాయి. ఐషర్‌మోటర్స్, ఐటిసి, టిసిఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్ షేర్లు 2 నుంచి 4 శాతం లాభపడ్డాయి. టాటామోటర్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, హిందాల్కో, సన్‌ఫార్మా షేర్లు నష్టపోయాయి.

ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) మంగళవారం నగదు విభాగంలో రూ. 850 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. అయితే దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ. 1437 కోట్లను ఇన్వెస్ట్ చేయడం విశేషం. సోమవారం ఎఫ్‌పిఐలు రూ. 896 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా, దేశీ ఫండ్స్ రూ. 586 కోట్లకుపైగా విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి.

5వేల మంది ఉద్యోగులకు ఎయిర్‌సెల్ హెచ్చరికలు



ముంబై: రిలయన్స్ జియో టెలికామ్ రంగంలోకి ప్రవేశించిన తర్వాత ప్రత్యర్థి సంస్థలు నానా అవస్థలు పడుతున్నాయి. ఇప్పటికే రుణ భారంతో కొట్టుమిట్టాడుతున్న ఎయిర్‌సెల్‌లో ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 5000 మందికి పైగా ఉద్యోగులను ఈ కంపెనీ హెచ్చరించింది. తీవ్ర పోటీకర వాతావరణంలో నిధులు సమకూరడం క్లిష్టతరంగా మారిందని, ఈ క్రమంలో ఉద్యోగులు ప్రమాదకర పరిస్థితుల్లో పడనున్నారని కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం వ్యాపార కార్యకలాపాల నుంచే నిధులు రాబడుతున్నామని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కైజాద్ హేర్జీ తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న పోటీ వాతావరణం సంస్థను తీవ్రంగా దెబ్బతీసిందని, లాభాలు అన్నీ కొట్టుకుపోతున్నాయని అన్నారు. వచ్చే రోజుల్లో మరింత క్లిష్టతరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాబోతున్న క్లిష్టకర పరిస్థితుల్లో కంపెనీ పరిస్థితిని పునర్ పరిశీలించేందుకు బోర్డు సమావేశం కానుంది. పలువురు డైరెక్టర్లు కంపెనీ నుంచి వైదొలగడంతో, వారి స్థానంలో కంపెనీ బోర్డు సందీప్ వాట్స్, ప్రకాశ్ మిశ్రా, లక్ష్మి సుబ్రహ్మణ్యంను నియమించింది. వాటాదారులతో బోర్డు చర్చలు జరుపుతోంది. సుమారు రూ. 15,500 కోట్ల రుణాలు పేరుకుపోవడంతో కంపెనీ త్వరలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ముందు దివాలా పిటిషన్ దాఖలు చేయనున్నట్టు నివేదికలు వస్తున్నాయి.

రేటింగ్ పెంపుతో మారుతీ సుజుకీలో జోష్



న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ మరింత జోష్‌ను అందుకుంది. గ్లోబల్ రీసెర్చ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ మారుతి సుజుకీ షేరుపై 'అవుట్ పెర్‌ఫార్మ్' రేటింగ్‌ను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. దీనితో పాటు షేరు ప్రస్తుత కొనుగోలు ధర నుంచి రూ.10,563లకు పెంచుతున్నట్లు తెలిపింది. పలు అంశాలు కంపెనీకి సానుకూలంగా మారాయి. యెన్ మారకం విలువ, షేరు ఎర్నింగ్ పర్ షేరు విలువ, ఎలక్ట్రిక్ వాహనాలపై నీతి అయోగ్ ప్రకటన మారుతీ షేరుకు బలాన్ని ఇచ్చింది. అలాగే ఎర్నింగ్ పర్ షేర్ 2020 నాటికి నుంచి 8 శాతం చేరవచ్చని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. ఈ అంశాలకు తోడు గతవారంలో ఎలక్ట్రిక్ వాహన తయారీ గురించి నీతి అయోగ్ సిఇఒ అమిత్‌కాంత్ వాఖ్యలు చేశారు. మోర్గాన్ స్టాన్లీ రేటింగ్ పెంపుతో మారుతీ షేరు బుధవారం ట్రేడింగ్‌లో 1శాతం ర్యాలీ రూ.8793.80ను తాకింది. మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు విలువ 0.65 శాతం పెరిగి రూ.8,779కు చేరింది.

టాటా గ్రూప్ ఎలా మారింది?

చంద్రశేఖరన్ హయాంలో 180 శాతం వరకు లాభపడిన కంపెనీల షేర్లు



న్యూఢిల్లీ: ఎన్.చంద్రశేఖరన్ టాటా సన్స్ లిమిటెడ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి బుధవారం నాటికి ఏడాది పూర్తి అయింది. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు బహుళ రంగాల సంస్థలను కల్గివున్న టాటా సన్స్‌ను వృద్ధి పథాన నడిపించడంలో ఆయన సఫలం అయ్యారు. 2017 ఫిబ్రవరి 21న టాటా గ్రూప్ చైర్మన్‌గా చంద్రశేఖరన్ నియమితులు అయ్యారు. ఏడాది పూర్తి చేసుకున్న సమయంలో టాటా గ్రూప్‌నకు చెందిన టాప్ 10 స్టాక్స్ 180 శాతం వరకూ లాభాలను నమోదు చేశాయి. టాటా స్టీల్, వోల్టాస్, టాటా స్పాంజ్, టాటా గ్లోబల్ బెవరేజెస్, ఓరియెంటల్ హోటల్స్, టైటాన్ కంపెనీ షేర్లు 40 నుంచి 100 శాతం మధ్య లాభాలను గడించాయి. టాటా గ్రూప్ చైర్మన్ బాధ్యతలను చేపట్టేందుకు ముందు చంద్రశేఖరన్ టిసిఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్)కు సిఇఒగా బాధ్యతలు నిర్వహించారు. రూ. 5.6 లక్షల కోట్ల మార్కెట్ విలువతో టిసిఎస్ సంస్థ దేశంలోనే రెండో అతి పెద్ద కంపెనీగా ఉంది. టాటా స్టీల్, టాటా మోటార్స్, టాటా పవర్, ఇండియన్ హోటల్స్, టాటా పవర్, ఇండియన్ హోటల్స్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వంటి కంపెనీల బోర్డులలో 2009–17 మధ్య ఆయన బాధ్యతలు నిర్వహించారు. టాటా గ్రూప్‌నకు చెందిన కంపెనీలలో.. టాటా సన్స్ వాటా వైవిధ్య భరితంగా ఉంటుంది. టిసిఎస్‌లో 74శాతం వాటా టాటా సన్స్‌కు చెందగా.. టైటాన్‌లో 21శాతం మాత్రమే ఉంటుంది.

టాటా గ్రూప్ కథాకమామిషు...

- 2016 అక్టోబర్ 24న సైరస్ మిస్త్రీని టాటా సన్స్ చైర్మన్ పదవి నుంచి తొలగించారు.
- 2017 ఫిబ్రవరి 21న 100 బిలియన్ డాలర్ల టాటా గ్రూప్‌నకు చైర్మన్‌గా చంద్రశేఖరన్ బాధ్యతలు చేపట్టారు.
- 2017 ఫిబ్రవరి 28న టాటా డొకొమొ వివాదంలో పరిహారం చెల్లించే విషయమై టాటా సన్స్, ఎన్‌టిటి డొకొమొ మధ్య పరిష్కార ఒప్పందం జరిగింది. ఈమేరకు ఢిల్లి హైకోర్టు ఇరు సంస్థలు చెప్పాయి.
- 2017 సెప్టెంబర్ 20న టాటా స్టీల్, జర్మనీ స్టీలు తయారీ సంస్థ థిస్సెక్రుప్ ఎజిలు యురోపియన్ స్టీల్ సేవల విలీనానికి అంగీకరించాయి. దీంతో ఖండంలో రెండో అతిపెద్ద స్టీలు పరిశ్రమగా అవతరించింది.
- 2017 అక్టోబర్ 12న టాటా సన్స్ తనకు చెందిన మొబైల్ సేవలను భారతీ ఎయిర్‌టెల్‌కు విక్రయించింది.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
హెచ్‌సిఎల్ టెక్	947.80	912.00	942.90	907.45	35.45	3.91
టెక్ మహీంద్ర	598.00	566.55	595.20	574.20	21.00	3.66
టిసిఎస్	3,062.60	2,960.05	3,042.30	2,944.75	97.55	3.31
ఐటిసి	268.95	263.45	268.20	263.25	4.95	1.88
ఒఎన్‌జిసి	190.80	184.70	190.15	187.00	3.15	1.68
ఐచర్ మోటార్స్	27,480.00	27,043.60	27,365.75	26,916.40	449.35	1.67
హెచ్‌పిసిఎల్	388.00	376.70	386.90	380.85	6.05	1.59
ఎస్‌బిఐ	274.10	267.40	273.30	269.65	3.65	1.35
భారతి ఇన్‌ఫ్రాటెల్	339.50	332.50	338.05	334.00	4.05	1.21
ఎస్ బ్యాంకు	313.90	304.50	312.35	308.70	3.65	1.18

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
సన్‌ఫార్మా	563.00	511.30	525.75	559.50	33.75	6.03
హిందాల్కో	250.80	238.75	240.65	248.80	8.15	3.28
బజాజ్ ఫైనాన్స్	1,658.00	1,587.30	1,596.45	1,638.75	42.30	2.58
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,636.00	1,590.00	1,594.25	1,622.70	28.45	1.75
టాటాస్టీల్	655.55	633.00	640.95	651.30	10.35	1.59
టాటామోటార్స్	372.50	362.85	364.45	369.30	4.85	1.31
బోష్	19,494.60	19,100.05	19,160.05	19,398.05	238.00	1.23
బజాజ్ ఆటో	3,081.55	3,003.10	3,012.60	3,049.85	37.25	1.22
బిపిసిఎల్	458.15	440.10	447.55	453.05	5.50	1.21
ఎన్‌టిపిసి	165.00	161.50	162.30	164.20	1.90	1.16

రూ. 20వేల కోట్లతో బుందేల్‌ఖండ్‌లో రక్షణ పారిశ్రామిక కారిడార్



లక్నో : బుందేల్‌ఖండ్‌కు రక్షణ పారిశ్రామిక కారిడార్‌ను మంజూరు చేస్తున్నట్టు ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. లక్నోలో బుధవారం యుపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పెట్టుబడుల సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడారు. బుందేల్‌ఖండ్‌లో రక్షణ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు కోసం రూ.20వేల కోట్లు మంజూరు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. యుపిలో బిజెపి అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని మోడీ పేర్కొన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న యుపి ముఖ చిత్రం మారిందని ఆయన చెప్పారు. స్వయం ఉపాధి కోసం కేంద్రం ఇప్పటివరకు నాలుగు లక్షల కోట్ల ముద్ర రుణాలను అందించిందని ఆయన స్పష్టం చేశారు. యుపిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని ఆయన చెప్పారు. శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అదే విధంగా ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగిపై మోడీ ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడంలో ఆయన ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. ఇదే పంథాను కొనసాగించాలని సూచించారు.



మానస సరోవర్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

న్యూఢిల్లీ: ఈ ఏడాది నథులా కనుమ గుండా కైలాష్ మానససరోవర్ యాత్ర చేయాలనుకుంటున్న యాత్రికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విదేశాంగ శాఖ బుధవారం ప్రకటించింది. ఈ ఏడాది రెండు మార్గాల ద్వారా ఈ మానససరోవర్ యాత్ర ఉండగలదని తెలిపింది. ఒకటి లిపులేఖ్ కనుమ(ఉత్తర్‌ఖండ్), రెండోది నథులా కనుమ(సిక్కిం) గుండా వెళ్లేవిగా రెండు మార్గాలు ఉంటాయి. ఉత్తర్‌ఖండ్ మార్గం గుండా వెళ్లే వారు రూ. 1.6 లక్షలు, సిక్కిం గుండా వెళ్లే వారు రూ. 2 లక్షలు యాత్ర ఖర్చు కింద కట్టాల్సి ఉంటుంది. వయోవృద్ధులకు, మోటారు సౌకర్యం ఉన్న కూడా ఉన్న దారి నథులా కనుమ. ఢిల్లీలో మూడు రోజుల సన్నాహకం సహా 21 రోజుల ప్రయాణం ఉంటుంది. నాలుగు నెలల మానససరోవర యాత్ర జూన్ 8 నుంచి ప్రారంభమవుతుంది. ఇందుకు దరఖాస్తుల నమోదు ప్రక్రియను చేపట్టినట్లు విదేశాంగ శాఖ తెలిపింది.

అదుపులో ఇజ్రాయెల్ దేశస్తులు

జైసల్మీర్ : రాజస్థాన్ జైసల్మీర్ జిల్లాలోని ఓ నిషేధిత ప్రాంతంలో అనుమతి లేకుండా డ్రోన్ ద్వారా ఫోటోలు తీస్తున్న ముగ్గురు ఇజ్రాయెల్ దేశస్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుంతా 20 ఏళ్ల వయసు వారని, వీరిని అలోనెరుచి, జార్జ్ కౌజి, నోన్ ఫ్రైడ్‌స్టెయిన్‌గా గుర్తించామని, ఎస్‌హెచ్‌ఓ దేరావర్ సింగ్ పేర్కొన్నారు. అవసరమైన అనుమతులు తీసుకోకుండా డ్రోన్ ద్వారా దృశ్యాలను చిత్రీకరిస్తున్న ఈ ముగ్గురు ఇజ్రాయెల్ దేశస్తులను మంగళవారం అదుపులోకి తీసుకున్నామని, సంయుక్త విచారణ బృందం ప్రశ్నిస్తోందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంఎల్‌ఎ మృతి

- **లోకేంద్ర సింగ్‌తో పాటు మరి ముగ్గురు దుర్మరణం**

సీతాపూర్: ఉత్తర ప్రదేశ్‌లో ఓ శాసనసభ్యుడు దుర్మరణం పాలయ్యారు. లక్నోలో జరుగుతున్న యుపి పెట్టుబడుల సదస్సుకు హాజరయ్యేందుకు బిజెపి ఎంఎల్‌ఎ లోకేంద్ర సింగ్‌తో బుధవారం కారులో వెళ్తుండగా, కమలాపూర్ ప్రాంతంలో వీరి కారు ట్రక్కును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎంఎల్‌ఎతో పాటు మరో ముగ్గురు దుర్మరణం పాలైనట్లు పోలీసులు పేర్కొన్నారు. డివైడర్‌ను దాటుకొని అవతలి పక్కకు వెళ్తుండగా ఎంఎల్‌ఎ కారు డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి ఎదురుగా వస్తున్న ట్రక్కుని ఢీకొట్టడంతో ప్రమాదం వాటిల్లిందన్నారు. బిజ్నోర్ జిల్లా నూర్‌పూర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 45 ఏళ్ల లోకేంద్ర సింగ్ సహా అతని ఇద్దరు బాడీగార్డులు, ట్రక్కు క్లీనర్ కూడా మృతి చెందారని పోలీసులు వెల్లడించారు బాడీగార్డులను దీపక్ కుమార్ (32), బ్రిజేశ్ మిశ్రా (30)గా గుర్తించారు. ఈ ఘటనలో కారు, ట్రక్కు డ్రైవర్లు ఇద్దరూ తీవ్రంగా గాయపడగా వారిని ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉంది. ఇదిలా ఉండగా, ఎంఎల్‌ఎ మృతికి ప్రధాని నరేంద్ర మోడీ, యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఇతర మంత్రిమండలి సభ్యులు సంతాపం ప్రకటించారు. సింగ్ మరణించడం ఒక్క బిజెపికే కాకుండా సమాజానికి కూడా తీరని లోటని సిఎం, మంత్రులు పేర్కొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై ముందడుగు

లండన్ : దీర్ఘకాలిక వ్యాధులను పసికట్టే గ్రాహకాలను శాస్త్రజ్ఞుల బృందం కనుగొంది. ఈ పరికరాన్ని మనిషి ధరిస్తే చాలు శరీరంలో పొంచి ఉండే డయాబెటిస్ ఇతర వ్యాధుల ఉనికి గురించి తెలిసిపోతుంది. ఈ గ్రాహకాన్ని రూపొందించిన గ్లాస్గోవ్ సైంటిస్టుల బృందానికి భారతీయ సంతతి పరిశోధకుడు నాయకత్వం వహించారు. ప్రొఫెసర్ రవీందర్ దాహియా ఆధ్వర్యంలో రూపొందించిన ఈ సిస్టంతో మనుషుల చెమటలోని పిహెచ్ స్థాయిలను అంటే ఆమ్లలక్షణాలను పసికట్టేందుకు వీలేర్పడుతుంది. దీనితో రోగాల నిర్ధారణకు వీలేర్పడుతుందని తాజా అధ్యయన పత్రికలో వెల్లడించారు. తరచూ రోగాల నిర్ధారణకు అవలంభించే రక్త పరీక్షలు, మూత్ర పరీక్షల బదులుగా ఈ గ్రాహకాలను ధరిస్తే ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలేర్పడుతుందని పరిశోధకులు తెలిపారు. మనిషి చెమటలోనే రోగ లక్షణాల జాడలు ఉంటాయని వీటిని ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటే సకాలంలో రోగాల నిర్ధారణ జరుగుతుందని పరిశోధకులు తెలిపారు. స్ట్రెచబుల్ వైర్‌లైస్ సిస్టం పేరిట ఈ సరికొత్త సెన్సార్‌ను రూపొందించినట్లు రవీందర్ బృందం తెలిపింది. రక్తంలోని గ్లూకోస్, యూరియా ఇతర పదార్థాల మోతాదులను పసికట్టేందుకు ఈ గ్రాహకం దోహద పడుతుందని, వచ్చే కొద్ది సంవత్సరాలలో ఈ పరికరం మార్కెట్‌లోకి తెచ్చేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. గ్రాహకాల నుంచి సమాచారం తగు విధంగా వైర్‌లెస్ విధానం ద్వారా అందుబాటులో ఉండే ప్రత్యేక స్మార్ట్ ఫోన్‌కు అందడం దాని విశ్లేషణ ద్వారా సుదీర్ఘ వ్యాధులను నిర్ధారించేందుకు వీలేర్పడుతుంది.

మొసలి దాడిలో వృద్ధుడు మృతి

కడలూర్ : మొసలి దాడిలో 50 ఏళ్ల వృద్ధ వ్యవసాయ కూలీ మృతి చెందాడు. ఈ ఘటన తమిళనాడు కడలూర్ జిల్లాలోని ఓ నదిలో చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నందిమంగళం గ్రామంలో ఉన్న కొల్లిడ్యామ్ నది ఒడ్డు వద్ద ముక్కలు ముక్కలు అయిన మునుస్వామి మృతదేహం బయటి పడింది. ఇదే ప్రాంతంలో గతంలోనూ తరుచుగా మొసళ్లు కనిపించేవి. మునుస్వామి దేహంపై పలు గాయాలు ఉన్నాయని, అవి మొసలి దాడి చేసినట్లు సూచిస్తున్నాయని, దీంతో మునుస్వామి మంగళవారం రాత్రి స్నానం చేసేందుకు నదిలోకి దిగడంతో మొసలి దాడి చేసినట్లుగా అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టంకు పంపారు. కొత కొన్నేళ్లుగా మొసళ్ల దాడి ఘటనలు పెరిగిపోతున్నాయని పోలీసులు వెల్లడించారు.

పూంచ్‌లో పాక్ హెలికాప్టర్ చక్కర్లు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌కు 300 మీటర్ల సమీపంలో నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్ హెలికాప్టరు చక్కర్లు కొట్టి వెళ్లింది. ఈ విషయాన్ని బుధవారం సైనికాధికారి ఒకరు తెలిపారు. సరిహద్దుకు 10 కిమీ. దూరంలోకి కూడా రావడం నియంత్రణ రేఖ ఒప్పంద ఉల్లంఘన కిందికే వస్తుంది. అలాంటిది 300 మీ. సమీపానికి పాకిస్థాన్ హెలికాప్టర్ వచ్చి వెళ్లింది. అసలు సరిహద్దులో హెలికాప్టర్ 1 కిమీ. దూరం వరకు రావడమే తప్పు. పాకిస్థాన్ హెలికాప్టర్ చేసిన ఈ ఉల్లంఘన బుధవారం ఉదయం 10 గంటలకు జరిగింది. ఇలాంటి ఉల్లంఘన మానవ తప్పిదాల వల్ల కూడా జరుగుతుందని, కనుక ఇదేమి కొత్త విషయం కూడా కాదని ఆ సెక్టారులో పనిచేస్తున్న సైనికాధికారి ఒకరు తెలిపారు. అయితే ఇరు పక్షాల నుంచి కాల్పులు, లేక ఎదురు దాడి చర్యలు వంటివి ఏవి జరగలేదని అధికారులు తెలిపారు.

మరోచోట జాబ్ చూసోకండి

- **జీతాలివ్వలేను..ఖాతాలు స్తంభింపజేశారు**
- **ఉద్యోగులకు నీరవ్ మోడీ లేఖ**



ముంబయి/న్యూఢిల్లీ : భారత్‌లోని తన కంపెనీల్లో పనిచేస్తున్న వారంతా వేరే ఉద్యోగాలు వెతుక్కోవాలని పంజాబ్ నేషనల్ బ్యాంకుకు వేలాది కోట్ల రూపాయలు ఎగనామం పెట్టిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ సూచించారు.బుధవారంనాడు ఉద్యోగులకు ఈ మెయిల్ ద్వారా లేఖ పంపించారు. ఇక తాను జీతాలు చెల్లించే పరిస్థితుల్లో లేనని అందులో స్పష్టంచేశారు. దర్యాప్తు సంస్థలు తన కంపెనీలను సీజ్ చేశారని, ఆదాయపన్ను శాఖ తన బ్యాం కు ఖాతాలన్నీ స్తంభింపజేసిందన్నారు. దీంతో ఉద్యోగులకు వేతనాలు చెల్లించే పరిస్థితిలో లేనని ఆయన లేఖలో పేర్కొన్నారు. భవిష్యత్తు గురించి కూడా స్పష్టత లేదన్నారు. ఈ దుర్భర పరిస్థితుల నుంచి ఎప్పుడు బయటపడతానో తెలియదని, వేరే ఉద్యోగాలు చూసుకోవాలని ఉద్యోగులకు లేఖలో సూచించారు. తన్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేయడంపైనా నీరవ్ స్పందించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి), సిబిఐ, విదేశాంగ శాఖలకు కూడా లేఖలు రాసినట్లు సమాచారం. పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400కోట్ల కుంభకోణానికి పాల్పడిన కేసులో నీరవ్‌తో పాటు ఆయన మామ ఛోక్సీపై కూడా సీబీఐ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే నీరవ్‌కు చెందిన కంపెనీల నుంచి రూ.5,700కోట్ల విలువ చేసే ఆస్తులను ఇడీ సీజ్ చేసింది.

పిఎన్‌బిపై సిట్‌కు కేంద్రం నో : నీరవ్ మోడీ కీలక సూత్రధారిగా ఉన్న పిఎన్‌బి స్కామ్‌పై ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) ఏర్పాటు డిమాండ్‌ను కేంద్రం తోసిపుచ్చింది. నీరవ్ మోడీ కుంభకోణంపై స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థతో దర్యాప్తు చేపట్టాలని, నీరవ్‌ను దేశానికి రప్పించాలని సుప్రీం కోర్టు ప్రజా వ్యాజ్యం దాఖలు అయింది. అయితే ఇప్పటికే సంబంధిత దర్యాప్తు సంస్థలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నందున సిట్ ఇతరత్రా విచారణల అవసరం లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ దీనిపై వెంటనే తాము ఏమీ చెప్పదల్చుకోలేదని, ప్రస్తుతానికి ఈ పిల్ విచారణను మార్చి 16కు వాయిదా వేస్తున్నామని తెలిపింది. లాయర్ వినీత్ దాండా ఈ పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ హాజరయి ఈ పిల్‌ను తాము వివిధ కారణాల వల్ల వ్యతిరేకిస్తున్నామని, ఇప్పటికే ఈ కేసులో దర్యాప్తు సాగుతున్నందున ఇతర స్పందనలు అవసరం లేదన్నారు.

నీరవ్ స్కామ్‌లో ఏడవ రోజు సోదాలు : పిఎన్‌బి స్కామ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎడవ రోజు కూడా తమ సోదాలు సాగించాయి. దేశంలో 17 ప్రాంతాలలో గాలింపులు చేపట్టాయి. ముంబైలో నాలుగు డొల్ల కంపెనీల కార్యాలయాలను తనిఖీ చేశారు. నీరవ్ మోడీ , ఆయ న మేనమామ, గీతాంజలి జెమ్స్ నిర్వాహకులు మెహుల్ ఛోక్సీ అక్రమ కార్యకలాపాలతో సంబంధమున్నట్లుగా ఈ డొల్ల కంపెనీలను గుర్తించారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 200 షెల్ కంపెనీల వ్యవహారాలపై ఆరాతీస్తున్నారు. ఇం దులో భాగంగా బుధవారం ముంబైలోని నాలుగు షెల్ కంపెనీలపై దాడులు జరిగాయి. అధికారులు భారీ స్థాయి లో అక్కడి రికార్డులను పరిశీలిస్తున్నారు.

పిఎన్‌బి స్కామ్‌పై అవసరమైతే జోక్యం : సుప్రీం

న్యూఢిల్లీ : పిఎన్‌బి స్కామ్‌లో దర్యాప్తు సంస్థలు విఫలం అయితే తాము కలుగ చేసుకుంటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రూ 11,000 కోట్లకు పైగా సాగిన ఈ కుంభకోణంలో ప్రభుత్వం స్వతంత్రంగా వ్యవహరించి దర్యాప్తును వేగవంతం చేయాల్సి ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను భారీ స్థాయిలో మోసగించిన నీరవ్ మోడీ దేశానికి తిరిగి రప్పించాలని, స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు చేయించాలని దాఖలు అయిన ప్రజా వ్యాజ్యం విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఇతరులతో కూడిన ధర్మాసనం కేసు తీరుతెన్నులపై స్పందించింది. ప్రభుత్వం దీనిపై దర్యాప్తు చేపట్టినందున, ప్రభుత్వం నుంచి సరైన ఫలితం కనబడకపోతే తాము జోక్యం చేసుకుంటామని ధర్మాసనం వెల్లడించింది. అంతకు ముందు కేంద్రం తరఫున అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ వాదించారు. పిల్‌ను పూర్తి స్థాయిలో వ్యతిరేకించారు. దర్యాప్తు జరుగుతున్న దశలో పిల్ అవసరం లేదని తెలిపారు. న్యాయవాది వినీత్ దాండా ఈ పిల్ దాఖలు చేశారు. కేసుపై కేంద్రానికి నోటీసు జారీ చేయడం కానీ, దర్యాప్తు స్థాయీ నివేదిక కానీ అవసరం అని పిటిషనర్ వాదించారు. ఈ వ్యవహారాన్ని దేశమంతా గమనిస్తోందని, విజయ్ మాల్యా విషయంలో ప్రభుత్వం ఏమీ చేయలేదని తెలిపారు. ఇలాంటి కేసులోనే విజయ్ మాల్యా దేశం విడిచి వెళ్లారని, అప్పుడేం చేశారని ప్రశ్నించారు. దీనితో ధర్మాసనం స్పందిస్తూ ప్రసంగాలకు దిగవద్దని , కోర్టును ఇవి ప్రభావితం చేయజాలవని , ఉద్వేగభరిత అంశాలను కాకుండా , న్యాయపరమైన విషయాలకు ధర్మాసనం ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు.

సిబిఐ కార్యాలయంలో రోటామాక్ విక్రమ్

న్యూఢిల్లీ : రుణాల ఎగవేతకు సంబంధించి రోటామాక్ కంపెనీ అధినేత విక్రమ్ కొఠారీని సిబిఐ విచారించింది. బుధవారం సిబిఐ ప్రధాన కార్యాలయంలో కొఠారీని ప్రశ్నించారు. ఏడు జాతీయ బ్యాంకులకు రూ 3695 కోట్ల మేర రుణాల ఎగవేతకు సంబంధించి ఇంతకు ముందే సిబిఐ కాన్పూర్‌లోని ఆయన నివాసంలో కొద్ది సేపు విచారించింది. బ్యాంకు రుణాలపై విక్రమ్‌తో పాటు ఆయన భార్య, కుమారుడి నుంచి కూడా సమాచారం రాబట్టారు.తదుపరి విచారణకు విక్రమ్ కొఠారీని ఢిల్లీలోని సిబిఐ కార్యాలయానికి రప్పించారు. సిబిఐ ప్రధాన కార్యాలయంలో కొఠారీ విచారణకు అధికార వర్గాలు ఎలాంటి కారణాలు చూపలేదు. తాము తీసుకున్న బ్యాంకు రుణాలను వేరే కార్యకలాపాలకు దారిమళ్లించారని, రుణాల ఎగవేతకు యత్నించారని రోటామాక్ అధినేతపై అభియోగాలు ఉన్నాయి. ఇప్పటికే రోటామాక్ అధినేత విక్రమ్ ఆయన కుటుంబ సభ్యులు దేశం నుంచి పారిపోకుండా చర్యలు తీసుకోవాలని, భూ సముద్ర, విమాన మార్గాల ద్వారా వెళ్లకుండా భద్రతా చర్యలు చేపట్టారు. పిఎంఎల్‌ఏ పరిధిలో కంపెనీపై ఇడి కేసులు నమోదు చేసింది. దీని ప్రాతిపదికన సిబిఐ కూడా దర్యాప్తు చేపట్టింది.



రైల్వే ఉద్యోగార్థులకు శుభవార్త



న్యూఢిల్లీ: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బి) ప్రకటించిన పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులకు రైల్వే శాఖ శుభవార్త అందించింది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునే జనరల్ కేటగిరి అభ్యర్థులు రూ. 500 చెల్లించాల్సి ఉంది. అయితే పరీక్ష రాసిన తర్వాత వీరికి రూ. 400 రీఫండ్ చేస్తామని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. వీరితోపాటు రిజర్వేషన్ అభ్యర్థులు చెల్లించే రూ. 250 మొత్తాన్ని వార పరీక్ష రాసిన తర్వాత పూర్తిగా రీఫండ్ చేస్తామని పేర్కొన్నారు.

లోకల్ ట్రెయిన్‌లో టివి జర్నలిస్టుపై దాడి

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయిలో ఓ సీనియర్ టివి జర్నలిస్టుపై దాడి జరిగింది. పశ్చిమ రైల్వేలైన్‌లోని ఓ స్థానిక ట్రెయిన్ లోపల బుధవారం ఉదయం దాదాపు 8 మంది ప్రయాణికులు ఆయనపై దాడికి పాల్పడినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఆంధేరీ రైల్వే స్టేషన్స్, మీరా రోడ్ మధ్య జరిగిన ఈ ఘటనలో హిందీ వార్తా చానెల్‌లో పనిచేస్తున్న జర్నలిస్టు సుధీర్ శుక్లాకు గాయాలయ్యాయన్నారు. ఆంధేరీకి వెళ్తున్న స్థానిక ట్రైన్‌లోకి మీరా రోడ్ వద్ద శుక్లా ఎక్కేందుకు ప్రయత్నించగా అప్పటికే ఫుట్‌బోర్డులో కిక్కిరిసిపోయిన ప్రయాణికులు లోపల స్థలం లేదు రావద్దని శుక్లాకు చెప్పారని సీనియర్ ప్రభుత్వ రైల్వే పోలీస్ అధికారి తెలిపారు. అయినప్పటికీ శుక్లా ట్రైన్ లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించారని, ఈ నేపథ్యంలో ఫుట్‌బోర్డులో ఉన్న ప్రయాణికులకు, అతనికి మధ్య వాగ్వాదం జరిగిందన్నారు.

మేలి ముసుగు తీసేయండి

- **మహిళలపై ఆంక్షలను ఎత్తివేసిన ఖాప్ పంచాయతీ**

న్యూఢిల్లీ : ఎప్పుడూ మహిళలపై ఆంక్షలు విధించే ఖాప్ పంచాయతీ మొదటి సారిగా అనూహ్యం నిర్ణయం తీసుకుంది. వారిపై ఆంక్షలను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. హర్యానాలోని అతిపెద్ద ఖాప్ పంచాయతీగా పేరుగాంచిన మాలిక్ గథ్వాలా ఖాప్ మహిళలు ఇకమీదట మేలిముసుగు ధరించాల్సిన అవసరం లేదని, స్వేచ్ఛగా తిరగవచ్చని సూచించింది. సోనెపట్‌లోని ఘోఘన ప్రాంతంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఖాప్ పంచాయతీ పెద్దలు దశాబ్దాల నాటి సంప్రదాయాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఖాప్ పంచాయతీ చీఫ్ బల్జీత్ మాలిక్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నాటి సంప్రదాయానికి స్వస్తి పలికాల్సిన సమయం వచ్చిందన్నారు. మహిళలు ఇక మీదట ఇంట్లో, లేదా బయటకు వచ్చినపుడు మేలి ముసుగును ధరించాల్సిన అవసరం లేదని, అలా చేయడం అవివేకమని ఆయన అభివర్ణించారు. ముఖాన్ని ముసుగుతో కప్పి ఉంచడం వల్ల మహిళలు చూసేందుకు ఇబ్బంది పడటంతో పాటు, శ్వాస తీసుకోవడంలోను సమస్యలపాలవుతున్నారని అర్థమైందన్నారు. అందువల్ల దాన్ని నిషేధిస్తున్నాం అని బహిరంగ సభాముఖంగా చెప్పారు. పెద్ద వాళ్లను గౌరవించేందుకు సూచకంగా తలపై కేవలం స్కార్ఫ్ ధరిస్తే సరిపోతుందని ఖాప్ వెల్లడించింది. ఖాప్ పంచాయతీ తీసుకున్న నిర్ణయంపై అక్కడి మహిళలు హర్షం వ్యక్తం చేశారు. నిజంగా మహిళలకు ఇప్పుడే స్వాతంత్ర్యం వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రధాని మౌనంపై రాహుల్ ధ్వజం

- **పిఎన్‌బి,రాఫెల్ కుంభకోణాలపై ధర్మోపదేశమివ్వండి**
- **మోడీ 'మన్‌కీ బాత్' కోసం రాహుల్ సలహా**



మేఘాలయ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు రాహుల అభివాదం

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) కుంభకోణం, రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై ప్రధాని నరేంద్ర మోడీ 'మన్‌కీ బాత్' రేడియో కార్యక్రమంలో ఆయన సూక్తులు/ధర్మోపదేశం (సెర్మన్) వినాలనుకుంటున్నానని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యంగ్యంగా విమర్శించారు. 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని సాగదీత ప్రసంగాన్ని ఆయన ఎద్దేవా చేశారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, రఫేల్ కుంభకోణాలపై ప్రధాని మాట్లాడాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు. కానీ ఆయన మాత్రం వాటిని వదిలేసి వేరే సాగదీత ప్రసంగాలు చేస్తున్నారని అన్నారు. గత నెల మన్‌కీ బాత్‌కు తాను సూచించిన సలహాను ప్రధాని మోడీ పట్టించుకోలేదన్నారు. 'మీరు దేని గురించి మాట్లాడాలని భారతీయులు కోరుకుంటున్నారో మీకు బాగా తెలిసినప్పటికీ మీరు ప్రజలనే సలహాలివ్వమని ఎందుకు అడుగుతున్నారు?' అని రాహుల్ నిలదీశారు. 'నీరవ్ మోడీ రూ. 22 వేల కోట్లు లూటీ చేసి పారిపోవడంపై, రూ. 58 వేల కోట్ల రఫేల్ కుంభకోణంపై మీ ధర్మోపదేశానికి ఎదురు చూస్తున్నాను' రాహుల్ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. నీరవ్ మోడీ కుంభకోణంపై ప్రధాని మౌనంగా ఉండడాన్ని రాహుల్ తప్పుపట్టారు. దీనికి ముందు ప్రధాని నరేంద్ర మోడీ తన జనవరి 28 నాటి 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రజల నుంచి సలహాలు కోరడంపై ప్రతిస్పందించిన రాహుల్ ' ప్రియమైన నరేంద్ర మోడీగారు మీరు మన్‌కీ బాత్‌లో సలహాలు కోరారు. అయితే యువతకు ఉద్యోగాలు, డోక్లాం నుంచి చైనా వైదొలగడం, హర్యాణలో అత్యాచారాలు ఆపడంపై మీ ఆలోచన ఏమిటో చెప్పండి' అంటూ ట్వీట్ చేశారు.

మొబైళ్లకు 13 కాదు 10 అంకెలే!

- **మామూలు మొబైల్ సిమ్ నంబర్లు మారబోవు**
- **ఎం2ఎం పరికరాల సిమ్‌లకే 13 అంకెలు**



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం త్వరలో 13 అంకెల సిమ్‌లు ప్రవేశ పెట్టబోతుందన్న వార్తల్లో నిజం లేదని ఎప్పటిలానే 10 అంకెల సిమ్ నంబర్లే ఉండనున్నాయని టెలికమ్యూనికేషన్స్ శాఖ(డిఒటి) బుధవారం స్పష్టం చేసింది. 10 అంకెల సిమ్‌లు 13 అంకెలకు మారుతాయంటూ మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని పేర్కొంది. కేవలం మెషిన్ టు మెషిన్(ఎం2ఎం) మొబైల్ పరికరాలకే 13 అంకెల సిమ్ జారీ కాగలదని తెలిపింది. అవి కూడా 10 అంకెల సిమ్‌తో కలిసి పనిచేస్తాయని స్పష్టం చేసింది. సాధారణ మొబైల్ నంబర్లు సైతం 13 అంకెలకు మారుతాయన్న వాదనను చెత్త అంటూ టెలికాం శాఖ కొట్టిపారేసింది. 13 అంకెలుండే ఎం2ఎం మొబైల్ నంబర్లను జులై 1 నుంచి అమలు చేస్తారు. ఇప్పటి వరకున్న 10 అంకెల ఎం2ఎ మొబైల్ వినియోగదారుల నంబర్లు మాత్రమే అక్టోబరు 1 నుంచి మారుతాయి. సాధారణంగా ఎం2ఎం పరికరాలు ఇంటర్నెట్ సాయంతో నడుస్తాయి. అంటే క్రెడిట్ కార్డు స్వైపింగ్ యంత్రాల్లాగా. ఇవి కూడా సిమ్‌తోనే పనిచేస్తాయి. వివిధ పరిశ్రమల అవసరాలకనుగుణంగా ఎం2ఎం సర్వీసులను టెలికాం శాఖ అందిస్తోంది. కమ్యూనికేషన్‌కు సంబంధించి చాలా సంస్థలు ఎం2ఎం(మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్–ఎంటిసి)ని వినియోగిస్తాయి. విమానాలు, ఓడలు, ఇంటర్నెట్‌తో అనుసంధానమైన కార్లు, సైకిళ్లు, పిఒఎస్ యంత్రాలు ఈ విధమైన కమ్యూనికేషన్‌ను వినియోగిస్తాయి. భారత్‌లో భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఆర్‌కామ్, బిఎస్ఎన్ఎల్ తమ పారిశ్రామిక వినియోగదారులకు ఎం2ఎం సేవలను అందిస్తున్నాయి. రవాణా, విద్యుత్, రవాణా సామాగ్రి, సేవలు, వైద్యం, సముద్ర రవాణా తదితర రంగాల్లో ఎం2ఎం కమ్యూనికేషన్స్‌కు విశేష ప్రాధాన్యత ఉంది. ఇకపై ఇచ్చే ఎం2ఎం సిమ్‌లకు 13 అంకెలు ఉండనున్నాయి.

పారాదీప్‌లో 'వజ్ర' నౌకకు వీడ్కోలు



పారాదీప్: సముద్ర భద్రతలో మూడు దశాబ్దాల పాటు సేవలందించిన భారత కోస్ట్‌గార్డు నౌక 'వజ్ర'కు వీడ్కోలు పలికారు. ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో వజ్రను ఉపసంహరించుకున్నామని అధికారులు తెలిపారు. వజ్రకు గౌరవ వందనం నిర్వహించి, మంగళవారం సూర్యాస్తమయంలో చివరిసారిగా కోస్ట్‌గార్డ్ జెండాను కిందికి దించామని తెలిపారు. నౌకకు సమానమైన పొడవు గల జెండాను కిందికి దించినట్లు కోస్ట్‌గార్డ్ కమాండెంట్ ఆశిశ్ తెలిపారు.గత మూడు దశాబ్దాలుగా విశిష్ట సేవలందించిన వజ్రకు వీడ్కోలు పలికామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కోస్ట్‌గార్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కెఎస్ షెరాన్ మాట్లాడుతూ ఈశాన్య కోస్తా తీరంలో సముద్ర భద్రతకు నౌక నిర్వహించిన పాత్రను వివరించారు. మజగాన్ డాక్‌లో నిర్మించిన ఈ నౌకకు ఇంద్రుడి ఆయుధం వజ్ర పేరును పెట్టారు. డిసెంబర్ 22, 1988లో జల ప్రవేశం చేసిన ఈ నౌక ఏప్రిల్ 11, 2013లో పారాదీప్ కోస్ట్‌గార్డులో ప్రవేశపెట్టినట్లు అధికారులు తెలిపారు.

ఇష్రత్ జహాన్ కేసు నుంచి మాజీ డిజిపి పాండేకు విముక్తి



అహ్మదాబాద్: ఇష్రత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసు లో కీలక నిందితుడైన గుజరాత్ మాజీ డిజిపి పాండేకు ఊర ట లభించింది. అహ్మదాబాద్‌లోని సిబిఐ ప్రత్యేక కోర్టు బుధవారం ఆయనను విముక్తుడిని చేసింది. మృతులను అపహరించి, హత్య చేసినట్లు నమోదైన ఆరోపణలకు సంబంధించి తనకు వ్యతిరేకంగా ఎటువంటి సాక్ష్యాధారాలు లేవని, తనను ఈ కేసు నుంచి విముక్తిడిని చేయాలని పాండే పెట్టుకున్న వినతిని కోర్టు మన్నించింది. ఆయన వాదనతో సిబిఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జె.కె. పాండ్య ఏకీభవించారు. 1980 ఐపిఎస్ అధికారుల బ్యాచ్‌కు చెందిన పాండేను సిబిఐ 2013 జులైలో అరెస్టు చేసింది. బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆయనకు భాగం ఉందని సిబిఐ ఆరోపించింది. 19 నెలలు కారాగార జీవితం గడిపారు. 2015 ఫిబ్రవరిలో ఆయనకు బెయిల్ లభించింది. దాంతో ఆయన్ను మళ్లీ రాష్ట్ర పోలీసు శాఖలోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆయనకు డిజిపి స్థాయి ప్రమోషన్ లభించింది. వయస్సురీత్యా ఆయన పదవీ కాలం ముగిసిపోయినప్పటికీ ఆయనకు సర్వీస్ ఎక్స్‌టెన్షన్ ఇచ్చారు.

భర్త మర్మాంగాలు కోసి.. టాయిలెట్‌లోవేసిన భార్య



జలంధర్: వేరే మహిళతో భర్త వివాహేతర సంబంధంపెట్టుకున్నాడని ఆగ్రహించిన ఓ మహిళ అతని మర్మాంగాలు కోసి టాయిలెట్‌లో పారేసింది. సంచలనం సృష్టించిన ఈ ఘటన పంజాబ్‌లోని నిజలంధర్‌లో చోటు చేసుకుంది. తన భర్త ఆజాద్ సింగ్ తనను మోసం చేశాడని జోగింధర్ నగర్‌లో నివాసముండే సుఖ్వంత్ కౌర్ అనుమానించింది. రాత్రి నిద్రిస్తున్న భర్తపై ఆమె ఇనుపరాడ్‌తో దాడి చేసింది. స్పృహ కోల్పోయిన భర్త మర్మాంగాలను కోసి, వాటిని టాయిలెట్‌లో వేసిందని జలంధర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సతీందర్ కుమార్ తెలిపారు. తీవ్ర రక్తస్రావమైన సింగ్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని పోలీసులు తెలిపారు. సింగ్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారని వారు తెలిపారు.

నిధులు లేక సగం సీట్లకు పోటీ చేయలేకపోతున్న నాగా కాంగ్రెస్

కోహిమా: నాగాలాండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) ఆ రాష్ట్రంలో ప్రస్తుతం పార్టీ ఎదుర్కొంటున్న సంక్షోభానికి గాను పార్టీ నాయకత్వంపై విరుచుకుపడింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 60 నియోజక వర్గాలకూ సగం చోట్ల పార్టీ అభ్యర్థులను నిలబెట్టలేకపోయింది. నిధుల కొరత వల్ల ఈ పరిస్థితి దాపురించిందని పిసిసి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సిపి జోషిని విమర్శిస్తూ పిసిసి పేర్కొంది. ఎన్నికల ప్రచారానికి తగినంతగా నిధులు కల్పించకుండా పద్ధతి ప్రకారం నాగాలాండ్‌లో కాంగ్రెస్‌ను దెబ్బతీస్తున్నట్లు ఆయనపై ఆరోపణ చేసింది. తన స్వగృహంలో 'ఫస్ట్ పోస్ట్' ప్రతినిధితో ఎన్‌పిసిసి అధ్యక్షుడు కె థెరీ మాట్లాడుతూ ఎఐసిసి ప్రధాన కార్యదర్శిపై నిప్పులు చెరిగారు. ప్రతిఒక్క నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఐదు నుంచి పది కోట్ల రూపాయలు ఎన్నికల ప్రచారానికి ఖర్చు పెడతామని హామీ ఇస్తుంటే కాంగ్రెస్ నిధుల విషయంలో బాగా వెనకబడిందని ఆయన ఆక్రోశం వెలిబుచ్చారు. పార్టీ వ్యవహారాలు నడిపించడంలో అధ్యక్షుడు రాహుల్ గాంధీ తప్పేమీ లేదని, పార్టీ అవసరాలను ఆయన చెవిన వేయాల్సిన బాధ్యత పార్టీ ప్రధాన కార్యదర్శిదని ఆయన అన్నారు.

తక్కువ వ్యయంతో చంద్రయాన్–2

హాలీవుడ్ సినిమా 'ఇంటర్‌స్టెల్లార్' కన్నా తక్కువ ఖర్చు, మొదలైన సందడి





న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న చంద్రయాన్–2 యాత్రపై సందడి మొదలైంది. ఈసారి చంద్రుడిపై రోదసి వాహకాన్ని మొదటిసారి దించబోతుండడంతో అంతరిక్ష సర్క్యూట్‌లో సందడి చోటుచేసుకుంటోంది. చంద్రుడిపైకి రోదసి వాహనాన్ని పంపడం భారత్‌కు ఇది రెండోసారి. ఇదివరలో చంద్రయాన్–1ను కూడా ప్రయోగించింది. అయితే చంద్రుడిపై భారత్ రోదసి ల్యాండర్ దిగడం ఇదే మొదటిసారి కాబోతున్నది. ఈ ప్రయోగానికి అయ్యే ఖర్చు హాలీవుడ్ సినిమాకన్నా స్వల్పమన్నది ఇక్కడ గమనించాల్సి విశేషం. 2014లో నిర్మించిన హాలీవుడ్ చిత్రం 'ఇంటర్‌స్టెల్లార్' ఖర్చు రూ. 1062 కోట్లు(165 మిలియన్ డాలర్లు) కాగా, చంద్రయాన్–2కు అయ్యే ఖర్చు కేవలం రూ.800 కోట్లు కానున్నది. 2013లో ఇస్రో చేపట్టిన అంగారక యాత్రకు అయిన వ్యయం రూ. 470 కోట్లే. అది అదే సంవత్సరం నిర్మించిన హాలీవుడ్ చిత్రం 'గ్రావిటీ' వ్యయంరూ. 644 కోట్లు(100 మిలియన్ డాలర్లు) కన్నా తక్కువే.

వృథా ఖర్చు నివారణకు

భారత్ ఈ రెండో చంద్రమండల యాత్ర 2018 ఏప్రిల్‌లో జరుగుతుంది. చంద్రుడి పరిశోధనకు సంబంధించినంత వరకు అత్యంత ఆసక్తికర భారత్ పరిశోధన ఇది. ఈ చంద్రయాన్–2 యాత్ర ను సకాలంలో పూర్తిచేయడమేకాక, అతిస్వల్ప ఖర్చుతో చేస్తున్నది. 'రోదసి వాహనం అభివృద్ధి ప్రతి దశను మేము నిశితంగా గమనిస్తున్నాము. అందుకనే వృథా ఖర్చును నివారించగలుగుతున్నాం' అని ఇస్రో ఛైర్మన్ కె. శివన్ ఓ ఇంటర్వ్యూ లో తెలిపారు. దీనికి ముందు'టైమ్స్ ఆఫ్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన రోవర్‌ను దింపే రెండు చంద్రుడిపై స్థలాలను గుర్తించామన్నారు. ఆ రెండింటిలో ఒకదాన్ని ఖరారు చేస్తామన్నారు. ఆ ప్రదేశంలో ఏ ఇతర చంద్రుడి యాత్రా ప్రయోగాలు కాలూనలేదని కూడా తెలిపారు.

త్వరలో ప్రయోగం

'శ్రీహరికోట నుంచి చంద్రయాన్–2ని ప్రయోగించనున్నాం, అది చంద్రుడి కక్ష్యలోకి చేరడానికి ఒకటి, రెండు నెలల సమయాన్ని తీసుకుంటుంది' అని ఇస్రో చీఫ్ శివన్ తెలిపారు. చంద్రయాన్–1ను పిఎస్ఎల్‌వి రాకెట్ ద్వారా ప్రయోగించగా, దాదాపు 3290 కిలోల బరువుండే రోదసి వాహనం చంద్రయాన్–2ను హెవీ పేలోడ్ లిఫ్టర్ జిఎస్ఎల్‌వి ఎంకె 2 ద్వారా ప్రయోగించనున్నారు. ఈ ప్రయోగంలో ఆరు చక్రాల రోవర్‌ను కూడా తీసుకుపోనున్నారు. దానిని గ్రౌండ్ కమాండ్స్ ఆదేశాల ప్రకారం సెమీ–అటానమస్ మోడ్ లో నిర్ణీత స్థలంలో దించనున్నారు. అది చంద్రుడిపై దిగి న ప్రదేశంలో అటూఇటూ తిరుగాడుతూ చంద్రుడి ఉపరితలంను పరికరాల ద్వారా పరిశీలించి డేటాను తిరిగి భూమండలానికి పంపిస్తుంది.దాని ద్వారా చంద్రుడి మన్ను తీరును విశ్లేషించే వీలుంటుంది. ఆరు చక్రాల ఈ రోవర్ ఆ ప్రదేశంలో రసాయన పరిశోధనను కూడా చేపడుతుంది. ఆ వివరాలను చంద్రయాన్–2 రోదసి వాహకం ద్వారా భూమికి పంపిస్తుందని ఇస్రో తెలిపింది. చంద్రుడి కక్ష్య 100 కిమీ. కు చేరగానే రోవర్‌ను తీసుకెళ్లే ల్యాండర్ రోదసి వాహకం నుంచి వేరవుతుంది. నియంత్రిత పతనం తర్వాత చంద్రుడి ఉపరితలంపై ఉండే మృదువైన ప్రదేశంలో ల్యాండర్ దిగుతుంది.

తుపాకీ పరికరంపై నిషేధం

వాషింగ్టన్: ఫ్లోరిడా స్కూల్‌లో కాల్పుల ఘటనపట్ల ప్రజాగ్రహం ఎదుర్కొంటున్న అధ్యక్షుడు ట్రంప్ 'బంప్ స్టాక్స్'ను నిషేధించే విషయం ఆలోచించాలని న్యాయ శాఖను ఆదేశించారు. ఇది సెమీ ఆటోమేటిక్ రైఫిళ్లను పూర్తి ఆటోమేటిక్‌గా మార్చే వివాదాస్పద పరికరం.చట్టం అనుమతిగల రైఫిళ్లను మిషన్ గన్‌లుగా మార్చే అన్నిపరికరాలను నిషేధించాలని ట్రంప్ మంగళవారం నాడు అటార్నీ జనరల్ జెఫ్ సెషన్స్‌కు సూచించారు. త్వరలోనే అందుకు సంబంధించిన నియమాలు ఖరారవుతాయని ట్రంప్ చెప్పారు. ఫ్లోరిడా స్కూలు ఘటనలో14మంది విద్యార్థులు,ముగ్గురు టీచర్లు కాల్పులకు బలైయ్యారు. ఆ నేపథ్యంలో ఈ సూచనలు వెలువడ్డాయి.

'సూర్య నమస్కార్ యోగథాన్'

11,000 మంది హాజరు

వాషింగ్టన్ : వార్షిక 'సూర్య నమస్కార యోగథాన్' కార్యక్రమాలలో 11,000 మంది అమెరికన్లు పాల్గొన్నారు. యోగా గురించి అవగాహన కల్పించడానికి హిందూ స్వయం సేవక్ సంఘ్ (హెచ్‌ఎస్‌ఎస్) అమెరికాలోని 27రాష్ట్రాల్లో వేర్వేరు చోట్ల ఈ కార్యక్రమాలు నిర్వహిం చింది. వాటిలో 58 మంది అధికార ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. వారిలో మేయర్లు, కాంగ్రెస్ సభ్యులు,సెనెటర్లు, రాష్ట్రాల గవర్నర్లు కూడా ఉన్నారు. యోగథాన్ ద్వారా ఆరోగ్యం పెంపునకు తమతమ ప్రాంతాల్లో కృషి చేస్తామని వారందరూ ప్రతిన గైకొన్నారు.అమెరికా అంతటా రెండు వారాల పాటు ఈ కార్యక్రమాలు జరిగాయి. 156 చోట్ల ఇందుకు సంబంధించిన కార్యగోష్టులు కూడా ఏర్పాటయ్యాయి.

రెండో రోజూ మారణ హోమం





ఆర్‌బిన్: సిరియాలోని ఈస్టర్న్ ఘౌటా ఎన్‌క్లేవ్‌పై రష్యా విమానాలతో కలిసి ఆ దేశపు ప్రభుత్వ బలగాలు వరుసగా రెండవ రోజు జరిపిన వైమానిక దాడుల్లో వంద మంది పౌరులు మరణించారు. ఉత్తర ఆఫ్రిన్ ప్రాంతంలోకి ప్రభుత్వ బలగాలను పోరాట రంగంలోకి దించారు. అక్కడ ప్రభుత్వ బలగాలపై టర్కిష్ బలగాల కాల్పులు సాగాయి. కుర్దిష్‌ల పట్టులోని ఎన్‌క్లేవ్ కోసం రెబెల్స్, సిరియా బలగాల మధ్య పోరాటం సాగుతోంది. ఇది ఆ దేశంలో ఏడేళ్ల నుంచి జరుగుతున్న యుద్ధంలో కీల క పరిణామం. రాజధాని డెమాస్కస్ శివారుల్లో వైమానికి, రాకెట్, శత ఘ్ని దాడులు సాగుతున్నాయి. ఆదివారం నుంచి ఇప్పటి దాకా మొత్తం 250 మంది పౌరులు ఈ దాడుల్లో మరణించారు.

బస్సు పేలి12 మందికి గాయాలు

కొలంబో: శ్రీలంకలో బుధవారం తెల్లవారుజామున బస్సులో పేలుడు సంభవించి 12 మంది సైనికులు సహా మొత్తం 19 మంది గాయపడ్డారు. ఈ పేలుడు ఘటన ఉదయం 5.45 గంటలకు జరిగింది. జాఫ్నా నుంచి దియతలవ పట్టణానికి వెళుతున్న బస్సులో ఈ పేలుడు సంభవించిందని మిలిటరీ ప్రతినిధి బ్రిగేడియర్ సుమిత్ ఆటపట్టు చెప్పారు. ఈ పేలుడు ఘటనలో గాయపడిన వారిలో ఏడుగురు సైనికులు, ఐదుగురు వైమానిక దళ సిబ్బంది, ఏడుగురు పౌరులు ఉన్నారు. దియతలవలోని కహగొల్లా ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. బస్సు బాగా దెబ్బతింది. గాయపడినవారిని ఆసుపత్రిలో చేర్చారు. ఈ పేలుడు ఘటన ఉగ్రవాదంతో సంబంధంలేనిదని కొట్టిపారేసేటట్టు లేదని ఆటపట్టు అక్కడి దిన పత్రిక 'డెయిలీ మిర్రర్‌కు తెలిపారు.

అనుమతి లేకుండా భవన నిర్మాణం

లక్ష రూపాయలు జరిమానా విధించిన హైకోర్టు

మన తెలంగాణ/ హైదరాబాద్: తమ ఆదేశాలను ఉల్లంఘించడమే కాకుండా తప్పుదోవపట్టించిన హైదరాబాద్‌లోని టోలిచౌకి ప్రాంతానికి చెందిన సయ్యద్ మోయినుద్దీన్‌కు హైకోర్టు లక్ష రూపాయల జరిమానా విధించింది. టోలిచౌకి ప్రాంతంలోని అంజయ్యనగర్‌లో అనుమతి లేకుండా అయిదు అంతస్తుల భవనాన్ని నిర్మించిన సయ్యద్‌పై జీహెచ్‌ఎంసీ హైకోర్టులో కోర్టు ధిక్కార రిట్‌ను దాఖలు చేసింది. దీనిని విచారించిన న్యాయమూర్తి నవీన్‌రావు.. సయ్యద్‌కు లక్ష జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. భవనాన్ని నిర్మించేసిన సయ్యద్ జీహెచ్‌ఎంసీకి భవన నిర్మాణ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. దీనిని గతంలో విచారించిన న్యాయమూర్తి.. యథాతథ పరిస్థితిని కొనసాగించాలని ఆదేశించారు. ఈ ఆదేశాలు ఉండగానే అయిదు అంతస్తుల భవనాన్ని సయ్యద్ నిర్మించడంపై జీహెచ్‌ఎంసీ కోర్టు ధిక్కార రిట్ వేసింది. ఈ కేసులో సయ్యద్‌కు కోర్టు భారీ జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది

హైకోర్టుకు ఇండియా సిమెంట్స్ అధినేత

మన తెలంగాణ/ హైదరాబాద్: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన కేసులో సీబీఐ కోర్టు విచారణకు స్వయంగా హాజరు కావాలన్న ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఇండియా సిమెంట్స్ అధినేత శ్రీనివాసన్ హైకోర్టును ఆశ్రయించారు. గనుల లీజు, నీటి కేటాయింపులపై సీబీఐ పెట్టిన కేసును హైకోర్టు కొట్టేసిందని, దాని ఆధారంగా ఈడీ పెట్టిన కేసు విచారణ సమయంలో స్వయంగా హాజరీ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన లాయర్ బుధవారం హైకోర్టులో వాదించారు. దీనిపై వివరాలు అందజేయాలని ఈడీని హైకోర్టు న్యాయమూర్తి షమీమ్ అక్తర్ నోటీసులు జారీ చేశారు. సీబీఐ కేసుకూ ఈకేసుకూ సంబంధం లేదని, ఇది మనీలాండరింగ్‌తో ముడిపడిన కేసని ఈడీ లాయర చెప్పారు. విచారణ 27కి వాయిదా పడింది.

జర్నలిస్టు మహ్మద్ రఫీకి గౌరవ డాక్టరేట్



మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రముఖ సీనియర్ పాత్రికేయులు, 'కళ' పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీకి జర్నలిజంలో గౌరవ డాక్టరేట్ లభించింది. జర్మనీకి చెందిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బ్యాంకాక్‌లోని జరిగిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో మహ్మద్ రఫీ డాక్టరేట్ స్వీకరించారు.

ఎపి చట్టవిరుద్ధ చర్యలను అడ్డుకుంటాం


మన తెలంగాణ/హైదరాబాద్: మాసబ్‌ట్యాంక్‌లోని ఎఫ్‌డిసి భవనంలో కొంత భాగాన్ని అమ్మాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యత్నాలను అడ్డుకుంటామని ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల ఫెడరేషన్ స్పష్టం చేసింది. సచివాలయంలో బుధవారం ఫెడరేషన్ నాయకులు ఆర్.సుధీర్‌బాబు, బి.రాజేశం, జిటి జీవన్ తదితరులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషిని కలిసారు. అనంతరం మీడియా పాయింట్‌లో మాట్లాడాతూ షీలాభిడే కమిటీ కేవలం ఆస్తులు, అప్పుల పంపిణీ మాత్రమే చేయాలని, ఉద్యోగుల విభజన అంశాన్ని ఆయా సంస్థల యాజమాన్యాలే తేల్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఆస్తులు, అప్పుల పంపకాలకు, ఉద్యోగుల విభజనకు ఆంధ్రప్రదేశ్ ఏ మాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. ఎఫ్‌డిసి భవనంలో కొంత భాగాన్ని అమ్మాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రయత్నాన్ని అడ్డుకోవాలని కోరారు.

నవాజ్ షరీఫ్‌పై మరో అనర్హత వేటు



ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు మరో ఎదురు దెబ్బ తగిలిం ది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 62, 63 కింద అనర్హత వేటుకు గురైన వ్యక్తి రాజకీయ పార్టీకి అధినేతగా ఉండడానికి వీలులేదని పాకిస్థాన్ సుప్రీంకోర్టు బుధవారం తీర్పు చెప్పింది. తీర్పును ప్రధాన న్యాయమూర్తి నిసార్ చదివి వినిపించారు. దీంతో నవాజ్ షరీఫ్ ఇకపై అధికార పార్టీ పిఎంఎల్–ఎన్‌కు అధినేతగా ఉండడానికి అనర్హుడు. పనామా పేపర్ల కేసులో పాకిస్థాన్ సుప్రీంకోర్టు 2017 జులైలో 68 ఏళ్ల నవాజ్ షరీఫ్‌ను ఆర్టికల్ 62 కింద అనర్హుడిగా ప్రకటించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 62, 63లకు అనుగుణంగా పార్టీ అధినేతలుండాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి సఖీబ్ నిసా ర్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. పార్లమెంటును నడిపే నాయకుల ప్రవర్తన మెరుగ్గా ఉండాలని కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది. పిఎంఎల్–ఎన్ పార్టీ రిజిస్ట్రేషన్‌పై తీర్పు ప్రభావం ఉండదు కానీ షరీఫ్ తీసుకునే నిర్ణయాలు చెల్లబోవు. ఎన్నికలకు ఆయన జారీ చేసే టికెట్లు కూడా చెల్లబోవు. ఈ తీర్పుతో పాకిస్థాన్‌లో మార్చి 3న జరిగే ఎగు వ సభ ఎన్నికలు వాయిదాపడనున్నాయని తెలుస్తోంది. లండన్‌లో ఉన్న విలువైన ఆస్తులకు సంబంధించిన షరీఫ్, ఆయన కుటుంబ సభ్యులు అభియోగాలు ఎదుర్కొంటున్నారు. షరీఫ్, ఆయన సంతానం, అల్లుడిపై సెప్టెంబర్ 8న కోర్టులో మూడు కేసులు నమోదయ్యాయి.

డాక్టర్ బిల్లీ గ్రాహం ఇకలేరు!



వాషింగ్టన్: అమెరికాకు చెందిన ప్రపంచ ప్రసిద్ధిగాంచిన క్రైస్తవ మత ప్రబోధకుడు, సదరన్ బాప్టిస్టు సంఘాల స్థాపకుడు డాక్టర్ బిల్లీ గ్రాహం (100) మృతిచెందారు. భారత కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఉత్తర కెరోలీనాలోని మోన్ట్రీట్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. గత కొన్నేళ్లుగా శ్వాసకోస సమస్యతో బాధ పడుతున్నట్లు 'ఫాక్స్ న్యూస్' ఏజెన్సీ ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యధికంగా పేరుగాంచిన పది మందిలో బిల్లీ గ్రాహం ఒక్కరు. 1918 నవంబర్ 7న చార్లోటే నగరంలో జన్మించిన డాక్టర్ గ్రహం 1949నుండి క్రైస్తవ ప్రబోధకుడిగా ఆయన పరిచర్యను ప్రారంభించి ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచారు. తన సభల ద్వారా వచ్చిన డబ్బులతో ప్రపంచంలోని నలుమూలల పేద, మధ్య తరగతికి చెందిన బాలబాలికలకు సమరి టైన్ బాక్సులను అందించారు. భారతదేశాన్ని ఎంతో ఇష్టపడే వారని ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన 'నేషనల్ ప్రేయర్ డే'సభలకు ముఖ్య అతిథిగా విచ్చే సిన ఆయన కుమార్తె అన్నీ గ్రహం తెలి పింది.హెబ్రోన్ చర్చ్ వ్యవస్థాపకు లుబ్రదర్ భక్తసింగ్‌తో బిల్లీ గ్రాహంకు స్నేహ సంబంధాలుండేవి.

దివిసీమా బాధితులకు చేయూత: 1977 భారీ వర్షాలకు సర్వం కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌లోని దివిసీ మా బాధితులకు డా.బిల్లీ గ్రాహం చేయూతనందించారు. బాధిత కుటుంబాలకు నిత్యావసరాలతో పాటు ఆరోగ్య సేవలు అందించారు. వరద సమయంలో ఇండ్లను కోల్పో యిన నిర్వాసితుల కోసం రాజమండ్రిలో ఓ కాలనీని కట్టిం చి ఆదుకున్నారు.

డోనాల్డ్ ట్రంప్ సంతాపం: డాక్టర్ బిల్లీ గ్రాహం మృతిపట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ సంతాపం వ్యక్తం చేశారు. బిల్లీగ్రాహం ఓప్రత్యేక వ్యక్తి. ఆయన లేని లోటు క్రైస్తవులతోపాటు అన్ని మతాలవారికి తీరనిలోటని ట్రంప్ ట్వీటర్ ద్వారా తెలిపారు.


కందులు కొనుగోలు చేయండి

కేంద్ర మంత్రి రాధా మోహన్ సింగ్‌ను కోరిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణలో పెద్ద ఎత్తున పండిన కందులను కొనుగోలు చేయాలని కేంద్ర మంత్రి రాధా మోహన్ సింగ్ ను కోరినట్లు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. గతంలో మంత్రి హరీష్ రావు విజ్ఞప్తితో కేంద్రం కొంత కొనుగోలు చేసిందని చెప్పారు.పెద్ద ఎత్తున కందులు పండిన నేపథ్యంలో మరిన్ని క్వింటాళ్ల కందిపంటను కేంద్రం కొనుగోలు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు. దానికి సానుకూలంగా కేంద్ర మంత్రి స్పందించారని తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి రాధా మోహన్ సింగ్‌ని బుధవారం మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి కలిసారు. అనంతరం కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ గంగ్వార్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్‌ను బుధవారం ఢిల్లీలోని శ్రమ శక్తి భవన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కలిశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో 50 పడకల ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుకు తోడ్పాటునందించాలని గంగ్వార్ ను కోరారు. ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుకు అవసరమైన పాత ఏరియా ఆసుపత్రి భవనాన్ని అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి వివరించారు. ఆ భవనంలో ఈఎస్ఐ దావాఖానా ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల్ని విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి ఇంద్రకరన్ రెడ్డి తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ త్వరితగతిన ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేసి, వైద్య సేవలు ప్రారంభమయ్యేలా చొరవ చూపాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ అధికారులరే తగిప ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు. నిర్మల్ పట్టణ కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం వల్ల నిర్మల్ జిల్లాతో పాటు ఇతర సరిహద్దు జిల్లాల బీడీ కార్మికులకు వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈఎస్ఐ దావాఖానాలో వైద్య సేవలు అందుబాటులోకి వస్తే దీర్ఘకాలిక వ్యాధుల బారినపడ్డ అనేక్ మంది బీడీ కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. వ్యయ ప్రయాసాలకు ఓర్చి సుదూర ప్రాంతాలకు వెళ్లే బాధ తప్పుతుందని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు.

భారత్ ఆందోళన చెందొద్దు : హసీనా



ఢాకా: చైనా, బంగ్లాదేశ్‌ల మధ్య పెరుగుతున్న సంబంధాల కారణంగా భారత్ ఆందోళనకు గురికానవసరంలేదని బంగ్లాదే శ్ ప్రధాని షేఖ్ హసీనా అన్నారు. తమ దృష్టి అంతా దేశ అభివృద్ధిపైనేనని, అందుకు ఏ దేశంతోనైనా సహకరిస్తామని అన్నారు. ' పెట్టుబడి, సహకారాన్ని ఎవరు అందించినా మేము స్వీకరిస్తాం. మా దేశ అభివృద్ధిని కోరుకుంటున్నాం. మేము మా ప్రజల గురించి ఆలోచిస్తున్నాం, అభివృద్ధి ప్రయోజనాలు వారికి అందాలి' అని ఆమె తన అధికార నివాసంలో పాత్రికేయులకు చెప్పారు. బంగ్లాదేశ్‌కు సహకరించడానికి భారత్, చైనా, జపాన్, మధ్యప్రాచ్య దేశాలు ముందుకొస్తున్నాయని అన్నారు.' భారత్ ఆందోళనకు గురికానవసరంలేదు. ఎలాంటి సమస్య తలెత్తినా ఇదివరకులాగానే మేము చర్చల ద్వారా పరిష్కారంకు ప్రయత్నించగలం' అని హసీ నా చెప్పారు. బంగ్లాదేశ్‌తో రక్షణ సంబంధాలు పెట్టుకుని సైనిక సంబంధాలను వృద్ధి చేస్తామని చైనా ప్రతిజ్ఞ చేసింది. బంగ్లాదేశ్‌లో ఆరు రైలు ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో 90 లక్షల డాలర్లు ఇవ్వడానికి చైనా ప్రణాళిక వేసుకుంది. ఇదిలా ఉండగా రోహింగ్యాల విషయంలో మాత్రం భారత్ సాయాన్ని బంగ్లాదేశ్ కోరుకుంటోంది. మయన్మార్‌పై భారత్ ఒత్తిడి పెంచాలని హసీనా డిమాండ్ చేసింది.

25న ఆయుర్వేద వైద్యంపై జాతీయ సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఈ నెల 25వ తేదీన ఆయుర్వేద వైద్యంలో చికిత్సలపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, సెమినార్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ పోలేపల్లి యాదయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్‌కెఆర్ ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ కళశాలలో డాక్టర్ యాదయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ముంబయిలోని నేషనల్ అకాడెమి ఆఫ్ ఆయుర్వేద, రాష్ట్రంలోని ఆయుర్వేద విషేషాజ్ఞ, వివిప సంస్థలు కలిసి ఈ జాతీయ సదస్సును నిర్వహించనున్నాయని, వైద్యశాఖమంత్రి లక్ష్మారెడ్డి ప్రారంభించనున్నారని వెల్లడించారు. ఆయుర్వేదంలో వివిధ రకాల నొప్పులకు ఇటీవల కనుగొన్న కొత్త మందులు అద్భుతంగా పనిచేస్తున్నట్లు శాస్త్రీయంగా రుజువైనట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపైనే సదస్సులో చర్చించనున్నట్లు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 300 మంది ఆయుర్వేద వైద్యులు ఈ సదస్సులో పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

యశోదలో అరుదైన ఆపరేషన్లు



మన తెలంగాణ/హైదరాబాద్ : మెదడులో ఏర్పడే గడ్డల శస్త్ర చికిత్స విధానంలో సాంకేతికపరంగా ముందడుగు పడింది. ఇటీవల విదేశాలలోని ప్రపంచ ప్రఖ్యాత వైద్య కేంద్రాలలో బ్రెయిన్ సర్జరీలలో విప్లవాన్ని తీసుకువచ్చిన 'ఇంట్రా ఆపరేటివ్ 3టి ఎంఆర్ఐ(ఐఎంఆర్ఐ)' విధానం దేశంలోనే తొలిసారిగా యశోధ గ్రూప్ హాస్పిటల్స్‌లో నెలకొల్పారు. గత కొంతకాలంగా ఐఎమ్మార్‌ని ఉపయోగించి యశోద గ్రూప్ హాస్పిటల్స్ చెందిన సర్జన్లు వంద వరకూ సంక్లిష్టమైన మెదడు కణితుల ఆపరేషన్లు చేశారు. సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐఎంఆర్ఐ పనితీరు, విజయవంతమైన శస్త్రచికిత్సల గురించి వివరించారు. న్యూరోసర్జరీకి సంబంధించి జాతీయ, అంతర్జాతీయ వైద్య సంస్థల్లో శిక్షణ పొందిన, పని చేసిన అనుభవం గల యశోద సర్జన్లు ఐఎమ్ఆర్ఐ వంటి అత్యాధునిక చికిత్స విధానాలను ఉపయోగించి బ్రెయిన్ సర్జరీలు చేస్తున్నట్లు గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్ రావు చెప్పారు. మెదడు గడ్డలను తొలగించే పని విజయవంతంగా పూర్తిచేయటానికి రియల్ టైమ్ ఇమేజెస్ అవసరం అవుతాయని సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ ఆనంద్ బాలసుబ్రమణియం చెప్పారు. న్యూరోసర్జరీ విభాగానికి చెందిన డాక్టర్లు అత్యాధునిక నిర్ధారణ యంత్రం పని తీరును వివరించారు. ఖచ్చితమైన, పూర్తి సురక్షితమైన, తరచూ సర్జరీలు చేయాల్సిన అగత్యాన్ని తప్పించగల ఐఎమ్ఆర్ఐతో కేంద్ర నాడీ మండలం (సిఎన్ఎస్)లో ఏర్పడే గడ్డలను తొలగించి వేయటానికి వీలవుతుందని తెలిపారు.

ఢిల్లీ సిఎస్‌పై దాడికి ఖండన

మన తెలంగాణ / హైదరాబాద్ : ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పై జరిగిన భౌతిక దాడిని తెలంగాణ ఐఎఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఖండించింది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల సమక్షంలోనే ఎమ్మెల్యేలు దాడికి పాల్పడడం తీవ్ర ఆక్షేపణీయమని అసోసియేషన్ గౌరవ కార్యదర్శి నవీన్ మిట్టల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలా అయితే అధికారులు స్వేచ్ఛగా పనిచేయలేరని, ప్రజాస్వామ్య వ్యవస్థకు కూడా విఘాతమని పేర్కొన్నారు. న్యాయం కోసం ఢిల్లీ ప్రభత్వ అధికారుల మూడు అసోసియేషన్ల ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటానికి సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ ఘటనలకు కారకులైనవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతు సమితుల్లో అవకాశాలకు నేతల పైరవీలు

మండల సమితిలో లేకున్నా.. జిల్లా సమితిలో సభ్యులుగా ఎంపిక

మన తెలంగాణ/హైదరాబాద్ : జిల్లా రైతు సమన్వయ సమితిలో చోటు సంపాదించుకునేందుకు అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే సంబంధిత జిల్లాల ఇంఛార్జ మంత్రులు జాబితాను సిద్ధం చేసి వ్యవసాయ శాఖకు పంపగా, అధికారులు సిఎం కె.చంద్రశేఖర్‌రావుకు నివేదించారు. సమితుల్లో చోటు కోసం, కో ఆర్డినేటర్ నియామకం కోసం ఎంఎల్ఎలు, ఎంపిలు, టిఆర్ఎస్ జిల్లా కార్యవర్గాల నుంచి తీవ్రస్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒక సీనియర్ ఎంపి ఏకంగా ఒక ఎంపిపి, మాజీ డిసిసిబి ఛైర్మన్ రెండు పేర్లను సూచించి అందులో ఒకరిని జిల్లా కో ఆర్డినేటర్‌గా నియమించాలని లేఖ ద్వారా కోరడం గమనార్హం. రాజకీయంగా ఎక్కువగా ఉపయోగపడేవారిని జిల్లా కో ఆర్డినేటర్‌గా నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే జిల్లా సమితులలో సభ్యులుగా ఎంపిక కానున్న వారిలో చాలామంది మండల రైతు సమన్వయ సమితులలో సభ్యులుగా లేనట్లు తెలిసింది. అయితే ప్రభుత్వం మాత్రం మండల సమితుల్లో నుంచే జిల్లా సమన్వయ సమితులకు సభ్యులను ఎంపిక చేయాలని గతంలో ఉత్తర్వులు జారీ చేసింది.

క్రిస్ లిన్‌కు గాయం..ఐపిఎల్‌కు అనుమానమే!



ఆక్లాండ్: ఆస్ట్రేలియా విధ్వంసకర ఆటగాడు క్రిస్ లిన్ మరోసారి గాయం బారిన పడ్డాడు. దీంతో ఈ సీజన్‌లో అతను ఐపిఎల్ బరిలోకి దిగడంపై అనుమానాలు నెలకొన్నాయి. ఇది ఐపిఎల్ ఫ్రాంఛైజీ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు పెద్ద షాక్‌గానే చెప్పవచ్చు. ముక్కోణపు టోర్నీలో భాగంగా న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన ఫైనల్ సందర్భంగా లిన్ గాయపడ్డాడు. కివీస్ ఆటగాడు టైలర్ కొట్టిన బంతిని ఆపే క్రమంలో లిన్‌కు గాయమైంది. టైలర్ కొట్టిన షాట్‌ను అడ్డుకునేందుకు లిన్ డైవ్ చేశాడు. ఈ క్రమంలో అతని కుడిచేతి భుజానికి గాయమైంది. ఆ వెంటనే క్రిస్‌లిన్‌ను ఆసుపత్రికి తరలించారు. అక్కడ జరిపిన వైద్య పరీక్షల్లో ఎడమ చేతి భుజం ఎముకకు గాయమైనట్టు తేలింది. వైద్యుల సూచన మేరకు లిన్ బ్రేస్ ధరించి మళ్లీ స్టేడియానికి వచ్చాడు. లిన్‌కు అవసమైతే శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారు. అయితే లిన్ మాత్రం గాయం మరి పెద్దదేమి కాదని, ఐపిఎల్ ప్రారంభం నాటికి కోలుకుంటాననే నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. కాగా, త్వరలో ప్రారంభమయ్యే పాకిస్థాన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌కు లిన్ దూరమయ్యాడు. ఈ టోర్నీలో అన్ని మ్యాచ్‌లకు అతను అందుబాటులో ఉండడం లేదు. అంతేగాక ఐపిఎల్‌లో కూడా లిన్ బరిలోకి దిగే అవకాశాలు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి.

మహి, మనీష్ మెరుపులు

భారత్ 188/4, సఫారీతో రెండో టి-20



సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో ట్వంటీ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 188 పరుగుల భారీ స్కోరును సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ తన పేలవమైన ఫాంను ఈ మ్యాచ్‌లోనూ కొనసాగించాడు. తొలి ఓవర్‌ను ధావన్ మెయిడిన్ ఆడాడు. రెండో ఓవర్ తొలి బంతికే రోహిత్ శర్మ పెవిలియన్ చేరాడు. జూనియర్ డాలా వేసి మొదటి బంతికి రోహిత్ వికెట్ల ముందు దొరికి పోయాడు. అప్పటికీ జట్టు ఖాతానే తెరవలేదు. తర్వాత వచ్చిన సీనియర్ ఆటగాడు సురేశ్ రైనాతో కలిసి మరో ఓపెనర్ శిఖర్ ధావన్ దూకుడుగా ఆడాడు. ఇద్దరు విజృంభించడంతో స్కోరు పరిగెత్తింది. అద్భుత ఫాంలో ఉన్న ధావన్ ఈ మ్యాచ్‌లో కూడా దాన్ని కొనసాగించాడు. సౌతాఫ్రికా బౌలర్లను హడలెత్తిస్తూ ముందుకు సాగాడు. ఈ క్రమంలో 14 బంతుల్లోనే మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 24 పరుగులు చేశాడు. అయితే ధాటిగా ఆడుతున్న అతన్ని డుమిని పెవిలియన్ పంపించాడు. ఆ వెంటనే కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా వెనుదిరిగాడు. జూనియర్ డాలా బౌలింగ్‌లో కోహ్లి (1) ఔటయ్యాడు. దీంతో భారత్ 45 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది.

మనీష్ జోరు.. ధోని ధనాధన్

ఒకవైపు వికెట్లు పడుతున్నా సురేశ్ రైనా జోరును కొనసాగించాడు. అతనికి మనీష్ పాండే అండగా నిలిచాడు. ఇద్దరు కలిసి నాలుగో వికెట్‌కు 45 పరుగులు జోడించారు. కాగా ఐదు బౌండరీలతో 30 పరుగుల చేసిన రైనాను ఫెలుక్‌వాయో వెనక్కి పంపాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోని అండతో మనీష్ పాండే చెలరేగి పోయాడు. ఇద్దరు సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ స్కోరును ముందుకు నడిపించారు. ధోని జాగ్రత్తగా ఆడగా పాండే చెలరేగి పోయాడు. కళ్లు చెదిరే షాట్లతో సఫారీ బౌలర్లను హడలెత్తించాడు. అతను విజృంభించడంతో స్కోరు వేగాన్ని అందుకుంది. చూడచక్కని షాట్లతో అలరించిన పాండే పరుగుల వరద పారించాడు. ధోని కూడా అడపాదడపా భారీ షాట్లు కొడుతూ తనవంతు పాత్ర పోషించాడు. వీరిని కట్టడి చేసేందుకు ప్రత్యర్థి కెప్టెన్ తరచూ బౌలర్లను మార్చినా ఫలితం లేకుండా పోయింది. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన మనీష్ పాండే 48 బంతుల్లో ఆరు ఫోర్లు, మరో మూడు సిక్సర్లతో 79 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరోవైపు చెలరేగి ఆడిన ధోని 28 బంతుల్లోనే 4ఫోర్లు, మరో మూడు భారీ సిక్సర్లతో 52 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. దీంతో భారత్ స్కోరు 4 వికెట్లకు 188 పరుగులకు చేరింది. చివరి పది ఓవర్లలో భారత్ వంద పరుగులు సాధించడం విశేషం.



మహిళల టి-20 రద్దు

సెంచూరియన్: భారత్–దక్షిణాఫ్రికా జట్ల మధ్య బుధవారం జరిగిన నాలుగో ట్వంటీ–20 మ్యాచ్ వర్షం వల్ల రద్దయ్యింది. భారీ వర్షం కారణంగా గ్రౌండ్ చిత్తడిగా మారడంతో ఒక్క ఇన్నింగ్స్ కూడా పూర్తి కాకుండానే మ్యాచ్‌ను రద్దు చేయక తప్పలేదు. టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. అయితే నిర్ణయం తప్పని తేలిపోయింది. దక్షిణాఫ్రికా ఓపెనర్లు లిజెల్లి లి, కెప్టెన్ నికర్క్ జట్టుకు అద్భుత శుభారంభాన్ని ఇచ్చారు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే అడపాదడపా ఫోర్లు, సిక్స్‌లు కొడుతూ స్కోరు వేగం తగ్గకుండా చూశారు. ఈ జోడీని విడగొట్టేందుకు భారత బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చెలరేగి ఆడిన లి 38 బంతుల్లోనే ఐదు భారీ సిక్సర్లు, మరో రెండు బౌండరీలతో 58 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. మరోవైపు కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన నికర్క్ ఆరు ఫోర్లు, మరో రెండు సిక్సర్లతో 47 బంతుల్ల 55 పరుగులు సాధించింది. ఈ క్రమంలో లితో కలిసి తొలి వికెట్‌కు 12.3 ఓవర్లలోనే 103 పరుగులు జోడించింది. తర్వాత వచ్చిన ట్రయాన్ (2), సూనె లూస్ (5) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరాడు. డు ప్రిజ్ 2 పరుగులతో నాటౌట్‌గా ఉంది. కాగా, 15.3 ఓవర్లలో సౌతాఫ్రికా స్కోరు 3వికెట్ల నష్టానికి 130 పరుగులు ఉన్నప్పుడు వర్షం మొదలైంది. వర్షం వీడక పోవడంతో మ్యాచ్‌ను రద్దు చేయక తప్పలేదు. కాగా, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2–1 ఆధిక్యంలో ఉంది. తొలి రెండు మ్యాచుల్లో భారత్ విజయం సాధించగా, మూడో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలుపొందింది. ఈ మ్యాచ్ రద్దు కావడంతో ఇరు జట్లకు చివరి మ్యాచ్ కీలకంగా మారింది. సిరీస్‌ను సమం చేయాలంటే దక్షిణాఫ్రికా ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాలి. ఒక వేళ భారత్ ఓడిపోయినా సిరీస్ సమమవుతోంది.

హైదరాబాద్‌కు షాక్

• సెమీస్‌లో కర్ణాటక, మహారాష్ట్ర • విజయ హజారే ట్రోఫీ





న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మకమైన విజయ హజారే వన్డే టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి పాలైంది. బుధవారం ఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కర్ణాటక 103 పరుగుల తేడాతో హైదరాబాద్‌ను ఓడించి సెమీఫైనల్‌కు చేరుకుంది. మరో క్వార్టర్ ఫైనల్లో మహారాష్ట్ర ఏడు వికెట్ల తేడాతో పటిష్టమైన ముంబయిపై సంచలన విజయం సాధించి సెమీస్ బెర్త్‌ను దక్కించుకుంది. కాగా, హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో కర్ణాటక పూర్తి ఆధిపత్యం చెలాయించింది. లీగ్ దశలో అద్భుతంగా రాణించిన హైదరాబాద్ నాకౌట్‌లో ఆ దూకుడును కొనసాగించడంలో విఫలమైంది. ముందుగా బ్యాటింగ్ చేసిన కర్ణాటక 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 347 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 42.5 ఓవర్లలో 244 పరుగులకే కుప్పకూలింది. కర్ణాటక బౌలర్లు శ్రేయస్ గోపాల్, స్టువర్ట్ బిన్నీ అద్భుత బౌలింగ్‌తో హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. అద్భుత బౌలింగ్‌ను కనబరిచిన గోపాల్ 31 పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. బిన్నికు మూడు వికెట్లు లభించాయి. హైదరాబాద్ జట్టులో అంబటి రాయుడు కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడినా ఫలితం లేకుండా పోయింది. కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో హైదరాబాద్‌కు ఓటమి తప్పలేదు. కీలక ఇన్నింగ్స్ ఆడిన రాయుడు ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 64 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రవితేజ 9 ఫోర్లతో 53 పరుగులు చేశాడు. బి.సందీప్ మూడు ఫోర్లతో 42 పరుగులు సాధించాడు. చివర్లో హైదరాబాద్ వరుస క్రమంలో వికెట్లు కోల్పోవడంతో ఓటమి తప్పలేదు.

మయాంక్, రవి శతకాలు...

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటకను మయాంక్ అగర్వాల్, రవికుమార్ సమర్థ్ ఆదుకున్నారు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన కెప్టెన్ కరుణ్ నాయర్ (10) ప్రారంభంలోనే వెనుదిరిగాడు. అయితే వన్‌డౌన్‌లో వచ్చిన రవికుమార్‌తో కలిసి మరో ఓపెనర్ మయాంక్ అగర్వాల్ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచాడు. ఇద్దరు హైదరాబాద్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. చెలరేగి ఆడిన మయాంక్ 111 బంతుల్లో ఏడు సిక్సర్లు, మరో 12 ఫోర్లతో 140 పరుగులు చేశాడు. రవికుమార్ 13 ఫోర్లతో 125 పరుగులు సాధించాడు. దీంతో కర్ణాటక 347 పరుగుల భారీ స్కోరును సాధించింది.

ముంబయి ఇంటికి...

మరో క్వార్టర్ ఫైనల్లో పటిష్టమైన ముంబయి ఓటమి పాలైంది. ఢిల్లీలోనే జరిగిన ఈ మ్యాచ్‌లో మహారాష్ట్ర ఏడు వికెట్ల తేడాతో ముంబయిని ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబయి 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ 69 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ (35), ధావల్ కులకర్ణి 23 (నాటౌట్) తప్ప మిగతావారు విఫలమయ్యారు. స్టార్ ఆటగాడు పృథ్వీషా (14), కెప్టెన్ ఆదిత్య తారె (16), సిద్ధార్థ్ (5) నిరాశ పరిచారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన మహారాష్ట్ర 46.5 ఓవర్లలోనే కేవలం మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్ శ్రీకాంత్ 9 ఫోర్లు, ఒక సిక్స్‌తో 70 పరుగులు చేశాడు. నౌశాద్ షేక్ 51 (నాటౌట్), అంకిత్ బావ్నె 37 (నాటౌట్) తమవంతు పాత్ర పోషించారు. కాగా, కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన రాహుల్ త్రిపాటి 49 పరుగులు చేశాడు. దీంతో మహారాష్ట్రకు సెమీస్ బెర్త్ దక్కింది.

సెమీఫైనల్లో మెదక్ మావెరిక్స్



మన తెలంగాణ/ హైదరాబాద్: హెచ్‌సిఎ ఆధ్వర్యంలో జరుగుతున్న వెంకటస్వామి స్మారక ట్వంటీ–20 టోర్నమెంట్‌లో మెదక్ మావెరిక్స్ సెమీఫైనల్‌కు చేరుకుంది. బుధవారం సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన కీలక మ్యాచ్‌లో మెదక్ ఆరు వికెట్ల తేడాతో నల్లగొండ లయన్స్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన నల్లగొండ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. వరుణ్ గౌడ్ 3ఫోర్లతో 53 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. ఆశీష్ రెడ్డి (28), శశిధర్ రెడ్డి (18) తమవంతు సహకారం అందించారు. మెదక్ బౌలర్లలో ప్రణీత్ 4 ఓవర్లలో 18 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. మరో బౌలర్ మికిల్ జైస్వాల్ కూడా 4 ఓవర్లలో 21 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీశాడు. దీంతో నల్లగొండ తక్కువ స్కోరుకే పరిమితమైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన మెదక్ మరో బంతి మిగిలివుండగానే కేవలం 4వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. మికిల్ జైస్వాల్ అద్భుత బ్యాటింగ్‌తో మెదక్‌ను ఆదుకున్నాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన జైస్వాల్ 47 బంతుల్లో 4ఫోర్లు, రెండు సిక్స్‌లతో 54 పరుగులు చేశాడు. ఓపెనర్ అభిరథ్ రెడ్డి 23 కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో సంతీష్ గౌడ్ 24 బంతుల్లో రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో 32 (నాటౌట్), సమిత్ రెడ్డి 18 (నాటౌట్) రాణించడంతో మెదక్ విజయాన్ని అందుకుంది. ఆల్‌రౌండ్‌షో జట్టును సెమీస్‌కు చేర్చిన మికిల్ జైస్వాల్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది. కాగా, జట్టు సెమీస్‌కు చేరడంపై మెదక్ మావెరిక్స్ యజమాని జగన్మోహన్ రావు సంతోషం వ్యక్తం చేశారు. జట్టు విజయానికి కారకులైన క్రికెటర్లను, కోచ్ నోయల్ డేవిడ్‌లను ఆయన అభినందించారు. కాగా, విప్లవ్ కుమార్, సంజీవ్ రెడ్డిలు కూడా మెదక్ విజయంపై ఆనందం వ్యక్తం చేశారు.



ధోనితో కలిసి ఆడడం ఎంతో ఇష్టం : హర్భజన్

న్యూఢిల్లీ: మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్సీలో ఆడాలంటే తనకు ఎంతో ఇష్టమని టీమిండియా వెటరన్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అన్నాడు. కెప్టెన్‌గా ధోని జట్టును నడిపించే తీరు తనను ఎంతో ఆకట్టుకుంటుందన్నాడు. అతని సారథ్యంలో ఎన్నో అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన తాను అతని నాయకత్వ లక్షణాలను దగ్గరుండి చూశానన్నాడు. క్లిష్ట సమయంలో కూడా జట్టును ఎంతో ధైర్యంతో ముందుకు నడిపించే సత్తా ధోని సొంతమన్నాడు. టీమిండియాకు లభించిన అత్యుత్తమ కెప్టెన్లలో ధోని ఒకడన్నాడు. అతనిలాంటి కెప్టెన్, క్రికెటర్ లభించడం భారత్ అదృష్టమని పొగడ్తలతో ముంచెత్తాడు. తాజాగా ఐపిఎల్‌లో ధోని సారథ్యంలో ఆడనుండడం తనకు కొత్త అనుభూతిని ఇస్తుందనడంలో సందేహం లేదన్నాడు. అతని కెప్టెన్సీలో ఆడేందుకు తాను ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నానని తెలిపాడు. కాగా, ఐపిఎల్‌లో ముంబయితో తనకు పదేళ్ల అనుబంధం ఉందన్నాడు. ఆ జట్టును వీడి మరో జట్టుకు ప్రాతినిధ్యం వహించడం కొంత కష్టమేనన్నాడు. అయితే తనపై జట్టు యాజమాన్యం ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతాననే ధీమాను హర్భజన్ వ్యక్తం చేశాడు. ఈ సీజన్‌లో తాను చెన్నై తరపున బరిలోకి దిగడాన్ని ఛాలెంజ్‌గా తీసుకుంటున్నానని, మెరుగైన ఆటతో జట్టును ఆదుకోవడమే తన ఏకైక లక్ష్యమన్నాడు. దీని కోసం పటిష్టమైన ప్రణాళికతో సిద్ధమవుతున్నట్టు హర్భజన్ వివరించాడు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హర్భజన్ ఈ విషయాలు వెల్లడించాడు.

ముక్కోణపు టోర్నీ విజేత ఆస్ట్రేలియా





ఆక్లాండ్: ట్రాన్స్–టాస్మన్ ముక్కోణపు ట్వంటీ–20 టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియా ట్రోఫీ గెలుచుకుంది. బుధవారం జరిగిన ఫైనల్లో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం 19 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించి ట్రోఫీని సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 14.4 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 121 పరుగులు సాధించింది. ఈ సమయంలో వర్షం రావడంతో మ్యాచ్ అక్కడే ఆగిపోయింది. దీంతో ఫలితాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నిర్ణయించారు. అప్పటికే మెరుగైన స్థితిలో నిలిచిన ఆస్ట్రేలియాను రిఫరీ విజేతగా ప్రకటించాడు. ఈ టోర్నమెంట్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌లు గెలిచిన ఆసీస్ అజేయంగా ట్రోఫీని సొంతం చేసుకుంది. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఓపెనర్ షార్ట్ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చాడు. అతనికి కెప్టెన్ డేవిడ్ వార్నర్ అండగా నిలిచాడు. కివీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న షార్ట్ భారీ షాట్లతో అలరించాడు. చెలరేగి ఆడిన షార్ట్ 30 బంతుల్లోనే ఆరు ఫోర్లు, మరో మూడు భారీ సిక్సర్లతో 50 పరుగులు చేసి మున్రో బౌలింగ్‌లో ఔటయ్యాడు.

మరోవైపు సమన్వయంతో బ్యాటింగ్ చేసిన వార్నర్ రెండు ఫోర్లతో 25 పరుగులు చేశాడు. కాగా, మాక్స్‌వెల్ ఒక సిక్స్‌తో అజేయంగా 18 పరుగులు చేశాడు. అరోన్ ఫించ్ 18 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. ఈ సమయంలో వర్షం రావడంతో మ్యాచ్ ముందుకు సాగలేదు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ 9 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లు కచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేయడంతో కివీస్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. ఓపెనర్లు కొలిన్ మున్రో 14 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 29, మార్టిన్ గుప్టిల్ రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో 15 బంతుల్లోనే 21 పరుగులు చేసి మెరుగైన ఆరంభాన్ని ఇచ్చారు. అయితే ఇద్దరు ఎక్కువ సేపు క్రీజులో నిలువడంలో విఫలమయ్యారు. తర్వాత వచ్చిన వారిలో రాస్ టైలర్ 43 (నాటౌట్) తప్ప మిగతావారు విఫలమయ్యారు. ఆసీస్ జట్టులో అస్టన్ అగర్ మూడు వికెట్లు తీశాడు. అతనికి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. సిరీస్‌లో నిలకడగా రాణించిన ఆస్ట్రేలియా విధ్వంసక ఆటగాడు మాక్స్‌వెల్‌కు మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు దక్కింది.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.